
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్





# యుగశక్తి గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ    సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి

సంపుటి 10 - సంచిక 8
**డిశంబర్ 2009**
**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 110**
**3 సం॥ చందా రూ॥ 310**
**10 సం॥ చందా రూ॥ 1050**

Please send drafts in favour of
SRI VEDAMATA
GAYATRI TUST
BUSINESS DIVISION,
HYDERABAD


## ఈ సూత్రాలను పాటిస్తే - ఆనందమే ఆనందం

మనిషి ఆనందాన్ని వెదుకుతూ ఉంటాడు. ఈ ఆనందం మనస్సు యొక్క ఆంతరిక వ్యవస్థ అని ఋషులు బోధించారు. దిగువ సూత్రాలను అమలుచేస్తే, ఆ ఆనందం అందే మార్గం దొరుకుతుంది.

**1) తన శరీరం పట్ల సరైన దృక్పథం :** ఈ శరీరం భోగ సాధనం కాదు. ఉన్నత స్థాయి వికాస యాత్రలో ముందుకు పోవడానికి అందిన ఒక దుర్లభ సాధనం. జీవితంలోని మహత్తర అవకాశాలు, బీజాలు మొలకెత్తడానికి ఉవ్విళ్ళూరుతూ ఈ శరీరం లోపల రహస్య కేంద్రంలో ఉన్నాయి. కనుక-శరీరానికి పుష్టికరమైన ఆహారం, సంయమనంతో కూడిన విహారం, తగినంత శ్రమ-విశ్రాంతి ఇవ్వాలి.

**2) వర్తమానంలో జీవించు :** వర్తమానంలో ఉన్నదానిపై మీ దృష్టిని కేంద్రీకరించాలి. ఈ దారిలో వచ్చిన ప్రతిదాన్నీ పూర్తిగా స్వీకరించాలి, ఎదుర్కొనాలి. దానినుండి తగు పాఠాన్ని గ్రహించి, దానికి వీడ్కోలు చెప్పాలి. గతకాలపు తీపి జ్ఞాపకాలనూ, భవిష్యత్తులోని ఆశలనూ మీ శక్తులుగా మలచుకోవాలి. వాటిలో మునిగిపోయి, వర్తమానాన్ని నష్టపరచుకోకూడదు.పశ్చాత్తాపాలూ, రేపటి చింతలూ మీ కర్తవ్య నిష్ఠకు ఆటంకాలు కాకూడదు. మనం వర్తమానాన్ని సక్రమంగా వినియోగించుకుంటే-గతకాలపు మచ్చలు వాటికవిగా చెరిగిపోతూ ఉంటాయి; రేపటి చింతలు కరిగిపోతూ ఉంటాయి.

**3) ఆంతరిక ధ్వనిని అనుసరించు :** సమాజంలోని ఆచారాలను కట్టుబాట్లను నియమ నిబంధనలను అనుసరించడంలో ఒక్కోసారి సంశయం కలుగవచ్చు. అయితే ఆంతరిక ధ్వని అనే మహత్తర సూచిక మన లోపల ఉంది. చెడ్డదారిలో అడుగుపడగానే మన కాళ్ళు వణకుతాయి. అలాంటి పనిలో చేయిపెట్టగానే, అది వణకుతుంది. ఈ ఆంతరిక ధ్వని ఎంతో స్పష్టంగా ఉంటుంది. మనం దాన్ని ఉపేక్షించలేము. అయితే అది అత్యంత సూక్ష్మమైనది. దాన్ని సులువుగా అణచివేసి ముందుకుపోవచ్చు. అయితే-ఆంతరిక ధ్వనిగా అవతరించే ఈ దైవ సందేశాలను పాటించడం ఆనందానికి రాచబాట.

ఇంకా రోజులో కొద్ది క్షణాలను ఏకాంతంగా మననం, చింతన, ధ్యానం చేయడానికి కేటాయించుకోవాలి.

పత్రిక అందనివారు, పత్రికకు సంబంధించిన సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్లను సంప్రదించగలరు.
**(1) 9603509900 (2) 9032674117**

వ్యక్తి నిర్మాణమే సమాజ నిర్మాణం.

# విషయ సూచిక


1. **సంపాదకీయం :**
ఈ సూత్రాలను పాటిస్తే-ఆనందమే ఆనందం 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :**
మీ పట్ల మీరు పాపం చేయకండి 2
3. **వేదమంత్రం :** ప్రజలకు సరిఅయిన మార్గదర్శకులు కావాలి 3
4. **వర్తమాన భారతం :** అభివృద్ధికి సరి అయిన కొలబద్ద-జీవన శైలిలో మార్పు 4
5. **ఉపాసన-రెండు పాదాలు : జపం-ధ్యానం**
ధ్యానం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా? 7
6. **పరమపూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది :**
2400 కోట్ల మంత్రజపం 8
7. **బాలల భవితకు బంగారు బాట-2 :**
పేదరికం మనిషికే కాని మనసుకు కాదు 9
8. **ధారావాహిక : ప్రజ్ఞోపనిషద్-1**
ప్రథమ మండలం - ప్రథమాధ్యాయం 10
9. **తత్వచింతన :** ధర్మము పట్ల శ్రద్ధ జీవితానికి విలువ తెస్తుంది 12
10. **ధారావాహిక : పరమేశ్వరుని చిరునామా-7**
నిరాహారంగా కూడా ఉండవచ్చు 14
11. **మనం-మన ఆరోగ్యం :**
మనకు పోషణ ఇచ్చే తల్లి-నిద్ర 17
12. **ధారావాహిక : హనుమత్‌కథామృతం-20**
స్ఫూర్తిదాయకమైన సూర్యకిరణాలు-హనుమాన్ 19
13. **కుటుంబ నిర్మాణం :** బాల్యాన్ని రక్షించాలి 21
14. **ధారావాహిక : భక్తిగాథ-25 :**
సమస్త కోరికలను నశింపచేసేదే భక్తి 23
15. **ప్రత్యేక వ్యాసం : దత్తాత్రేయ జయంతి సందర్భంగా**
దత్తాత్రేయుడు-24మంది గురువులు 25
16. **చతుర్ముఖీ సాధన : గురుదేవుల అమృతవాణి-1**
నిస్వార్థంగా దేవునికి సహకరిద్దాం 28
17. **మహిళాజాగరణ :**
మాతృ సత్తాత్మక సమాజం తిరిగిరావచ్చు 30
18. **ఆధ్యాత్మిక విజ్ఞానం :**
ఆధ్యాత్మిక వైజ్ఞానికత మూలకేంద్రం - హిమాలయాలే 33
19. **సంస్కృతీ మూర్తి పరమపూజ్యగురుదేవులు :**
సౌత్రామణి ప్రయోగం-యుగ పరివర్తన 35
20. **జీవించేకళ :** కళలకు శిఖరాగ్రం జీవించేకళ 37
21. **ఇతరుల దోషాలను చూడకండి** 39
22. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం-68**
కొత్త సాధకుల కోసం పిలుపు 40
23. **నా వారితో నా మాట :** శతజయంతి ఉత్సవాల రూపురేఖలు-11 యువతకు మార్గదర్శనం ఎలా చేయాలి 42
24. ఏ పుస్తకంలో ఏమున్నది? 44
25. **వరదభీభత్సం-గాయత్రీ పరివార్ ఆంధ్రప్రదేశ్ శాఖ**
సహాయ కార్యక్రమాలు (ఒక నివేదిక) 45
26. **వార్తలు** 47




# సద్గురు వచనామృతం

## మీ పట్ల మీరు పాపం చేయకండి

మీరు భగవంతుని ప్రతినిధి. మీరు సర్వశ్రేష్ఠమైన శక్తి పుంజం. మరి అలాంటపుడు మిమ్మల్ని దీనులుగా, హీనులుగా, దురదృష్టవంతులుగా, పరిగణించుకోవటానికి మీకేమి అధికారమున్నది? భగవంతుణ్ణి మీరు అవమానించలేరు. ఈశ్వరత్వం ప్రపంచం యొక్క మౌలికమైన క్రియాత్మక శక్తి. అది ప్రపంచంలో అన్నింటికంటే శ్రేష్ఠమైనది. సత్యం, శివం, సుందరాలకు శిఖరాగ్రమైనది ఈశ్వరత్వం. అది మీ రక్తమాంసాలలో ప్రవహిస్తున్నది.

మీరు మీ పట్ల సద్వ్యవహారం జరపండి. మీరు ఇతరుల మేలు కోరుతారు. మీ కుమారుని విద్య, ఆరోగ్యం కోసం, కీర్తి కోసం, హితం కోసం మీరు నానా యాతనలూ పడతారు. భార్య, పిల్లలు, బంధువుల ప్రయోజనాలను గురించి నిరంతరం ఆలోచిస్తూ ఉంటారు. ఇతరుల శ్రేయస్సును కోరటం మంచిదే. దానికంటే ఉత్కృష్ట మార్గం హితాన్ని గురించి ఆలోచించడం. ఇతరులకు చెడు చేయటం పాపమని మీరంటారు. ఈ దుశ్చర్యని మీరు అసహ్యించుకుంటారు. మంచిదే. కాని మీరు మీ విషయంలో నిందనీయమైన ఆలోచన చేయడం మరింత ఘోరమైన పాపం. ఇతరులపట్ల చేసిన పాపాన్ని ప్రపంచం చూస్తుంది. కానీ మీరు మీ పట్ల చేసిన పాపం కంటికి కనపడదు. అంతరాత్మ అంతర్ దృష్టితో దాన్ని చూస్తుంది. అది అపుడపుడు మిమ్మల్ని చీవాట్లు పెడుతుంది కాని, దాని ఆదేశాలను ఉపేక్షిస్తే అది క్షీణించి పోతుంది.

*(అఖండజ్యోతి, జనవరి, 1952, 8వపుట)*

*అనువాదం-ఊటుకూరు సత్యనారాయణ గుప్త*

## పండుగలు

**డిసెంబర్ 2009**

| | |
|---|---|
| 01-12-09 | దత్తాత్రేయ జయంతి |

**జనవరి 2010**

| | |
|---|---|
| 12-01-10 | స్వామి వివేకానంద జయంతి |
| 15-01-10 | మకర సంక్రాంతి |
| 26-01-10 | గణతంత్ర దినోత్సవం |

**కుటుంబాన్ని పోషించడమే కాదు. నిర్మాణంకూడా చేయాలి.**

వేద మంత్రం

# ప్రజలకు సరిఅయిన మార్గదర్శకులు కావాలి

**యాం రక్షన్త్యస్వప్నా విశ్వదానీం దేవా భూమిం పృథివీమప్రమాదమ్ ।**

**సా నో మధు ప్రియం దుహామథో ఉక్షతు వర్చసా ॥**

**(అథర్వవేదం 12/1/7)**

**భావార్థం :** దేశనిర్మాణం కొరకు నాగరికులమైనమనమంతా కర్మశీలురం, జాగరూకులం కావాలి. ఏ దేశంలో సోమరులు, అజాగ్రత్తపరులు ఉంటారో ఆ దేశం బానిసగా అవుతుంది.

**సందేశం :** దేశ ఉన్నతికోసం ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ఆర్థిక, పారిశ్రామిక, శీలనిర్మాణం - అన్నిరంగాలలో ప్రగతి తప్పనిసరి. అప్పుడే ఆరోగ్యవంతమైన, శక్తిశాలియైన, సమర్థవంతమైన దేశం నిర్మాణమవుతుంది. ఒకప్పుడు భారతదేశం జగద్గురువుగా పిలువబడేది. వర్ణవ్యవస్థ యొక్క ఆరోగ్యవంతమైన పరంపరకు అనుగుణంగా నాగరికులందరూ జాగరూకులై నిరంతరం కర్మశీలురుగా ఉండేవారు. వారు తమ ఉన్నతిని పొందుతూనే, దేశం యొక్క నాలుగురకాల వికాసాన్ని చేస్తుండేవారు.

కాలాంతరంలో మన నాగరికులను సోమరితనం, అజాగ్రత్త చుట్టుముట్టడం ప్రారంభమైంది. అనేకానేక దుష్ప్రవృత్తులు తలెత్తడం మొదలైంది. సోమరితనం అన్ని పాపములకు మూలం. పరమేశ్వరుడు చైతన్యవంతులను, శ్రమించేవారినే ప్రేమిస్తాడు-సోమరులను, అజాగ్రత్తపరులను కాదు. పురుషార్థం చేయడంలో తత్పరులైన వారికి సహాయం చేయడంలో పరమాత్మ వెనుకబడడు. సోమరులైన వ్యక్తులు అదృష్టాన్ని నమ్ముకొని కూర్చుని ఉంటారు, వారు దీనులు, హీనులుగా మిగిలిపోతారు. **'సహోరురోహహితః'**, ప్రయత్నశీలురే ఉన్నతి పొందుతారు. బలశాలురు, కర్తవ్యపరాయణులు, నిజాయితీపరులు, సమర్థులైన వ్యక్తులే జీవిత లాభాన్ని పొందుతారు. సోమరులు, అజాగ్రత్త పరులు, భీరువులు, సందేహమనస్కులైన మనుష్యులు ఉన్నతి పొందలేరనేది-దేశ నిర్మాణంలోని మూలమంత్రం. నేడు పరిస్థితి తిరుగబడింది. వైజ్ఞానిక ప్రగతితో సుఖ-సౌకర్యాలు ఎంత పెరిగాయో మనిషి అంత సోమరిగా పనిదొంగగా తయారయ్యాడు. పైనుండి క్రిందిదాకా అందరూ ఏ పని చేయకుండా ఎక్కువలో ఎక్కువ ధనం, సంపత్తి ఎలా వశం చేసుకోవాలా అనే మాయలో ఇరుక్కుపోయారు. ఎవరైనా పురుషార్థం చేస్తుంటే పాపపు ఉద్దేశ్యాలతో చేస్తున్నారు. ఫలితంగా దొంగతనం, బందిపోటు, భ్రష్టాచారం, విలాసంగా ఖర్చు చేయుట, కిడ్నాప్ (ఎత్తుకుపోవుట) మొదలైనవి సమాజంలో పెరిగిపోతున్నాయి. రోజు రోజూ క్రొత్త క్రొత్త దుష్ప్రవృత్తులు పుట్టుకొస్తున్నాయి.

మొదట్లో ఆచార్యుల ఉపదేశాలు, రాజదండన-రెండూ దేశ అభ్యుదయం గురించి ప్రజలను జాగరూకులుగా చేస్తుండేవి. నేడు వారే స్వయంగా అంధులై భ్రష్ట ఆచరణ చేస్తున్నారు. మరొకసారి దేశం పరాధీనమయ్యేంతగా వివశురాలిని చేసేటంత నికృష్టస్థాయికి దిగజారిపోతున్నారు. మొదట దేశం రాజకీయ పరాధీనతకు గురైతే నేడు సాంస్కృతిక ఆర్థిక పరాధీనతవైపు నెట్టివేయబడుతున్నది. జన సామాన్యాన్ని తమదైన ప్రాచీన గౌరవమయ సంస్కృతి నుండి విముఖుల్ని చేసి, తమ జన్మభూమి నుండి దూరమయ్యేటట్లు ఒక అప సంస్కృతి మోహజాలంలో ఇరికిస్తున్నారు. భౌతికవాద అభిజాత్య వర్గం ఈ క్రొత్త సంస్కృతిని స్వీకరించడంలో తమ గొప్పతనాన్ని భావించి ఆచార వ్యవహారాలు, మాటతీరు ప్రతి సందర్భంలోనూ పశ్చిమ సంస్కృతిని అనుకరించి గర్విస్తున్నారు. ఫలితంగా వారు ఇంటికీ దక్కరు, వీధికీ దక్కరు.

విద్వాంసులు, బ్రాహ్మణులు స్వయంగా జాగరూకులై నాగరికులకు సరియైన దిశచూపుతూ కర్మశీలురయ్యేందుకు ప్రేరణ యివ్వాలి.

★★★

స్నేహం నిద్రపోతే ద్వేషం పనిచేస్తుంది. ద్వేషాన్ని నిద్రపుచ్చి స్నేహానికి పని చెప్పు.

వర్తమాన భారతం

# అభివృద్ధికి సరి అయిన కొలబద్ద - జీవన శైలిలో మార్పు

## అభివృద్ధి అంటే ఏమిటి?

21వ శతాబ్ది ప్రథమ దశకంలో చివరి సంవత్సరంలో అడుగుపెట్టబోతూ ఉన్నాం. అయినప్పటికీ ఒక యక్ష ప్రశ్న మన ముందు నిలబడి ఉంది. "అభివృద్ధికి కొలబద్ద ఏమిటి?" దానికి సరి అయిన పరిభాష ఏమిటి? దేని ఆధారంగా మనం అభివృద్ధి చెందుతున్నామని చెప్పుకోవాలి? ఇప్పటి వరకు మన పయనం ఎంత వరకు సాగింది? ఇంకా ఎంతవరకు సాగాలి? మొదలైనవన్నీ ఎన్నెన్నో ఉపప్రశ్నలు.

వైజ్ఞానికంగా ఉన్నత శిఖరాలను తాకుతూ ఉన్నాం. కానీ మానవ జాతి సమగ్ర వికాసానికి సంబంధించి సరి అయిన పరిభాషను నిర్ణయించలేకపోతున్నాం. పెద్ద పెద్ద పట్టణాలు, ఫ్లై ఓవర్లు, సూపర్‌మార్కెట్లు, మెట్రోలు, పెద్దపెద్ద భవనాలు, రోడ్ల మీద పరుగులు తీస్తున్న రకరకాల కార్లు మొదలైనవన్నీ అందరికీ కనిపిస్తున్నాయి. ప్రపంచదేశాలన్నీ ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతూ ఉంటే భారతదేశం మాత్రం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నదని మురిసిపోతూ ఉన్నాం. కానీ అభివృద్ధికి సరి అయిన పరి భాష లేకుండా ఇదంతా అభివృద్ధే అనుకుందాం. అలాంటప్పుడు మానసిక అశాంతితో వేలాది సంఖ్యల ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయి? అంతుపట్టని కొత్తకొత్త రోగాలతో ఎందుకు బాధ పడుతున్నారు? ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కుటుంబ వ్యవస్థ ఎందుకు ఛిన్నా భిన్నం అయిపోతోంది? పశ్చిమదేశాలవైపు చూస్తే భౌతికవాదం సన్నగిల్లుతోంది. వారంతా భారతీయ సంస్కృతిని ఆరాధిస్తున్నారు. యోగాభ్యాసాలు చేస్తున్నారు. ఆధ్యాత్మికంగా శాంతికి మార్గాలు వెతుక్కుంటున్నారు. కానీ భారతీయులు మాత్రం భౌతిక వాదంవైపు పరుగులు తీస్తున్నారు. క్షణిక సుఖాలకోసం అర్రులుచాస్తున్నారు. ఇది అభివృద్ధికి కొలబద్దకాదు. ఆంగ్లభాషా వ్యామోహంలో మునిగిపోయిన ప్రజల కోసం స్కూల్సు, కాలేజీలు, లెక్కకు మిక్కిలిగా తెరుస్తున్నారు. రకరకాల యూనిఫారాలతో, డొనేషన్లతో బాలబాలికలను-వారి తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. ఇంజనీరింగ్ మెడికల్ కాలేజీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ ఉన్నాయి. ప్రపంచంలో ఉన్న భ్రష్టాచారం అంతా ఈ సంస్థలలోనే నిండి ఉంటోంది. ఇదంతా అభివృద్ధి అనుకుంటే అన్ని రకాల పతనం తప్పదు.

## గోవు-గ్రామం-వ్యవసాయం

భారతదేశంలో గోమాతకు అత్యున్నత స్థానం ఇవ్వబడింది. మన ధర్మంలో గోవును మాతగా ఆరాధిస్తాం. గోవునుండి లభించే సకల పదార్థాలు మలమూత్రాలతో సహా అన్నీ అత్యంత లాభాన్ని కలిగించేవే. ఆరోగ్యాన్ని అందించేవే. గో సంతతి వ్యవసాయానికి ప్రాణాధారం. అయినా గోవధ నిరాటంకంగా సాగిపోతుంది. అధిక లాభాలను అపేక్షించి గోమాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నాం. సౌందర్య సాధనాల ఉత్పత్తి కోసం ఆవుదూడలను హతమారుస్తున్నాం. పొలందున్నాల్సిన ఎద్దులను వధ్యశిలకు నైవేద్యం పెడుతున్నాం. ట్రాక్టరుతో వ్యవసాయం ఆరంభించాం. ఎద్దులను, ఆవులను పెంచడం ఒక జంజాటంగా భావిస్తున్నాం. ఇదంతా చేజేతులా తెచ్చుకున్న ముప్పు మాత్రమే అని తెలుసుకోలేకపోతున్నాం.

గోసంపదకు, పంటలకు ఆలవాలమైన గ్రామాలు కుంచించుకుపోతున్నాయి. బంగారాన్ని పండించే పంట భూములను అమ్ముకుని కోటీశ్వరులు అవుతున్నారు. కాని జీవించే కళ తెలియకపోవడంతో ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. త్రాగుడుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. సన్నకారు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి పైకి లేవలేకపోతున్నారు. ఫలితంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రతిభావంతులైన గ్రామీణయువత గ్రామాలను వదిలిపెట్టి పట్టణాలలో స్థిరపడుతోంది. నగరజీవితానికి ఆకర్షింపబడుతూ రెండింటికీ చెడినరేవడిలాగా ఆవారాగా తిరుగుతున్నారు. ఫలితంగా అవినీతిని ఆశ్రయిస్తున్నారు. గూండాలుగా తయారవుతున్నారు.

వీటన్నింటి ప్రభావం వ్యవసాయం మీద పడుతోంది. వృద్ధిచెందుతున్న పట్టణాలను చూచి మురిసిపోతున్నామే గాని జీవనాధారమైన పల్లెల్ని, పల్లెల ద్వారా లభించే పంటల్ని, పంటలు పండించే రైతుల్ని పూర్తిగా మరచిపోతున్నాం. పట్టణాలైతే వృద్ధి చెందుతూనే ఉన్నాయి.

**తపము ద్వారా మానవుని చెడుతలంపులు దహింపబడతాయి.**

### ఈనాటి ఆరాధ్య విషయాలు

ఈనాడు మన ఆలోచనలన్నీ వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా చుట్టూనే తిరుగుతూ ఉన్నాయి. పనీపాటాలేనివారు, రాజనీతిజ్ఞులు, సినిమా కళాకారులు భోగవిలాసాలలో మునిగి తేలుతూ ఉన్నారు. వారికి దేశంలో ఏమి జరుగుతూ ఉందో తెలియదు. తెలుసుకోరు. అభివృద్ధి పేరుతో మన సంస్కృతి వేర్లు కదిలిపోతున్నాయి. ఇప్పుడు చెప్పుకుంటూ ఉన్న అభివృద్ధివృక్షం ఎప్పుడో ఒకప్పుడు కూలిపోకతప్పదు. అన్ని మార్గాలూ పట్టణాలవైపే సాగిపోతున్నాయి. అందరిదృష్టిలో సుఖం అక్కడేలభిస్తుంది. "మనం కనే కలలన్నీ అక్కడే నెరవేరుతాయి. సర్వస్వం అక్కడే లభిస్తాయి. పట్టణాలే మన ఆరాధ్యదైవాలు. పట్టణాలే మన ఇష్టదేవతలు." ఇలాంటి ఆలోచనలతో ఈ అభివృద్ధి వెనుక దాగి ఉన్న వినాశనాన్ని ఎవ్వరూ గమనించడంలేదు.

### ఆపదలు పొంచి ఉన్నాయి-నీరు తరిగిపోతోంది

ప్రకృతి వైపరీత్యాలు వాటంతట అవి రావడం లేదు. మనమే ఆహ్వానిస్తున్నాం. ఎడారులు స్వయంగా ఏర్పడడంలేదు. మనమే తయారు చేస్తున్నాం. నదులు ఎండిపోవడం లేదు. మనమే ఎండగడుతున్నాం. భూగర్భంలో అట్టడుగున ఉన్న నీటిని కూడ తోడితోడి పూర్తి చేస్తున్నాం. ఇప్పుడు మనం చూస్తున్న ఆకాశ భవనాలు, వాటిల్లో నివసించే లక్షలాది ప్రజానీకానికి రాబోయే రోజుల్లో నీటిని ఎక్కడ నుండి సప్లై చేస్తాం? దీనిని గురించి ఎవ్వరూ ఆలోచించడం లేదు. బెంగుళూరు కావచ్చు, హైదరాబాదు కావచ్చు, ముంబై కావచ్చు, ఇంకా మహావేగంగా పెరిగిపోతున్న ఏ మహానగరమైనా కావచ్చు వీరందరికీ నీటిని సరఫరా చేయగలమా? రాబోయే యుద్ధాలు నీటికొరకు సాగినా ఆశ్చర్య పడవలసిన అవసరం లేదు.

### పరిష్కారం ఏమిటి?

గ్లోబల్ వార్మింగ్-జలవాయుకాలుష్యం-అతివృష్టి-అనావృష్టి మొదలైన వాటి గురించి ఈనాడు ప్రపంచ రాజ్యాలన్నీ చర్చిస్తున్నాయి. ఇదంతా ఎందుకు జరుగుతుందో మనకందరికీ తెలుసు. అయినా వాస్తవాన్ని అంగీకరించలేకపోతున్నాం. ప్రపంచ వ్యాప్తంగా అనేక సమావేశాలు జరుగుతున్నాయి. కాని పరిష్కారం మాత్రం లభించడంలేదు. ఇదంతా నీ మూలంగానే జరిగింది అంటే నీ మూలంగానే జరిగింది అంటూ దేశాధినేతలు వాదులాడుకుంటున్నారు. అంతేకాని ప్రకృతిని వంచించే పనులనుండి ఎవ్వరూ వెనక్కి తగ్గడం లేదు. "ఈ కృత్రిమ జీవన శైలిని ప్రక్కకు పెట్టు. ప్రకృతిలో జీవించడం మొదలుపెట్టు. ఇప్పుడు కావలసింది మహానగరాలుకావు. గ్రామోద్ధరణ. పల్లెల పునర్నిర్మాణం". అని చెప్పేనాథుడే లేదు. ఎయిర్ కండిషన్ గదుల్లో కూర్చుని వ్యవసాయం గురించి, నీటి కొరత గురించి, అడవులు తరిగిపోవడం గురించి చర్చించుకుంటే పరిష్కారం లభించదు. ఎక్కడ నష్టం జరిగిందో అక్కడి నుండే ప్రారంభించాలి.

### విద్యకు పీక నులిమివేస్తున్నాం

అభివృద్ధికి మూలాధారం విద్య. ఇతర దేశాలలో అయితే వయస్సులో మూడవవంతువరకు విద్యను అభ్యసిస్తూనే ఉంటారు. మన దేశంలో 50% బాలబాలికలు హైస్కూలు వరకు కూడ రాలేకపోతున్నారు. ప్రాథమిక విద్యలో ప్రవేశించిన వారిలో 2/3 వంతు కాలేజి వరకు రాకుండానే చదువు మానివేస్తున్నారు. సరిబడిన బడులులేకపోవడం, ఉపాధ్యాయులకొరత, కుగ్రామాలవైపు తిరిగిచూడని ఉపాధ్యాయులు, పేదరికం, ఇంటిఅవసరాల కోసం కూలికి పోవాల్సి రావడం మొదలైనవన్నీ కారణాలే అని చెప్పవచ్చు. ఉన్నత విద్యల కోసం విదేశాలకు వెళ్లాలన్న ప్రాకులాట పెరిగిపోతోంది. ప్రస్తుతం అక్షరాస్యులు, నిరక్షరాస్యులు అన్నభేదం అంతగా లేదు. ఇప్పుడైతే "అక్షరాస్యులు-డిగ్రీలు పొందినవారు, నిష్ణాతులు-నిష్ణాతులు కానివారు" అని లెక్కలు తీయాల్సి ఉంది. నిష్ణాతులైన డాక్టర్లు, శాసనాధికారులు, ఇంజనీర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు మొదలైనవారు ఎందరో ఉన్నారు. కాని వారికి కేవలం చదువే తప్ప విద్య అబ్బడం లేదు. జీవించేకళ తెలియడంలేదు. ఈనాడు అలాంటి బ్రహ్మరాక్షసి చదువు ప్రచారంలో ఉంది. స్వార్థపరులు తప్ప సమాజ సేవకులు తయారుకావడం లేదు. తల్లిదండ్రులను వారి చావుకు వారిని వదిలేసి ధనార్జన కోసం విదేశాలలో స్థిరపడిపోతున్నారు. ఉన్నత విద్యను ఆర్జించిన వారిని లెక్కిస్తే పూర్తి జనాభాలో 5% శాతానికి తక్కువే ఉంటారు. ఇదే లెక్కను చైనా, యూరోప్ వంటి చిన్న చిన్న దేశాలలో తీసినట్లైతే 20% శాతం కన్నా ఎక్కువే ఉంటారు.

### అభివృద్ధికి నూతన పరిభాషలు

అయితే మనం ఇప్పుడు ఏం చేయాలి? ఏడుస్తూ కూర్చోవాలా? అక్కర్లేదు. జాతి యొక్క సమగ్ర వికాసానికి తమ్ముతాము సమర్పించుకునే వ్యక్తులను తయారు చేసుకోవాలి.

**తపస్వి అన్ని విషయాలలోను నిరాడంబరంగా ఉంటాడు.**

చదువును-విద్యను జోడించి నేర్చుకునే సంస్కారవంతులను తయారు చేసుకోవాలి. గోమాత వధను అడ్డుకుని, గో సంతతిని వృద్ధి చేయగలిగితే అభివృద్ధి. గోవునుండి లభించే ఉత్పాదనలను ఉపయోగించి, జీవన శైలిని మార్చుకో గలిగితే అభివృద్ధి. యోగ విద్యను జీవించేకళగా స్వీకరించి, ప్రతిశ్వాసలో నిలుపుకోగలిగితే అభివృద్ధి. మనం తీసుకునే ఆహారపానీయాలు జీవన శక్తిని, మానసిక శక్తిని బలపరచగలిగితే అభివృద్ధి. మన ఆహార వ్యవహారాలు సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదిస్తే అభివృద్ధి. ప్రజలు వృద్ధులను గౌరవిస్తూ, తల్లిదండ్రులను ఆదరిస్తూ ఉమ్మడి కుటుంబాలలో మనగలిగితే అభివృద్ధి. నవ, యువ దంపతులు కోర్టుల చుట్టూ తిరగకుండా అనురాగంతో జీవించగలిగితే అభివృద్ధి. ఇతరులను పీడించకుండా, అవసరానికి ఆదుకుంటూ, యజ్ఞీయ భావనతో జీవించగలిగితే అభివృద్ధి. ఆధ్యాత్మిక చింతనతో యజ్ఞీయ జీవనం జీవించగలిగితే అభివృద్ధి. ప్రస్తుతం మనం అనుకుంటున్నది అభివృద్ధి కానేకాదు.

## వ్యవస్థమారితే - జీవన శైలిమారుతుంది

మరి మనం కోరుకుంటున్న అభివృద్ధి ఎలా సాధ్యం? మనం చెప్పుకున్న పరిభాషలకు అనుగుణంగా వ్యవస్థను తీర్చిదిద్దుకోవాలి. ముందుగా మన యొక్క వ్యక్తిగత జీవన శైలిని మార్చుకోవాలి. క్షణికమైన లాభాలకు, మభ్య పెట్టే ఆకర్షణలకు దూరంగా జీవించాలి. క్షణికమైన సుఖాలకు లొంగిపోకుండా, దూరదృష్టితో ఆలోచించాలి. "భోగవిలాసాలలో మునిగి తేలుతున్నవారు జీవితంలో చివరకు మిగుల్చుకున్నదేమిటి?"అని ప్రశ్నించుకోవాలి. వారు మిగుల్చుకున్న భయంకరమైన వ్యాధులను, కదలలేని స్థితిని, కడుపునిండుగా తినలేని పరిస్థితిని గమనించాలి. మెల్లమెల్లగా మనలోని చిన్న చిన్న అలవాట్లను మార్చుకోవడం మొదలు పెట్టాలి. క్రమంగా ప్రక్కవారిని మార్చే ప్రయత్నం చేయాలి. దానితో సమాజంలో నూతన వాతావరణం తలెత్తుతుంది. ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. గో ప్రధానమైన గ్రామ జీవనం ప్రారంభం అవుతుంది. అప్పుడే అంతటా ఆరోగ్యం, ఆనందం తాండవిస్తూ ఉంటాయి. 21వ శతాబ్దంలో కూడ ఇలాంటి విషయాలు వ్రాయడం ఏమిటి? అని ఎవరైనా ఆక్షేపించవచ్చు. భయంకరమైన వ్యాధి తగ్గాలంటే కఠినమైన పథ్యం తప్పనిసరి. అనుకున్న మార్పును సాధించామంటే 2015 నుండి 2020 మధ్యలో యుగ పరివర్తన జరిగితీరుతుంది.

★★★

## వ్యవహారంలో ఔచిత్యం ఉండాలి

*ఈ ప్రపంచం చాలా విచిత్రమైంది. విశాలమైంది. దీనిలో సంస్కారవంతులు, సంస్కారంలేని వారూ రెండురకాల మనుష్యులూ ఉంటారు. అందరూ మనం కోరుకున్న విధంగానే ఉండరు. ఆ విధంగా కోరుకోవడం కూడ సరి అయిన పద్ధతి కాదు. ఈ ప్రపంచం మనకోసం మాత్రమే సృష్టించబడలేదు. పరమేశ్వరుడు రకరకాల మనుష్యులను, జీవజంతువులను సృష్టించాడు. ఇది ఒక సామూహిక పాకశాల ఇక్కడ మనకు ఇష్టమైన వంటకాలు మాత్రమే చేయరు. చేసిన వాటినుండి ఇష్టమైన వాటిని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా శ్రేష్ఠులైన వారినుండి మనం ప్రేరణ పొందాలి.*

*ప్రతి ఒక్కరి ఎడలా అనవసరంగా ఉదారతను ప్రదర్శించడం అంత మంచిదికాదు. అందువల్ల స్నేహం చేయాలంటే స్థాయిని అనుసరించి స్థిరం చేసుకోవాల్సి ఉంటుంది. సంస్కారహీనులతో వ్యవహారం చాలా కష్టమౌతుంది. వారిది విచిత్ర మనస్తత్వం. అహంకారం పాలు ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వివేకాన్ని ఉపయోగించలేరు. సరి అయిన నిర్ణయాలు తీసుకోలేరు. ఇలాంటివారిని కొట్టి, తిట్టి మార్చలేం. శాసనాలు కూడా వారికి అంతగా పనిచేయవు. అలాంటి వారికి సాధ్యమైనంతదూరంగా ఉండాలి. వారి అహంకారాన్ని దూరం చేయాలంటే మానసిక శాస్త్రం తెలిసి ఉండాలి. మానసిక రోగులపట్ల వ్యవహరించిన విధంగా సున్నితంగా ప్రవర్తించాల్సి ఉంటుంది. క్షమాగుణాన్ని అలవరచుకోవాలి. సేవల నుండి విముఖులుకాకుండా చూచుకోవాలి. సహనంతో పాటు సానుభూతిని ప్రదర్శించాలి అనుకోవడం పొరపాటు. అవినీతి పట్ల అవసరానికి అనుగుణంగా కాఠిన్యాన్ని కూడా ప్రదర్శించాలి. సాహసంతో, ఓర్పుతో, నేర్పుతో ముందుకు సాగిపోతూ ఉంటే ఎలాంటి అహంకారి కూడా క్రమక్రమంగా ఆదర్శవ్యక్తిత్వానికి ఆకర్షింపబడతాడు. చిట్టచివరకు మారితీరుతాడు. వ్యవహారంలో ఔచిత్యాన్ని ప్రదర్శించడమే ఆదర్శవాదం అనిపించుకుంటుంది.*

**పరమేశ్వరుని ప్రేమ కర్తవ్య పరాయణులకే దక్కుతుంది.**

### ఉపాసనకు రెండు పాదాలు : జపం-ధ్యానం

# ధ్యానం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?-9

మానవునికి వ్యక్తిగత జీవితంలో ఎన్నో సందర్భాలలో మానసిక స్థిరత్వం కోల్పోవాల్సి వస్తుంది. ఆ క్షణాలలో ఏం మాట్లాడుతాడో? ఏం చేస్తాడో అతనికే తెలియదు. వాటివల్ల జరిగే దుష్పరిణామాలు తప్పకుండా అనుభవించాల్సి వస్తుంది. అలాంటప్పుడే అనుచితమైన ఆలోచనలు వస్తూఉంటాయి. ఆలోచనలను బట్టి క్రియాకలాపాలు ఆరంభంఅవుతాయి. వాటివల్ల అనేకమైన ఇతర సమస్యలు వచ్చి చుట్టుముడతాయి. అప్పుడే హత్యచేయడానికి గాని, ఆత్మహత్యకు గాని సిద్ధపడతాడు.

మానవుడు ఇలాంటి స్థితి గతులనుండి బయటపడడానికే ధ్యానం అవసరం. ధ్యానం చేయాలంటే ఏకాగ్రతను చాలా శ్రద్ధగా అభ్యాసం చెయ్యాలి. చాలాసార్లు మనస్సు క్రోధం, శోకం, కోరిక, ప్రతీకారం, భయంలాంటి వికారాలలో చిక్కుకుని ఉడికిపోతూ ఉంటుంది. దానివల్ల తనకూ అనర్థం జరగవచ్చు. ఇతరులకూ జరగవచ్చు. ఈ వికారాలవల్ల మనస్సు ఉద్విగ్నత చెందుతుంది. ఉద్విగ్నతవల్ల కొద్ది క్షణాలలోనే వ్యామోహంతో పిచ్చిపట్టిన స్థాయికి చేరుకుంటుంది. ఆ సమయంలో వాస్తవ స్థితిని తెలుసుకోలేదు. సరైన నిర్ణయం తీసుకోలేదు. మరి ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి? ఏకైక పరిష్కారం ధ్యానం మాత్రమే. మనస్సును ఒక విధమైన ఆలోచనా ప్రవాహం నుండి మళ్ళించి వేరొక దిశలో నియోగించే ప్రక్రియ ధ్యానం. దారితప్పిన వారిని సరైన దారికి త్రిప్పగలిగేది ధ్యానం. మనస్సును నియంత్రించేది ధ్యానం. మనస్సుకు ఉన్న వేగం లోకంలో మరిదేనికీ ఉండదు. ఇదే విషయాన్ని ధర్మరాజు యక్షుని ప్రశ్నకు సమాధానంగా చెప్పాడు. మనస్సు యొక్క వేగాన్ని ఆపాలన్నా ధ్యానమే ఉపయోగపడుతుంది. మనస్సును అదుపులో ఉంచుకోగలిగిన వ్యక్తి ప్రపంచాన్నే వశం చేసుకోగలడన్న నానుడి ఉంది. ఆత్మ నియంత్రణను సాధించాలన్నా ధ్యానం చాలా అవసరం. అందువల్ల ప్రతి ఒక్కరు ఏదో ఒక విధమైన ధ్యాన సాధన చేసి తీరాలి.

ధ్యానం ఎందుకు? అని ప్రశ్నించుకుంటే గాని సరిఅయిన సమాధానం రాదు. సరిఅయిన సమాధానం దొరికితేగాని ధ్యానిమగ్నులం కాలేము. ధ్యానంవల్ల ఆత్మికపరమైన, భౌతికపరమైన లాభాలు రెండూ లభిస్తాయి. ఈ రెండు క్షేత్రాలలో విజయానికి సరైనమార్గం దొరుకుతుంది. ధ్యానంలో పూర్తి తన్మయత, తత్పరత ఉండి తీరాలి. ఆత్మిక క్షేత్రంలో నిద్రావస్థలో ఉన్న శక్తులు జాగృతం అవుతాయి. భౌతికక్షేత్రంలో ఆరోగ్యపరమైన లాభాలు లెక్కకు మిక్కిలిగా లభిస్తాయి. చిట్టచివరకు భగవత్ ప్రాప్తికి మాధ్యమంగా ధ్యానం ఉపకరిస్తుంది. ధ్యానయోగం వల్ల మౌలిక స్థితిగతులను పూర్తిగా అవగాహన చేసుకోగలుగుతాడు. ధ్యానమగ్నుడు కాలేనివ్యక్తి సంతలో తప్పిపోయిన బాలునివలె అయోమయంలో పడిపోతాడు. మేకల సమూహంలోఉన్న సింహంలాగా దయనీయమైన జీవితాన్ని గడుపుతాడు.

ఇంతటి ఉపయోగకారి అయిన ధ్యానాన్ని ఎలా మొదలు పెట్టాలి? ఎలా కొనసాగించాలి? ఎలా ముగించాలి. మొట్టమొదట దారితప్పి స్వేచ్ఛగా విహరిస్తున్న మనస్సును నిర్ధారించబడిన దిశలోనికి తీసుకుని రావాలి. ఒకే విషయంపై నిలిపే ప్రయత్నం చెయ్యాలి. ఇష్టమైన దేవుని మీద కానీ, లేక ఏదైనా ఒక ప్రత్యేక స్థితిపై గానీ మనస్సును లగ్నం చెయ్యాలి. ఆ విధంగా జరగాలంటే ఎంతో శ్రద్ధ కావాలి. ఏకాగ్రత కావాలి. పట్టుదలతో కూడిన అభ్యాసం కావాలి. ఏకాగ్రతకు హానికలిగించే విషయాలకు దూరంగా ఉండాలి. మనస్సులో స్థిరమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి. ఏకాంత స్థలంలో ధ్యానం కొనసాగిస్తే పైన తెలిపిన అంశాలు కొంత వరకు సాధ్యపడతాయి. ధ్యానంలో కూడ స్వార్థభావనకన్నా సమాజ భావన మెండుగా ఉండాలి. అందువల్లనే బుద్ధ భగవానుని వంటివారి ధ్యానం సత్ఫలితాలను ఇచ్చింది.

అనువాదం – ఊటుకూరి సత్యనారాయణగుప్త

**డబ్బుమీద నమ్మకం పెట్టుకోకు, నమ్మకస్తులదగ్గర డబ్బుపెట్టుకో.**

# పరమపూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది-2400 కోట్ల మంత్రజపం

కారణజన్ములైన పరమపూజ్య గురుదేవులు గాయత్రీ మంత్రజపం ద్వారానే విజయాలు సాధించారు. వారి జన్మ శతాబ్దినాటికి మనం అంటే దక్షిణ భారత విభాగం 2400ల కోట్ల గాయత్రీ మంత్రజపాన్ని సామూహికంగా నిర్వహించి గురుదక్షిణగా సమర్పించాలన్న నిర్ణయం జరిగింది. ఇప్పటికే అనేకచోట్ల ప్రారంభింపబడింది. పరిజనులందరు రోజుకు మూడు మాలలు మంత్ర జపం చేయాలి. మీమీ బంధుమిత్రులను ప్రభావితం చేసి వారిచేత జపం చేయించాలి. ఏ రోజైనా ఏ కారణంగానైనా చేయలేకపోయినట్లైతే మరియొకరోజు పూర్తి చేసుకోవచ్చు. సగటున రోజుకు మూడు మాలలు వచ్చేలా చూసుకోవాలి. మూడు మాలలకన్నా ఎక్కువ చేయగలిగితే మరీమంచిది. మూడుమాలలు చేయలేనివారు కనీసం ఒక్క మాలైనా చెయ్యాలి.

**ముఖ్యగమనిక :** ప్రముఖ కార్యకర్తలు, పరిజనులు తమతమ ప్రదేశాలలోని పాఠశాలలకు పర్యటించి విద్యార్థుల చేత కనీసం 10-15 నిమిషాలు మంత్రజపం చేయించాలి. ఇప్పటికే చీరాలలోని ఒక పాఠశాలలో చేయించుచున్నారు. "విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెరిగింది. ఏకాగ్రత కుదిరింది. బుద్ధివికసించింది. ప్రవర్తన మారింది" అని తెలియచేశారు. కనుక మన ప్రయత్నం ఆ వైపుగా సాగాలి. లెక్కింపు సౌకర్యార్థం క్రింద ఒక పట్టిక ఇవ్వబడింది. దానిలో 31 గదులు ఉన్నాయి. ప్రతిరోజు ఆ రోజు చేసిన మాలల సంఖ్యను ఒక్కొక్క గడిలో వెయ్యాలి. చేయనిరోజు డాష్ పెట్టాలి. నెలపూర్తికాగానే క్రింది ప్రొఫార్మాను నింపి క్రింది చిరునామాకు పంపాలి. ఈ పేజిని చింపుకొని నింపవచ్చు. లేకపోతే స్వయంగా తయారుచేసుకోవచ్చు.

*శ్రీ కె.పి.విఠల్, 48 LIG-II, బి.కె.గూడా,*
*సంజీవరెడ్డినగర్, హైదరాబాద్-500 038*
*ఫోన్ : 040-23705749, సెల్ : 9989655310*

ఇట్లు
మీ
అశ్విని సుబ్బారావు
*(విశ్వగాయత్రీ పరివార్-దక్షిణ భారత సంయోజకులు)*

**2400ల కోట్ల సామూహిక గాయత్రీ మంత్రజపము**

తేదీ ........................ నుంచి .................. వరకు

నెం :  పూర్తి జప మాలల సంఖ్య : [ ]

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | ప్రతిరోజు మీరు మంత్రజప మాలల సంఖ్యను పైన ఇచ్చిన గడులలో రాయండి | | | | |

పేరు : ..............................................................

గోత్రము : ..........................................................

చిరునామా : ......................................................

.......................................................................

.......................................................................

పుట్టిన రోజు మరియు వివాహదినము : ........................

.......................................................................

ఫోన్ : ..............................................................

*యుగశక్తి గాయత్రి మాసపత్రికకు క్రొత్త చందాదారులను చేర్పించండి.*

**ఎంత తొందరగా ఉన్నా హడావుడి పడకూడదు.**



బాలల భవితకు బంగారు బాట-2

# పేదరికం మనిషికే కాని మనసుకు కాదు

నగలదుకాణం. ఆ దుకాణం యజమాని సాధు స్వభావం కలవాడు. అందరు వ్యాపారుల్లాగా అతనికి ధన దాహంలేదు. నిజాయితీగా తగుమాత్రం లాభానికే అమ్మేవాడు. కుటుంబ సభ్యులంతా సాదా సీదాగా జీవించేవారు. ఒక రోజు ప్రొద్దున్నే సేటు దుకాణం తెరిచాడు. ఏదో పనిచూసుకుంటున్నాడు. సుమతి అనే గృహిణి అటుగా వస్తూ దుకాణం తెరిచి ఉండడం చూచింది. దగ్గరకు వచ్చింది. “అన్నా! 50 రూపాయలకు ఏదన్నా ఒక హారం వస్తే ఇవ్వు. నా కూతురు హారం కావాలని ఒకటే గోల చేస్తోంది. నా దగ్గర ఇంతకన్నా డబ్బులేదు” అన్నది సిగ్గుపడుతూ. “50 రూపాయలు కూడ అక్కర్లేదు. 30 రూపాయల హారమే ఇస్తాను. కాని నేను ఆ బీరువాతాళం చెవులు తీసుకుని రాలేదు. ఇప్పుడు వేరే పనిమీద వచ్చాను. నేను ఇంటికి వెళ్ళి తాళం చెవి పంపిస్తాను. మా గుమస్తా ఉంటాడు,ఇస్తాడులే. నువ్వు కూడ ఏదో పని మీద పోతున్నట్టున్నావు. తిరిగి వచ్చేటప్పుడు తీసుకో” అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు. అనుకున్న విధంగానే ఇంటికి వెళ్ళి తాళం చెవి పంపించాడు.

10 గంటల సమయంలో సుమతి దుకాణానికి వచ్చింది. 30 రూపాయలు ఇచ్చింది. గుమాస్తా ఇచ్చిన హారం తీసుకుని వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన కొద్దిసేపటికి సేటు వచ్చాడు. అతనితో పాటు ఒకమిత్రుడు కూడ వచ్చాడు. అతనికి విలువైన వజ్రాలహారం చూపించమన్నాడు సేటు. గుమాస్తా బీరువాతీసి ఆ హారం ఇక్కడ లేదుకదా! అన్నాడు. సేటు ఏం చేశావని గద్దించాడు. సేఠ్‌జీ! నన్ను నమ్మండి. మీరు వెళ్ళాక ఎవ్వరూ రాలేదు. సుమతి మాత్రమే వచ్చింది. ఆమెకు 30 రూపాయల హారం ఇచ్చి పంపాను. ఇవిగో 30 రూపాయలు” అంటూ తీసి చూపించాడు. జరిగిన పొరపాటు సేటుకు అర్థంఅయింది. మారు మాట్లాడకుండా గుమాస్తాను ఉద్యోగం నుండి తీసివేశాడు. పాపం గుమాస్తా తలవంచుకుని వెళ్ళిపోయాడు. “సుమతి నీకు తెలుసుగదా! పిలిపించి అడుగవచ్చుకదా!” అన్నాడు మిత్రుడు.

ఆమె డబ్బు చెల్లించి తీసుకుని వెళ్ళింది. చూసుకోకుండా ఇవ్వడం గుమాస్తాదే తప్పు. ఆమెను అడిగే అధికారం నాకు లేదు అన్నాడు సేటు. ఇంతలో సుమతి హారం తీసుకుని వచ్చింది. అన్నా! ఈ హారంలో ఒక రాయి ఊడిపోయింది. నేను సరిగా చూచుకోలేదు. వేరేరాయి బిగించి ఇవ్వు అంది. సేటు మౌనంగా రాయి బిగించే పనిలో నిమగ్నమయ్యాడు. మిత్రుడు చూస్తూ ఊరుకోలేక పోయాడు. ''అమ్మా! ఇక్కడ పొరపాటు జరిగిపోయింది. ఈ హారం విలువ 30 రూపాయలుకాదు. 70 వేల రూపాయలు. గుమాస్తా పొరపాటున ఇది నీకు ఇచ్చాడు. పాపం అతని ఉద్యోగం పోయింది. ఇంటికి వెళ్ళిపోయాడు.” అని చెప్పాడు.

ఆమాటలు వింటూనే సుమతి గజగజ వణికిపోయింది. వెంటనే ఏడుస్తూ సేటుకాళ్ళపై పడింది. “అన్నా నేను పేదదాన్నే కావచ్చు. కాని నాకు పేరాశలేదు. నీ హారం నువ్వే తీసుకో అది వజ్రాలహారమని ఇప్పుడే తెలిసింది. పాపం గుమాస్తా పేదవాడు. ఆతన్ని ఉద్యోగంలోకి పిలుచుకో. నా మూలంగా ఒక కుటుంబం వీధిన పడకూడదు. నాకు నకిలీ హారమే ఇవ్వు. అంటూ భోరున ఏడ్చింది. మిత్రులిద్దరూ ఆశ్చర్యపోయారు. సేటు ఆమెను లేవదీసి ఓదార్చాడు.

“చెల్లెమ్మా! ఏడవకు. కళ్ళు తుడుచుకో. నీమంచితనం నాకు చాలా నచ్చింది. ఈ రోజునుండి నువ్వు నాకు చెల్లితో సమానం. నేను నీమాట వినాలంటే నువ్వు కూడ నా మాట వినాలి. గుమాస్తాను ఇప్పుడే పనిలోనికి పిలిపిస్తాను. జరిగిన తొందరపాటుకు క్షమాపణ కోరుకుంటాను. ఇంతవిలువైన హారాన్ని ఎవ్వరూ తిరిగి ఇవ్వరు. నువ్వు చూపించిన ఉదారత నా మనస్సును కదిలించి వేసింది. ఇదిగో ఈ ముత్యాల హారం తీసుకుని వెళ్ళి నీ కూతురుకు ఇవ్వు. మీ మామయ్య ఇచ్చాడు అని చెప్పు. నువ్వు దీనికి సరే అంటేనే నేను ఈ హారాన్ని తిరిగి తీసుకుంటాను. లేకపోతే నువ్వే తీసుకపో” అన్నాడు.

“ఒక అన్నయ్య చెల్లెలికి ఇచ్చిన దానిని కాదనకూడదు. కాబట్టి తీసుకుంటాను. అంటూ ముత్యాల హారం తీసుకుని, అన్న పాదాలకు నమస్కరించి వెళ్ళిపోయింది.

ఇదంతా గమనిస్తున్న మిత్రుని కళ్ళల్లో ఆనంద బాష్పాలు తొణికిసలాడాయి. ఆనందం పట్టలేక మిత్రుని గట్టిగా కౌగిలించుకున్నాడు. 70 వేల రూపాయలు చెల్లించి వజ్రాల హారం తీసుకుని వెళ్ళిపోయాడు. ఇదే విధంగా మనం కూడా న్యాయానికి కట్టుబడి జీవిద్దాం.

**నాయము నిలుపగ మీరలు**
**సాయము సేయంగవలయు సమరంబైనన్**
**నాయము దప్పిన వారికి**
**సాయము దొరకదు నిజమిది సద్గుణబాలా!**

★★★

**ఆడపిల్లలందరూ తమపిల్లల్లాగానే తయారవడం, మగపిల్లలెవ్వరూ అలాకాకపోవడం రెండూ విషాదమే.**

ధారావాహిక : ప్రశ్నోపనిషద్-1

# ప్రథమ మండలం - ప్రథమాధ్యాయం

## లోక కళ్యాణం-జిజ్ఞాసా ప్రకరణం :

*లోక కళ్యాణకృద్ ధర్మధారణా సంప్రసారకః*
*వ్రతీ యాయావరో మాన్యో దేవర్షి ఋషి సత్తమః 1)*

*అవ్యాహతగతిం ప్రాప గన్తుం విష్ణుపదః సదా*
*నారదో జ్ఞానచర్చార్థం స్థిత్వా వైకుంఠ సన్నిధౌ 2)*

*లోకకళ్యాణ మిహయమాత్మ కళ్యాణవాద్ యతః*
*మేనే పరార్థపారీణః సువిధో మన్య దుర్లభాం 3)*

*కాలే కాలే గతస్తత్ర సమస్యాః కాలికీమృశాన్*
*మతః నిశ్చిత్యస్వీచక్రే భావినీ కార్యపద్ధతిమ్ 4)*

**టీకా :** లోక కళ్యాణం కొరకు జనులందరికి ధర్మధారణ యొక్క ప్రచార వ్రతం తీసుకుని నిరంతరం సంచారం చేసే నారదుడు ఋషులలో సర్వశ్రేష్ఠునిగా ఎంచుకోబడ్డాడు. సన్మానించబడ్డాడు. ఎప్పటికైనా విష్ణులోకానికి వెళ్ళి, భగవంతుని దగ్గర ఎంతసేపయినా కూర్చుని జ్ఞాన చర్చ చేసే అవకాశం ఆయనకు మాత్రమే దక్కింది. లోక కళ్యాణమే ఆత్మ కళ్యాణంగా భావించడం వల్ల ఇటువంటి అవకాశం దక్కింది. ఆయన అప్పుడప్పుడు భగవంతుని దగ్గరకు వెళ్ళి సామాజిక సమస్యలను వెల్లడించి, చర్చించి తదనుగుణంగా భావికార్యక్రమాలను నిర్ధారించుకొనేవాడు.

**వ్యాఖ్య :** పరహితమునే తన జీవన లక్ష్యంగా భావించుకున్నందువల్ల నారదుడు భగవంతునితో ప్రత్యేక సంబంధం కలిగింది. అందువల్లే ఆయన నిరంతరం తిరుగుతూ అందరినీ పరామర్శ చేస్తూ ప్రజలకు సన్మార్గం చూపిస్తుంచేవాడు. ధృవుడు, ప్రహ్లాదుడు, పార్వతి మొదలైనవారికి మార్గదర్శనం చేసి వారి ఉన్నత స్థితికి దోహదపడ్డాడు. అందువల్లనే ఆయన దేవర్షిగా సన్మానించబడ్డాడు.

*ఏకదా హృదయే తస్యజిజ్ఞాసా సముపస్థితా*
*బ్రహ్మవిద్యావగాహాయ కాలం ఉచ్చైస్తు ప్రాప్యతే 5)*

*సు-తైశ్చ సుసంస్కారైః కఠోరం వ్రతసాధనే*
*యోగాభ్యాసం తపశ్చేతి కుర్వత్యేతి యధాసుఖమ్ 6)*

*సామాన్యానాం జనానాం తు మనసః సా స్థితిః సదా*
*చంచలాస్తి నతే కర్తుంసమర్థా అధికం క్వచిత్ 7)*

*కల్పేషి చాత్మకల్యాణసాధనం సరలం న తే*
*వత్మ పశ్యంతి పృచ్ఛామి భగవస్తమస్తు తస్త్వయమ్ 8)*

*సులభం సర్వమర్త్యానాం బ్రహ్మజ్ఞానం భవేద్ యధా*
*ఆత్మ విజ్ఞాన మివాపి యోగ సాధన మప్యుత 9)*

*నాతిరిక్తం జీవచర్యా దృష్టికోణం నియమ్య వా*
*సిద్ధి ప్రయోజనం లక్ష్యపూరకం జీవనస్యయత్ 10)*

**టీకా :** ఒకసారి ఆయన మనస్సులో జిజ్ఞాస కలిగింది. కొంతమంది బ్రహ్మవిద్య యొక్క లోతులను తెలుసుకునేందుకు సమయం కేటాయిస్తారు. వారి సంచిత సంస్కారముల వల్ల కఠోరమైన వ్రత సాధన, యోగాభ్యాసం, తపఃసాధన కూడా చేస్తారు. కాని సామాన్య జనుల మనఃస్థితి, పరిస్థితి వేరుగా ఉంటుంది. అందువల్ల వారు ఎక్కువగా సాధనలు చేయలేరు. ఆత్మకళ్యాణానికి తేలికపాటి పద్ధతుల మార్గదర్శనం దొరకకపోతే, భగవంతుడినే అడగాలి. దృష్టి కోణంలో, జీవన చర్యలో కొంచెం మార్పు తెచ్చుకుంటే జీవన లక్ష్యాన్ని సాధించవచ్చు.

*పితృచ్ఛాంచ సమాధాతు వైకుంఠం నారదో గతః*
*గత్వాపప్రచ్ఛ దేవేశం దేవేనాపి తు పూజితః 11)*

*కుశలక్షేమచర్చాన్తేభీష్టే చర్చాభవద్ ద్వయోః*
*సంసారస్య చ కళ్యాణకామనా సంయుతా చ యా 12)*

**టీకా :** ఈ విషయాన్ని చర్చించేందుకు నారదుడు వైకుంఠానికి వెళ్ళి వందనం చేశాడు. భగవంతుడు కూడా ఆయనను సన్మానించాడు. పరస్పర కుశల ప్రశ్నల అనంతరం అభీష్ట ప్రయోజనాల వల్ల చర్చ ప్రారంభమయింది.

**దేవర్షిఉవాచ :**

*దేవర్షిః పరమప్రీతః పప్రచ్ఛ వినయాన్వితః*
*నేతుం ఈవనచర్యా వై సాధనామయతాం ప్రభో 13)*

*ప్రాప్తుం చ పరం లక్ష్యముపాయం సరళం పద*
*సమావిష్టో భవేద్యస్తు సామాన్యే జన జీవనే 14)*

*విహాయ స్వగృహం నైవ గన్తుం వివశతా భవేత్*
*అసామాన్యా జనానాంచ తితీక్షా యత్ర చే తప్తః 15)*

**టీకా :** ప్రసన్న చిత్తంతో దేవర్షి వినయ పూర్వకంగా ప్రశ్నించాడు. దేవా! ప్రపంచంలో జీవన చర్యనే సాధనామయంగా చేసుకుని పరమ లక్ష్యాన్ని ప్రాప్తించుకునే సరళమైన ఉపాయాన్ని చెప్పండి, ఇల్లు వదిలి పోకుండా సామాన్య జనులు చేయగలిగినటువంటి సాధనా విధానం చెప్పవలసిందిగా కోరుచున్నాను.

**ధనంతో పరుపును కొనవచ్చు, కానీ నిద్రను కొనలేము.**

**శ్రీ భగవాన్ ఉవాచ :-**

*జిజ్ఞాసాం నారదస్యాథ జ్ఞాత్వా సమ్ముదితో హరిః*
*ఉవాచ చ మహర్షే త్వమాత్థ యన్మే మనీషితమ్ 16)*

*యుగానురూపం సామర్థ్యం పశ్యన్నత్ర ప్రసంగకే*
*నిర్థారణస్య చర్చాయా వ్యాపకత్వం సమీప్సితమ్ 17)*

నారదుని జిజ్ఞాసను తెలుసుకున్న భగవంతునికి చాలా సంతోషం కలిగింది. మనస్సులో మాటనే చెప్పారని అన్నాడు. కాలము యొక్క అవసరాన్ని బట్టి చర్చ అవసరమయింది. నిర్ధారించిన విషయాలను అందరికి అందించాలి.

*లఘునాస్తి హి సర్వత్రనాస్థా క్రమపరమ్పరా*
*అదూరదర్శితాగ్రస్థా జనా విస్మృత్యగౌరవం 18)*

*అచింత్య చిన్తనా జాతా అయోగ్యచరణాస్తథా*
*ఫలితః రోగ శోకార్తికలహ క్లేశనాశజమ్ 19)*

*వాతావరణముత్పన్నం భీషణాశ్చ విభీషికాః*
*అస్తిత్వం చ వినాశంచ సందిగ్ధం కుర్వతేనిశమ్ 20)*

ఈరోజులలో అన్నిచోట్ల అవిశ్వాసము, దూరదృష్టి లేకపోవడం కనిపిస్తోంది. మనిషి గొప్పదనాన్ని మరచిపోయారు. కూడని ఆలోచనలు, ఉపయోగం లేని పనులలో నిమగ్నమవుతున్నారు. ఫలస్వరూపంగా రోగం, శోకం, కలహం, భయం, నిరాశతోకూడిన వాతావరణం తయారవుతున్నది. పృథ్వి యొక్క అస్తిత్వానికే ప్రమాదం ఏర్పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

మనుష్యుల ఆలోచనలే ఆచరణగా మారతాయి. వాతావరణం వల్ల పరిస్థితులు ఏర్పడతాయి. సుఖ – దుఃఖాల ఉత్థాన పతనాల నిర్ధారణ చేస్తాయి. “రోజులు బాగాలేవు. కలియుగం ఇలాగే ఉంటుంది.” అని సముదాయించుకుంటే సరిపోదు. ఈ బాధలన్నింటికీ మూలకారణం మానవ అంతఃకరణే అని మరువకూడదు. ఈ రోజున విషమ పరిస్థితులను మార్చవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. కాని వీటి మూల కారణాన్ని పట్టుకోవాలి.

లేకపోతే ఎండిపోయిన మొక్కను పచ్చగా చేయటానికి వేళ్ళకు నీరు పోయకుండా ఆకులను తడిపినట్టు అవుతుంది. సంపాదనకు లోటులేదు. కాని డబ్బు విస్తృతంగా దురుపయోగం చేయబడుతోంది. సమృద్ధికి లోటు లేదు. కాని దీనితోపాటు రోగాలు, కలహాలు పెరిగిపోతున్నాయి. ప్రతిభకు లోటులేదు కాని నికృష్టతలను రూపుమాపే ప్రయత్నమే లేదు. సంపదలకు దుర్భిక్షం లేదు కాని విశ్వాసాలకే దుర్భిక్షం కానవస్తోంది. ఇదే అన్ని సమస్యలకు మూల కారణం.

*ఈ దృశ్యాం చ దశాయాం తు స్వప్రతిజ్ఞానుసారతః*
*జాతా నవావతారస్య వ్యవస్థాయాం స్థితి స్వయమ్ 21)*

*ప్రజ్ఞావతారనామ్నా చ యుగ స్యా స్యావతారకః*
*భూలోకే మానవానాం తు సర్వేషాం హి మనః స్థితా 22)*

*పరిస్థితౌ చ విపులం చేష్టాయాః పరివర్తనం*
*సృష్టిక్రమే చతుర్విశ ఏష నిర్ధార్యతాం క్రమః 23)*

**టీకా :** ఇలాంటి పరిస్థితులలో మీ ప్రతిజ్ఞానుసారం క్రొత్త అవతారం దిగిరానున్నది. ప్రజ్ఞావతారమనే నామముతో ఈ యుగ అవతరణ భూలోకంలోని మనుష్యుల మనస్థితి, పరిస్థితులలో పెను మార్పులు రానున్నాయి. సృష్టి క్రమంలో ఇది 24వ అవతరణ.

**వ్యాఖ్య :** అధర్మాన్ని నాశనం చెయ్యటం, ధర్మస్థాపనలు రెండూ అవతార ప్రక్రియ యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు. ప్రజ్ఞావతారం ఈ అవతారాల ఉత్తరార్థంగా భావించబడుతోంది. ఇది అత్యంత కఠినమైనది. ఇది సమాజిక సమస్యల గురించి దుష్ట శిక్షణ గురించి కాక లోక మానసములో ఆదర్శాల బీజారోపణ, అభివర్ధనం, పోషణ క్రియాన్వితం చేయాలి. ఇవి సత్యయుగ భావనలు. రామరాజ్యం స్థాపనకు ఆవశ్యకాలు. ఈ లక్ష్యం, పనియొక్క గరిమ, వ్యాపకత్వం చూస్తే ప్రజ్ఞావతారమునకు 24 కళలు ఉంటాయని బోధపడుతోంది. విజ్ఞానం ప్రపంచాన్ని చాలా చిన్నదాన్ని చేసింది. వేగవంతం చేసింది. అందువల్ల భగవంతుని అవతారం యుగాంతరీయ చేతన రూపములోనే అవుతుంది.

*వరిష్టతా నరాణాం తు శ్రద్ధా ప్రజ్ఞా వలంబితా*
*నాష్ఠాశ్రితా చ వ్యక్తిత్వం సర్వేషా మత్ర సంస్థితమ్ 24)*

*న్యూ నాధికతా హ్యేతాః క్షీయతే వర్ధతే చ తత్*
*ఉత్థాన సుఖజం పాతదుఃఖజం జాయతే వృతిః 25)*

*అధునా మానవైస్త్యక్తా శ్రేష్ఠతా భ్యన్తర స్థితా*
*ఫలతః ఆత్మన్యేహ్యన్యో సంకటాన్ భావయన్తి తె 26)*

**టీకా :** మనిషి యొక్క గొప్పదనం శ్రద్ధ, ప్రజ్ఞ, నిష్ఠలపై ఆధారపడి ఉంటుంది. వీటి ఎక్కువ తక్కువల వల్ల వ్యక్తిత్వం క్రింద పడటమో పైకి లేవటమో జరుగుతుంది. తదనుగుణంగా సుఖప్రదమైన లేక పతనం కలిగించే దుఃఖ వాతావరణం నిర్మించబడుతోంది. ఈ రోజులలో మనుష్యులు అంతరిక గొప్పదనాన్ని పట్టించుకోవటంలేదు. అందువల్ల తనతోపాటు అందరికి సంకట పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.

*(మిగతా వచ్చే సంచికలో)*

*అనువాదం – శ్రీ మారెళ్ళ కామరాజు*

**ధనంతో పుస్తకాలను కొనవచ్చు, కానీ మేథస్సును కొనలేము.**

తత్వ చింతన

# ధర్మము పట్ల శ్రద్ధ జీవితానికి విలువ తెస్తుంది

అమెరికాలో తుల్సా నగరంలో లేడర్లే లేబరేటరీ అన్న ఒక ప్రయోగశాల ఉంది. అందులో ఇప్పటికి ఏభై సంవత్సరాల క్రితం క్షయరోగాన్ని పోగొట్టే ఒక టీకా కనిపెట్టబడింది. ఆ టీకా లక్షలాదిమంది ప్రాణాలు కాపాడింది. ఆ ప్రయోగశాల చేసిన మానవసేవ సాటిలేనిది అని చెప్పవచ్చు. ఆ ప్రయోగశాల కాంపౌండ్‌లో ఒక భారతీయుని విగ్రహముంది. దాని క్రింద "విజ్ఞానము కేవలం ఆయుర్దాయాన్ని పెంచేది మాత్రమే. ధర్మము దానిని ఇంకా లోతుకు తీసుకునిపోతుంది." అని వ్రాయబడింది. ఆమాట ఆ భారతీయుని విగ్రహరూపంలో ప్రతిష్ఠింపబడిన వైజ్ఞానికుని ప్రతిభను పరిచయం చేసేమాట. చెన్నైలో దారుణమైన దరిద్రం నుంచి బైటపడి లేడర్లే లేబరేటరీకి జేరుకోవడానికి, అందులో ఆ విలక్షణమైన టీకాను తయారు చేయడానికి అతను చాలా కాలం కృషి చేశాడు. ఆతని కృషి అంతా అనేక ఒడుదుడుకులతో కొనసాగింది.

ఆ వైజ్ఞానికుని పేరు యెల్లా ప్రగడ సుబ్బారావు. చెన్నై దగ్గరలో ఒక కుగ్రామంలో పుట్టిన సుబ్బారావుకు తన గ్రామంలో చదువుకొనడానికి సౌకర్యమేలేదు. ప్రాథమిక విద్య కోసం కూడా అతను చెన్నైకి రావలసి వచ్చేది. రోజూ ఆరేడు కిలోమీటర్లు నడిచి చెన్నై వెళ్ళేవాడు. చదువుకోవాలనీ అపరిమితమైన కోరిక, పుస్తకాలలో మునిగిపోయే లక్షణం అతనిలో చిన్న తనమునుంచీ కనబడేవి. చిన్నప్పుడు జరిగిన ఒక సంఘటన అతని జీవితాన్ని ఒక మలుపు తీసుకువచ్చింది. అతని తమ్ముడికి క్షయ రోగమొచ్చింది. కొన్ని నెలలపాటు అతను ఆ రోగంతో బాధపడ్డాడు. ఏ విధమైన వైద్యమూ పనిచేయలేదు. ఆ రోజుల్లో క్షయ రోగానికి తగిన వైద్యం వాడుకలో లేదు.

సుబ్బారావుకు తమ్ముడంటే చాలా ప్రేమ. తమ్ముడు బాధతో కొట్టుకుంటూ చనిపోవడం చూచేసరికి అన్నకెంతో దుఃఖం కలిగింది. ఆ క్షణంలోనే ఆ రోగంతో పోరాడాలన్న నిర్ణయం తీసుకున్నాడు. అదృష్టవశాత్తు ఆరోజులలోనే సుబ్బారావుకు వాల్మీకి రామాయణం చేతికి చిక్కింది. రామకథనంతా చదివి దాని యొక్క ప్రభావాన్ని అర్థం చేసుకున్నాడు. ఎలాంటి రాక్షస కార్యాన్నైనా ఎదుర్కొని పోరాడడానికి అనేక సాధనాలు అవసరం లేదనీ గట్టి సంకల్పం, తగినంత ఉత్సాహం కావాలనీ గ్రహించాడు. రామ,లక్ష్మణులు ఎంతో దయనీయస్థితిలో ఉండి కూడా రావణుని వంటి రాక్షస శక్తిని ఎదుర్కొని తుద ముట్టించారు. సుబ్బారావుకు తన నుంచి తమ్ముడిని ఎత్తుకునిపోయిన ఆ రోగము కూడా రావణుని దుర్మార్గముల వంటిదేనని అనిపించింది.

రామాయణం తనకు నిరంతరం పోరాడడానికి ప్రేరణ కలిగించిందని సుబ్బారావు అనేకమార్లు చెప్పడం జరిగింది. మెట్రిక్ వరకూ చదువు పూర్తి చేసిన తరువాత సుబ్బారావు ఆయుర్విజ్ఞాన శాస్త్రాన్ని ప్రత్యేక విషయంగా ఎంచుకున్నాడు. అందుకు కావలసిన సాధన సంపత్తి అతని దగ్గరలేదు. ఐనా అతని స్నేహితులు, బంధువులు అతనికి సహాయం అందించారు. అతను ఎంతో ఉత్సాహంతో చదువుపూర్తి చేశాడు. చెన్నైలో చదువుపూర్తి అయిన మీదట అతను 1923లో ఇంగ్లండ్ వెళ్ళాడు. అక్కడ కొంతకాలం ఉన్నాడు. అమెరికాలోని హార్వర్డ్ విశ్వ విద్యాలయంలో పరిశోధనకు సంబంధించిన ఉద్యోగం దొరికింది. అది కొనసాగిస్తూనే జీవ రసాయన శాస్త్రంలో డిగ్రీ సంపాదించాడు.

1940లో అమెరికాలోని సినేమిడ్ కంపెనీ యొక్క లేడర్లే ప్రయోగశాల వారు అతనిని తమ దగ్గర పని చేయడానికి పిలిచారు. ఆ కంపెనీ క్రొత్త క్రొత్త మందులు, ప్రయోగాల పట్ల ఎంతో శ్రద్ధ వహించేది. సుబ్బారావుకు తన సంకల్పం పూర్తి కాగలదనిపించింది. ఆ కంపెనీ యొక్క ప్రతిపాదనను అతను వెంటనే అంగీకరించాడు. అతను రాత్రింబవళ్ళు ప్రయోగశాలలోనే గడపడం మొదలు పెట్టాడు. రెండు సంవత్సరాలలోనే అతను తన ప్రతిభను నిరూపించుకున్నాడు. దానికి బహుమానంగా 1942లో అతనికి ఆ ప్రయోగశాలకు చెందిన పరిశోధనా విభాగానికి ప్రముఖుడుగా ఉద్యోగం లభించింది.

డా॥ సుబ్బారావు కొద్ది వారాలలోనే యువకులైన విజ్ఞానవేత్తలతో ఒక చక్కని టీమ్ తయారు చేశాడు. వివిధ పదార్థాలనుంచి ఫోలిక్ యాసిడ్‌ను వెలికితీసే ప్రయోగాలు చాలా చేశాడు. ఏ రోగానికి ఏ చికిత్స చేయాలన్న పనిలో అతను మునిగిపోయాడు. వాటిలో ఫోలిక్ యాసిడ్ యొక్క స్థానం చాలా ప్రముఖమైనది. నాలుగు సంవత్సరాల పాటు కొనసాగిన ఆ కఠినమైన ప్రయోగాలు ఎన్నెన్నో ఆశలను పెంపొందించాయి. పరిశోధన పూర్తి అయింది. మందు తయారయింది. అది లక్షలాదిమందిని అకాలమృత్యుముఖం నుండి కాపాడింది. ఔరి మెడిసన్ అన్న పేరుతో పిలువ బడే ఈ మందు బజారులోకి రావడం వల్ల ఆ జబ్బుతో బాధ పడుతున్న అనేకమంది రోగుల మనసులలో ఆశ చిగురించింది. ఆ మందును కనిపెట్టిన వాడన్న కీర్తి అందుకోబోయే సమయంలో డా॥ రావు ఎంతో నమ్రతతో వెనక్కు తగ్గాడు. "ఈ పరిశోధన వలన కలిగే కీర్తి నాకు కాదు నా సహచరులకు లభించాలని అన్నాడు. వాళ్ళంతా రాత్రింబగళ్ళు కలిసి ఆ పరిశోధన కొనసాగించారు అని తెలియచేశాడు.

**ధనంతో ఆహారం కొనవచ్చు, కానీ ఆకలిని కొనలేము.**

ఆ మందు తయారయిన మూడు సంవత్సరాల తరువాత డా॥రావు కన్ను మూశారు. ఆయన మరణించడానికి కొన్ని రోజులముందు "అమెరికన్ రిపోర్టర్" అను పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన జీవితంలో వాల్మీకి రామాయణం వల్ల గొప్ప ప్రేరణ కలిగిందనీ; నిరాశతో నిండిపోయిన మనస్సుకు ఆ గ్రంథం ఆశలు కల్పించిందనీ; కేవలం తెలివి తేటలు – సాధనా సౌకర్యాలు మాత్రమే వ్యక్తికి విజయాన్ని కలిగించలేవనీ; దీక్ష – సమర్పణ భావాలు తనను నిలబెట్టేవని; లక్ష్య సిద్ధిని కలిగిస్తాయని తెలియజేశాడు.

సాధనసంపత్తి, పరిస్థితులకూ ప్రాధాన్యత ఉంది. కానీ వాటికి ఒక హద్దుంది. అవి కొంతవరకే సహాయపడతాయి. లౌకికమైన విజయాలకు అవి ఉపయోగపడతాయి. సామాన్యమైన పనులను నెరవేర్చడానికి నిష్ఠ కావాలి. గొప్ప లక్ష్యాన్ని సాధించడానికి దానికన్న లక్ష రెట్లు ఎక్కువైన సాధన, క్రియాత్మక నిష్ఠ కావాలి. అపుడు వ్యక్తిని ప్రేరేపించి, స్థిరపరిచే చిన్న పెద్ద, ఆకర్షణలు ఉండవు.

లౌకిక జీవనంలో చెప్పుకోదగిన విజయాలను సాధించినవారి చరిత్ర వేరుకావచ్చు. కానీ గొప్ప లక్ష్యాన్ని సాధించిన వారి జీవితంలో నిష్ఠ నిరంతరంగా ప్రవహిస్తూ ఉంటుంది. గట్టిగా పరికిస్తే లౌకికంగా కలిగిన విజయం కూడా నిరంతర నిష్ఠ, శ్రమ లేకుండా లభించదు. గంభీరమైన నిష్ఠ అనేది తెలివి తేటలతో రాదు. భావాత్మకమైన హృదయంతోను, శ్రద్ధా విశ్వాసాలతోను వస్తుంది. శ్రద్ధా విశ్వాసాల యొక్క గట్టిపునాది ధర్మమే.

భారతరత్న బిరుదుతో సన్మానింపబడిన వారు, దేశాన్ని పరమాణు శక్తి సంపన్న రాష్ట్రంగా రూపొందించడానికి చెప్పుకోదగిన కృషి చేసిన వారు ఐన శాస్త్రవేత్త అబ్దుల్ కలామ్ జీవితం ఎన్నో కష్టాలతో ప్రారంభమయింది. ఆయన చిన్నతనం రామేశ్వరంలో వార్తా పత్రికలు పంచడంలో గడిచింది. స్వాతంత్ర్యం కోసం పోరాటం జరుగుతున్న రోజులలో ఆయన మన దేశాన్ని గొప్ప శక్తి వంతమైన దేశంగా చూడాలని కలలుగనేవాడు. ఆ రోజులలో పరమాణు శక్తిని గురించి లోకానికి తెలిసింది. ప్రొ॥ అబ్దుల్ కలామ్ మనదేశాన్ని పరమాణు శక్తిసంపన్న దేశంగా మార్చాలని భావించారు. అతి సామాన్య స్థితిలో మొదలై కఠిన సంఘర్షణలతో కూడిన బాటలో పయనిస్తూ కూడా ఆయన తన కలను చెరిగిపోనియ్యలేదు. 1998లో పోఖరాన్‌లో రెండవసారి పరమాణు పరిశోధన బాణాన్ని ఎక్కుపెట్టి ప్రొ॥ అబ్దుల్ కలామ్ తన కల కొంతవరకు ఫలించిందని తలచాడు. ప్రొ॥ అబ్దుల్ కలామ్‌కు భారతీయ ప్రక్షేపాస్త్ర కార్యక్రమాన్ని ప్రారంభించిన కీర్తి కూడా దక్కింది. ఆయన కృషి వలన దేశం ప్రక్షేపాస్త్ర యుగంలో ప్రవేశించింది. ఒకసారి ఆయన దేశాన్ని పరమాణు శక్తిగల దానినిగా చేయాలన్న కోరిక కఠిన సంఘర్షణలను ఎదుర్కొని నిలబడగల ధైర్యాన్ని కలిగించిందని తెలిపారు. చింతన క్షేత్రంలో కూడా ఆయన అన్వేషణలు దేశాన్నిసుసంపన్నం చేస్తాయి. "ఇండియా టూ థౌజండ్ ట్వంటీ – ఏ విజన్ ఫర్ న్యూ మిలీనియమ్" లో ఈ మాటను నిజము చేస్తూ 2020లో భారతదేశము అత్యంత ఉన్నత స్థితికి చేరుకుంటుందని పేర్కొన్నారు.

ఆధునిక భారతేతి హాసంలో ఇంకొక వ్యక్తిని గురించి కూడా పేర్కొనవచ్చును. ఆయన నిరుపేద స్థితిలో జీవయాత్ర ప్రారంభించాడు. తన తల్లి నుంచి స్వాభిమానము, పట్టుదలకు చెందిన శిక్షణపొంది ప్రధాన మంత్రి పదవి వరకు చేరుకున్నాడు. చైనా దేశం చేతిలో పరాజయం పొందిన మూడు సంవత్సరాల తరువాత ఆయన ఒక యుద్ధంలో గెలుపొంది దేశాన్ని గర్వంతో తల ఎత్తుకొనేటట్లు చేశాడు. ఆ మహానుభావుడిని పరిచయం చేయడానికి ఈ పేరాలోని మూడు పంక్తులు చాలు. ప్రధాన మంత్రియైన లాల్ బహదూర్ శాస్త్రి అత్యంత సామాన్య కుటుంబము నుంచి వచ్చిన వారు. దాని కన్న గొప్ప విషయం ప్రధాన మంత్రి ఐన తరువాత కూడా ఆయన తన దరిద్రంతో కూడిన దినాలను మరిచిపోకుండా ఉండడం ఆయన కొడుకు కాలేజీలో చదువుకోవడానికి కారులో గాక బస్సులో వెళ్ళేవాడు. ప్రధాన మంత్రి ఐన తరువాత కూడా ఆయనకు తనదంటూ చెప్పుకోవడానికి సొంత ఇల్లైనా లేదు.

శాస్త్రిగారి నిష్ఠ సామాన్య జీవన పద్ధతులు చక్కని ఉదాహరణ. ఆ వ్రతశీలత ఎక్కడినుంచి వచ్చింది? ఆయన తన సార్వజనిక జీవన పద్ధతిని స్వయంసేవకుడుగా జేరడం వలన పొందగలిగానని తెలిపారు. సంస్థయొక్క నియమాలను పాటిస్తూ కనీసం ఇరవై సంవత్సరాలు నిస్వార్థంగా సమాజ సేవ చేస్తానని, జీవితాంతం సామాన్య జీవనం సాగిస్తానని ఆయన శపథం చేశారు. ఆ వ్రతం ఆయనకెంతో ఆనందదాయకమయి నిరంతరంగా పాటించాడు. ఆయన కాశీ విద్యాపీఠంలో చదువుకునే సమయంలో స్వతంత్రం కోసం పోరాటం సాగేది. దేశ సేవకోసం తనను తాను అర్పణ చేసికునే వ్రతాన్ని ఆరోజులలోనే ఆయన చేబట్టారు. దానిని జీవితాంతమూ నిర్వహించారు. ఉన్నత పదవులలోనికి వ్యక్తులు వెడతారు కానీ ఎవరి జీవితం ఒక ఆదర్శంతో ప్రేరేపింప బడుతుందో అటువంటివారి జీవితానికి చెందిన స్ఫూర్తికిరణం సమాజమంతటికీ వెలుగునిస్తుంది. ఉన్నత భావాలు, సామాన్య కార్యాలను కూడా పూజ, యజ్ఞమువలె పవిత్రం చేస్తాయి, సామాన్య భావనలు పుణ్య కార్యాలకు కూడా ఉజ్జ్వల రూపాన్ని కలిగిస్తాయి. అందుకే ధార్మిక భావన జీవన ఉద్దేశ్యాన్ని సార్థకం చేస్తుందని తెలుపబడింది.

అనువాదం – కె.బి. సోమయాజులు

**ధనంతో దుస్తులు కొనవచ్చు, కానీ సౌందర్యం కొనలేము.**

ధారావాహిక : పరమేశ్వరుని చిరునామా-7

# నిరాహారంగా కూడా ఉండవచ్చు

ఒక ప్రఖ్యాత జపాన్ దిన పత్రిక 'జపాన్ టైమ్స్'లో ఒక వార్త ప్రచురింపబడింది. భారత్‌లోని పాట్నా నగర సమీపంలో ఒక వ్యక్తి ఉన్నాడు. అతడు గత రెండు సంవత్సరాలుగా ఆహారంలేకుండా నీటితోనే జీవిస్తున్నాడు.

ఈ వార్త అద్భుతము, ఆశ్చర్యజనకమైనదే కాని నమ్మదగినదేనా? ఎందుకంటే ఈ రోజులలో ఆహారమే జీవనాధారంగా గుర్తింపబడుతోంది. ఆరోగ్యం కోసం విభిన్న రకాల ఖనిజాలు, లవణాలు, ప్రొటీన్‌లు, తేమ, కార్బన్ మొదలైన జాబితాను చూపిస్తూ ఆహారంలోనే అంతా ఉందని చెబుతున్నారు. అలాంటపుడు ఒక వ్యక్తి ఆహారం లేకుండా ఎలా జీవించగలడు? రెండు సంవత్సరాలపాటు అలా జీవించడమేగాక ఆరోగ్యంగా కూడా ఉండడం సాధ్యమా? ఆహారం లేకుండా ఉపవాసం ఉన్న కొంతమంది మృత్యువాత పడ్డారు. మరి భోజనం చేయకుండా ఇంతకాలం ఆరోగ్యంగా జీవించడమేగాక,ఇలాగే నిరాహారంతో ఇంకా దీర్ఘజీవనం సాగిస్తానని ఏ వ్యక్తి అయినా ప్రకటిస్తే అది ఎవరికయినా నమ్మశక్యం కాదు.

ఈ వార్త అనేక మందిని ఆశ్చర్యచకితుల్ని చేసింది. ఆ రోజులలోనే ఒక కెనడా దేశస్థుడైన పాల్ స్టేట్‌వెక్ విశ్వభ్రమణానికి బయలుదేరాడు. ఈ వార్త ప్రచురింపబడే సమయానికి అమెరికా, మెక్సికో, హనొయి, జపాన్, కొరియా, తైవాన్, బ్యాంకాక్, మొదలైన దేశాల యాత్ర ముగించాడు. తన కార్యక్రమాన్ని రద్దు చేసుకొని నిరాహారంగా జీవిస్తున్న ఆ వ్యక్తిని కలవడానికి దానిలో నిజానిజాలను పరీక్షించడానికి భారత్ వచ్చి పాట్నా నగరానికి చేరాడు. అతని చిరునామా తెలుసుకొని అక్కడకు వెళ్ళాడు.

పాట్నా జంక్షన్‌కి కొంచెం ముందుగా చిడియా రోడ్డు ఓవర్ బ్రిడ్జికి దక్షిణాన కంకడ్‌బాగ్ వెళ్ళేదారిలో ఒక ప్రాకృతిక చికిత్సాలయం ఉన్నది. అక్కడ శ్రీ భగవాన్ ఆర్య అనే వ్యక్తి నివసిస్తున్నాడు. అతడు ప్రాకృతిక చికిత్సా ప్రేమికుడు. స్వయంగా ప్రాకృతిక జీవనాన్ని విశ్వసించడమేగాక తన కుటుంబం మొత్తాన్ని ప్రాకృతిక జీవనానికి అలవాటు చేశాడు. ప్రాకృతిక విధానంలో రంగులతో చికిత్స కూడా చేసేవాడు. ఆరోగ్యంగా ఉండడం కోసం ఏ విధంగా జీవించాలో కూడా అందరికీ అర్థమయ్యేలా చెప్పేవాడు.

ఆ వ్యక్తి రెండు సంవత్సరాల నుండి ఆహారం లేకుండా ఉంటున్నాడు. అంతేగాక అతని కుటుంబ సభ్యులందరూ అనగా భార్య , ఇద్దరు కూతుళ్ళు, ఒక కొడుకు వీరందరూ కూడా ఒక సంవత్సరం నుండి ఆహారం లేకుండానే జీవించడం, ఆరోగ్యంగా ఉండడం చూసి కెనడా విశ్వయాత్రికుడు స్టేట్‌వెక్‌కి ఇంకా ఆశ్చర్యం వేసింది.

ఈ సందర్భముగా ఢిల్లీ వారపత్రిక హిందూస్తాన్ 25 జులై, 1971 సంచికలో శ్రీ కృష్ణనందన్ ఠాకూర్ పైవ్యక్తికి వేసిన ప్రశ్నలు-జవాబులు ప్రచురించబడ్డాయి. ప్రశ్నలకు జవాబు చెబుతూ శ్రీ భగవాన్ ఆర్య ఇలా అన్నాడు.

ప్రతి మనిషికీ వారు కుర్చీలో కూర్చొని పనిచేసే వారయినా, రైతు అయినా, పహిల్వాన్ అయినా అందరికీ గాలి, నీటి నుండి పూర్తి పోషణ లభిస్తుంది.

ఆహారం లేకుండా జీవన పర్యంతం ఉండవచ్చు. దీని ద్వారా మనిషికి ఎప్పుడూ వృద్ధాప్యం ఛాయలు కూడా రావు. ఎంతకాలం వరకు మనిషి గాలి, నీటి మీద ఆధారపడే సామర్థ్యాన్ని పొందగలుగుతాడో అంత వరకు అతని శరీరంలో అన్ని రకాల శక్తులు రావడం, మేలు జరగడం ప్రారంభమవుతుంది. వృద్ధాప్యం అలాంటి వ్యక్తి దగ్గరకు కూడా రాదు. మానవునికి ప్రథమశ్రేణి ఇంజన్ లభించింది. అందులో అహారానికి ప్రత్యేక అవసరం ఏమీ లేదు. పశుపక్ష్యాదులకు ద్వితీయ శ్రేణి యంత్రం లభించింది. అందువలన వాటికి ఆహారం అవసరమవుతుంది.

శ్రీ భగవాన్ ప్రయోగం బాగా లోతుగా అధ్యయనం చేయదగ్గది. ఈ సందర్భముగా బాగా అన్వేషణ చేయాలి. ఇది ఏదో చమత్కార విషయం కాదు. మానవ శరీర నిర్వహణ ఏ విషయాల మీద ఆధారపడి ఉందో వాటి మూలంలోకి వెళ్ళడానికి

**ధనంతో ఔషధం కొనవచ్చు, కానీ ఆరోగ్యం కొనలేము.**

ఒక మహత్వపూర్ణ నిష్కర్షకు రావలసిన విషయం. శరీర పోషణకు ఆహారం కంటే జలవాయువులే ప్రధాన ఆధారంగా నిరూపించగలిగితే, ఈ ప్రతిపాదన దూరదృష్టితో కూడిన పరిణామమే అవుతుంది. ఆహారంతో ఆరోగ్య రక్షణ పేరు మీద ప్రస్తుతం భక్ష్య - అభక్ష్య - ఇటుకలు - రాళ్ళు అన్నీ తినబడుతున్నాయో ఆహార ఉత్పత్తికి ఎంత హడావిడి జరుగుతున్నదో, ఆ విషయంగా ఒక నూతన మార్గం లభిస్తుంది. ఈ పూర్తి నిరాహారం అందరికి సాధ్యం కాకపోయినా, స్వల్పాహారంతో పని జరిగి పోయినా, అందుకు శాకాహారం లాంటి ప్రతిపాదనలు మానవ జీవనానికి ఒక ముఖ్య సమస్య. ఆహారానికి ఆశాజనకమైన సమాధానం లభించవచ్చు. ముఖ్యంగా ప్రోటీన్‌ల పేరు మీద కోట్లాది పశు - పక్ష్యాదుల మాంసం కోసం వధ జరుగుతున్నది. అదంతా నిరర్థకం అని తెలుసుకోగలము.

స్వామి వివేకానందుడు, పవహారి బాబా అనే యోగి నిరాహారిగా ఉండేవాడని వర్ణించాడు. ఆ వివరణ ఆయన రచించిన 'పవహారీ బాబా' అనే పుస్తకంలో కూడా ఉన్నది. ఆయన అలా ఉండగలగడానికి, కారణం యోగాభ్యాసమే అని వ్రాశాడు. అప్పుడు ప్రజలకు ఆ కఠిన కార్యాన్ని అనుకరించే సాహసం లేదు. కాని శ్రీ భగవాన్‌జీ ప్రయోగం ప్రాకృతిక విజ్ఞానానికి అనుగుణంగా ఉండడం వలన అందరికీ సరళంగా, ఉపయోగకరంగా ఉండవచ్చు. ఈ సందర్భంగా లోతైన అన్వేషణ, విస్తృత ప్రయోగం చేయాలి. అప్పుడు సాధారణ ప్రజలందరూ ఒక నిర్ణయానికి రాగలుగుతారు.

అన్నం అవసరాన్ని వాయువుతో పూరించగలిగే విధానం యోగ విద్యలో ఉన్నది. నీటితో కూడా జీవించవచ్చు. ఎంతో మంది ఋషుల తపస్సు వీటి ఆధారంగానే పూర్తయింది. శివుడ్ని వివాహం చేసుకోవడానికి పార్వతి చేసిన తపస్సు దేవతల వర్గంలోకి వెళ్తుంది. ఋషుల విషయం కూడా ప్రాచీనమైనది. అయితే ప్రాణతత్వం ద్వారా జగత్తులో వ్యాపించి యున్న శక్తిని ఆకర్షించి లోపల ధారణ చేసుకొని దానితో శరీరిక, మానసిక స్థాయిలో వ్యక్తిగతంగా శక్తివంతం కావడం దగ్గర నుండి ఇతరులకు సహాయం చేయడం, అసంఖ్యాక లోక కళ్యాణ కార్యాలను నిర్వహించే ఉదాహరణలు ఇప్పుడు కూడా ఉన్నాయి. ఆ మార్గం కఠినమైనది. అందరికీ సాధ్యం కానిది. కాని పైన చెప్పిన ప్రయోగం అయితే అందరికీ ఒకే నూతన దిశను ప్రసాదిస్తుంది. అందువలన దాని మహాత్మ్యం గొప్పది.

## అనంతమైన అర్హతలుగల ఈశ్వరుని పుత్రుడు

ఆ కాలానికి చెందిన ప్రధాన న్యాయమూర్తి జాన్ ఉడ్‌రఫ్ తన జ్ఞాపకాలలో వ్రాశాడు. ఆయన తాజ్‌మహల్ హోటల్ లాంజ్‌లో కూర్చుని ఉన్నాడు. ఒక భారతీయ స్నేహితుడు తోడుగా ఉన్నాడు. సంకల్ప శక్తి మీద చర్చ జరుగుతోంది. ఆ మిత్రుడిని దాని ప్రామాణికతను నిరూపించుమని అడిగాడు. ఎదురుగా దాదాపు 20 మంది కూర్చొని ఉన్నారు. వాళ్ళలో ఒకర్ని ఎన్నుకోండి. అతడిని లేపి మరల కూర్చోబెడతాను అన్నాడు. ఉడ్‌రఫ్ ఒక వ్యక్తిని చూపించాడు. మిత్రుడు తన శక్తిని ప్రయోగించాడు. ఫలితంగా అదే వ్యక్తి అకారణంగా లేచి నిలబడ్డాడు. అటు ఇటు తిరిగాడు మరల అదే స్థానంలో కూర్చున్నాడు.

ఫ్రాన్స్‌కు చెందిన ఒక అమ్మాయి ఎనెట్‌ఫ్రేలన్ విచిత్రమైన వ్యక్తిగా ఆ కాలంలో ప్రసిద్ధి చెందింది. పన్నెండు సంవత్సరాల వయస్సులోనే తెలియని ప్రశ్నలకు జవాబులు చెప్పేది. ఆ జవాబులు ఏదో కాగితం మీద వ్రాసినట్లు ఆమె చర్మం మీద వెలికి వచ్చేవి. ఆ అక్షరాలు వాటంతట అవే ఆవిర్భవించేవి. కొద్ది నిమిషాలలోనే అంతర్ధానమయ్యేవి.

జులై 28, 1969న దక్షిణాఫ్రికాకు చెందిన న్యూకెసిల్ నగరంలో అసంఖ్యాక జనసమూహం ముందు యోగ విద్యా చమత్కార ప్రదర్శన అంతర్జాతీయ చర్చా విషయంగా తయారైంది. విషయం ఏమిటంటే ఒక టీ హోటల్ నడిపే ఒక సాధారణ యువకుడు పీటర్‌యాన్ డేన్ వర్గ్ యోగవిద్య చమత్కారాల గురించి ఎన్నో విషయాలు చదివి, వినియున్నాడు. భారతీయులు యోగులుగా పిలవబడతారని తెలుసుకున్నాడు. ఇక తన ఆస్తులన్నీ తీసుకొని భారత్ బయలుదేరాడు. టిబెట్ వద్ద హిమాలయాల ప్రదక్షిణ చేసి చమత్కార విద్యలను చాలా కాలం నేర్చుకుంటూ ఉన్నాడు.

తన దేశానికి తిరిగి వెళ్ళాక ఆ చమత్కారాలను చూపించుమని బలవంతపెట్టారు. చివరికి అలాగే ప్రదర్శన ఏర్పాటు

**ధనంతో విలాసవస్తువులు కొనవచ్చు, కానీ సంతోషాన్ని కొనలేము.**

చేయబడింది. ఒక అరుగుమీద బొగ్గులు భగ భగ మండుతున్నాయి. ఆ మంటల జ్వాలలో డేన్‌వర్గ్ చాలాసేపు నడవాలి. ప్రదర్శన గురించి బాగా ప్రచారం చేయబడింది. దానిని తిలకించడానికి దూర దూర ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో జనం వచ్చారు. విశాలమైన మైదానం కిటకిటలాడిపోయింది. నియమిత సమయానికి ప్రదర్శన ప్రారంభం అయింది. జ్వాలల మధ్య యువకుడు నగ్న పాదాలతో చాలాసేపు నడిచాడు. బయటికి వస్తే శరీరం మీద ఎక్కడా ఒక్క బొబ్బ కూడా లేదు.

మంత్రసాధన పేరు మీద జరుగుతున్న మోసాలకు కూడా తక్కువలేదు. వీటి చాటున ధూర్తుల నల్లబజారు కూడా బాగా పండుతోంది. అయినంత మాత్రాన ఇందులో నిజం లేదని భావించరాదు. లోతుగా వెళితే సాధనా విజ్ఞానం కూడా మంచి ప్రయోజనాలనిస్తుందని అర్థమవుతుంది. వాటి సహాయంతో దివ్యశక్తుల అభివృద్ధి దిశగా ఎంతో సాధించవచ్చు.

## దూది పింజ మనిషి

ఏంజలీఎపటీఫోమ్ పేరుగల 72 సంవత్సరాల వృద్ధుడు 'దూదిపింజ మనిషి' అని పిలువబడేవాడు. దూది అన్నిటికంటే తేలికగా ఉంటుంది. నీటిమీద తేలుతుంది. ఏంజలీలో కూడా అలాంటి ప్రత్యేకతే ఏదో ఉందని చెప్పుకునేవారు. అతను చూపించే కళలను చూసి అతి సులభంగా నీటిపై తేలియాడే ఆ అలౌకికతత్వం శరీరంలో ఏముందా? అని అనేకసార్లు డాక్టర్లు అతని శరీరాన్ని పరీక్షించికూడా చూశారు.

ఏంజలీ ఇటలీలోని ఒక దళిత వర్గానికి చెందిన పిల్లవాడు. నీటిలో ఈత కొట్టడం అతనికి చాలా ఇష్టం. అతని తండ్రి అతనిని వారించేవాడు. కట్టడి చేసేవాడు. ఎంత చెప్పినా వినకపోవడంతో ఒక రోజు బాగా కొట్టాడు. పిల్లవాడు పారిపోయాడు. అప్పుడతని వయసు పది సంవత్సరాలు. ఒక ఓడలో చిన్న ఉద్యోగం సంపాదించాడు. తండ్రిని వదలి అమెరికా వెళ్ళిపోయాడు.

అలా ఓడలో వెళ్తూ ఉండగా దూరాన ఎవరో వ్యక్తి మునుగుతూ తేలుతూ రక్షించండి రక్షించండి అని ప్రాణభయంతో అరుస్తూ ఉన్నాడు. ఏంజలీ అది చూసి వెంటనే ఏమీ ఆలోచించకుండా లోతైన సముద్రలోకి ఒక్క దూకు దూకి బాణంలాగా దూసుకుపోయి ఈదుకుంటూ వెళ్ళి 200 పౌండ్ల భారీకాయంగల ఆ వ్యక్తిని ఈడ్చుకు వెళ్ళి తీరానికి చేర్చాడు. ఓడ నావికుడు ఆ పిల్లవాడి దుస్సాహసాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. నావను తెరచి అతనిని రక్షించడానికి సిద్ధమవుతూ ఉండగానే ఆ పని ముగించుకొని ఏంజలీ తిరిగి వచ్చాడు. తాడు సాయంతో ఓడ మీదకు ఎక్కి తన స్థానానికి చేరుకున్నాడు. అతడు చేసిన అద్భుతకార్యానికి నావికుడి నోట మాటరాలేదు.

తరువాత అతని ఈత స్థితిని అమెరికా వాసులంతా ఒక గారడీవాని చమత్కారంలాగా చూస్తూ వచ్చారు. అతను కూడా దుస్సాహసంతో కూడిన సార్వజనిక ప్రదర్శనలు ఇచ్చాడు. వాటిని గురించిన చర్చ ఆనాటి వార్తా పత్రికలన్నింటిలోను నిండి ఉండేది. నీటిపై చేతులు కాళ్ళు ఆడించకుండా గంటల తరబడి విశ్రాంతిగా తేలుతూ ఉండడం అతనికి సాధారణ విషయం.కుర్చీకి కట్టేసి నీళ్ళలో పడవేయడం, చేతులు కాళ్ళను మణుగుల బరువుగల ఇనుముతో కట్టి వేసి నీళ్ళలో పడవేయడం అయినా కూడా 15 గంటల పాటు తేలియాడుతూ ఉండడం, గోతాములో కట్టి భారీ బరువుకు వేళ్ళాడదీసి నదిలో విసిరివేయడం లాంటివి కూడా జరిగాయి. దానిని చూసిన వారంతా ఇక బయటపడడం అసాధ్యం అనుకునేవారు. కాని నీళ్ళలో నుండి కప్ప గెంతులు వేసినట్లు గెంతులు వేస్తూ బయటకు రావడం చూసి నీటిలో తేలియాడే కార్క్‌తో తయారయిన వ్యక్తిగా అతనిని పిలువడం ప్రారంభిచారు. న్యూయార్క్ వరల్డ్ లాంటి ప్రముఖ వార్తా పత్రికలలో సైతం దీనిని అత్యంత ఆశ్చర్యకరమైన విషయంగా ప్రకటించారు.

ఇలా లభించిన ఉదాహరణలను ప్రచురించడానికి వేయి పేజీల గ్రంథం కూడా సరిపోదు. ఈ విలక్షణ, అద్భుత ఉదాహరణలకు మూల కారణం ఏమిటి? అన్నదే ప్రశ్న. దీనికి జవాబు ఒక్కటే సర్వశక్తివంతుడైన పరమాత్ముని పుత్రుడు అనంతమైన అఖండ శక్తుల భాండాగారం. ఈ ఉదాహరణల ద్వారా ఆయన శక్తివంతమైన యోగ్యతలు విశదమవుతున్నాయి. అంతేగాక మానవ శరీరంలో ఇంతటి విలక్షణ వ్యక్తులను నింపే వ్యవస్థాపక శక్తి ఇంకెంత విశాలమైనదో? ఎంత గొప్పదో?

(సశేషం)

**ధనంతో ఆడంబరం కొనవచ్చు, కానీ స్వర్గాన్ని కొనలేము.**

మనం - మన ఆరోగ్యం

# మనకు పోషణ నిచ్చే తల్లి - నిద్ర

ఈ ప్రపంచంలో ప్రతి ప్రాణికి దినచర్యలో స్వాభావికంగా నిద్ర తప్పనిసరి. అయితే నిద్ర ఎందుకు? శాస్త్రవేత్తలు ఇప్పటి వరకు దీనికి దృఢమైన కారణాన్ని కనుగొనలేక పోయారు. కాని ప్రతి జీవికి నిద్ర అనివార్యమనీ అవసరమనీ మాత్రం చెప్పవచ్చు. శాస్త్రవేత్తల ప్రకారం నిద్ర చేతనావస్థను హరించి దాని ద్వారా శరీరానికి, మెదడుకు విశ్రాంతి నిస్తుంది. శరీరం మరమ్మత్తు చేయబడుతుంది. ఖర్చైన శక్తిని తిరిగి పొందగలుగుతుంది. శరీరంలోను, మనస్సులోను కొత్త శక్తి లభ్యమౌతుంది. దీని వలన వ్యక్తి ద్విగుణీకృత ఉత్సాహంతో తన పని చేసుకోవడానికి సిద్ధపడతాడు.

నిద్రపోయే సమయంలో బాహ్య విధులు పూర్తవడమే కాకుండా, అంతర్గత విధులలో కూడ తగ్గుదల ఏర్పడుతుందని పరిశోధకుల భావన. మెదడులోని విద్యుత్తరంగాల అధ్యయనం ద్వారా తెలిసింది ఏమంటే నిద్రపోయే సమయంలో వ్యక్తి ఒక స్థాయి నుండి మరోస్థాయిలోకి మారుతూ ఉంటాడు. మొదటిది తేలికైన నిద్ర. దానిలోంచి గాఢనిద్రలోకి జారుకుంటాడు. తర్వాత స్థాయి నిద్రలో వాని కనుపాపలు కదులుతుంటాయి. ఎక్కువ కలలు ఈ స్థితిలోనే వస్తాయి. వైజ్ఞానిక పరిశోధన ప్రకారం నిద్రపోయే క్రమంలో అనేక రసాయనిక చర్యలు జరగడమేకాక విద్యుత్తరంగాలు కూడ లేస్తాయి. ఈ క్రియలు-ప్రతి క్రియలు మెదడు మధ్య భాగం నుండి నియంత్రించబడతాయి.

విషయ పరిజ్ఞానం గల వారి ప్రకారం మన నిద్ర కొన్ని భాగాలుగా విభజింపబడుతుంది. మొదటి దశలో భుజాలు, కాళ్ళు, నడుము, మెడ యొక్క కండరాలు నిద్రపోతాయి. చివరలో చిన్నవైన పెదవులు. కనురెప్పల మాంసకండరాలు నిద్రిస్తాయి. ఈ ప్రకారంగా మన చేతనా కేంద్ర విభాగాలు కూడా క్రమంగా ఒకటొకటే విశ్రమిస్తాయి. మొదట ఘ్రాణ (వాసనా) శక్తి, తర్వాత చూపు, వినికిడి శక్తులు, ఆఖరుగా స్పర్శ మొదలైనవి అచేతన ఆలింగనంలో ఇమిడిపోతాయి. కాని దీనర్థం శరీరం తన పని నిలిపేస్తుందని కాదు. నిద్రలో కూడ శరీరంలోని అవసరమైన అంగాలు పనిచేస్తూనే ఉంటాయి. అయితే కాస్త నెమ్మదిగానే స్పందిస్తాయి. నిద్రలో రక్త ప్రసరణ కూడ తగ్గుతుంది. హృదయ, నాడీ చలనాలు కూడ మందగిస్తాయి. జీర్ణాశయం, మెదడు మరియు మూత్ర పిండాలకు రక్తం నెమ్మదిగా ప్రవహిస్తుంది. దీని వలన శరీరంలోని అవయవాలకు విశ్రాంతి లభిస్తుంది. ఏ వ్యక్తైనా ఎక్కువగా మెలకువగా ఉండాల్సి వచ్చినా, అలసట వలన కోపించినా (చిటచిటలాడినా) అతని శరీరం, మెదడు సరిగా పనిచేయలేవు.

ఆరోగ్యమైన మనిషికి సగటున 6 లేక 7 గంటల నిద్ర సరిపోతుందని వైద్యులు భావిస్తారు. ఎంతసేపు నిద్ర పోయారనే దానిపై కాక ఎంత గాఢంగా నిద్రపోయారనే విషయం పైనే నిజానికి దాని లాభమాధారపడి ఉంటుంది. మాటి మాటికి లేస్తుండే 6,7 గంటల నిద్రకంటె గాఢమైన 2,3 గంటల నిద్రయెక్కువ లాభిస్తుంది. ఈ విధంగా రాత్రి మాత్రమే నిద్రపోనక్కరలేదు. అవసరం అయితే ఏ సమయంలోనైనా నిద్రపోవచ్చు. వయసును బట్టి కూడ నిద్రాసమయంలో తేడా ఉంటుంది. పసి పిల్లలకు పెద్దలకంటె ఎక్కువ నిద్ర అవసరం. ఎందుకంటే వారి శక్తి అధికంగా ఆటలలో ఖర్చౌతుంది. అంతేకాకుండా వారి శారీరిక వికాసానికి కూడ నిద్ర అవసరం. సంవత్సరం వయసు పిల్లలకు 12 గంటల నిద్ర, బాల్యావస్థలోని పిల్లలకు 10 గంటలనిద్ర, పెద్దలకు 6,7 గంటలనిద్ర ముసలివారికి 5,6 గంటల నిద్ర సరిపోతుంది.

నేడు నిద్ర రాకపోవడం ముఖ్య సమస్యగా మారింది. అమెరికాలోని ప్రసిద్ధ మానసిక వైద్యుడు డాక్టరు ఏంథోని వెల్స్ దీనికి కొన్ని కారణాలను గుర్తించాడు. వైద్య విజ్ఞానం ప్రకారం తీవ్రమైన తలనొప్పి, బహుకాలంగా ఉన్న దగ్గు వల్ల నిద్రరాకపోవచ్చు. ఈ రోగ కారణాల నుండి విముక్తి కలిగితే నిద్రలేమి రోగం తనంతతాను తొలగి పోతుంది. రెండవ కారణం మనోవైజ్ఞానిక వికృతి (డిప్రెషను రెస్ట్‌లెస్‌నెస్) అలాంటి పరిస్థితిలో వ్యక్తి ప్రావీణ్యుడైన మానసిక వైద్యుని సలహాకై సంప్రదించాలి.

**ధనంతో దేవాలయం కొనవచ్చు, కానీ దైవాన్ని కొనలేము.**

నిద్రరాకపోవడానికి చింత, బిగింపు, ఈర్ష్య, ద్వేషం, భయం, అత్యధికప్రేరణ, క్రోధం మొదలైనవి ముఖ్యమైన మానసిక కారణాలు. టీ, కాఫీ, సిగరెట్, అధిక మద్యపానంకూడ నిద్రలేమిని కలిగిస్తాయి.

నిద్రలేమి వెనుక ఏ చిన్న కారణాలున్నా, ఆరోగ్యరీత్యా నష్టం కలిగించేవిగా సందేహించకతప్పదు. 'నార్‌కోలిప్సీ' అనే రోగంలో నిద్ర అప్పుడప్పుడు గాఢంగా వస్తుంటుంది. దాని వలన వ్యక్తి మెలకువగా ఉండడం సాధ్యం కాదు. ఈ రోగం వలన వ్యక్తిలో నిరాశ, ఉదాశీనత మొలకెత్తుతుంది. స్మరణ శక్తి క్షీణిస్తుంది. దృష్టిభ్రమ కూడ కలుగుతుంది. 'రేపిడ్ ఐ మూవ్ మెంటు స్లీప్ బిహేవియర్ డిసార్డరు' అనే మరో రోగంవల్ల వ్యక్తి క్షోభను పొందుతాడు. కొన్ని పనులలో మూర్ఛ రోగిలా చుట్టూ తిరుగుతుంటాడు.

సామాన్యంగా గురక పెట్టడం గాఢనిద్రకు సంకేతంగా భావిస్తారు. కాని అది అవాస్తవం. బలమైన గురక శ్వాస నాళికపైభాగంలో బాధను పుట్టిస్తుంది. దీనివలన రక్తంలోని ఆక్సిజను పాలుతక్కువై రాత్రంతా మెదడు నిద్రతో ఉత్తేజితమౌతుంది. ఈ అలవాటు నెమ్మదిగా ఒక రోగంగా మారుతుంది. దీనినే 'అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఎవనీయా సింద్రోమ్' అంటారు. దీంతో వ్యక్తి రాత్రంతా ఛాతీలోను, గొంతులోను ఊపిరి అందని భావన కలిగి పరుపుపై ఇటు అటు ప్రక్కవైపు ఒత్తిగిలుతూ గడుపుతాడు. అట్టివ్యక్తికి గుండె జబ్బు సంభవించే అవకాశం ఎక్కువ.

శ్వాస క్రియ, నిద్ర రోగానికి సంబంధించిన విశేష వైద్యుడు డా॥ యమ్. మస్. కంవరు ప్రకారం అమెరికా, ఐరోపాలలో అట్టి రోగులందరూ నిద్రా ప్రయోగ శాలల సహాయం తీసుకుంటారు. ఇట్టి పశ్చిమ దేశాల ప్రయోగశాలలలో, సంఖ్యయెంత హెచ్చుగా పెరుగుతోందంటే, రోగి తన వంతు పరీక్షకై నెలల తరబడి నిరీక్షించవలసి ఉంటుంది. రోగి నిద్రను ఈ ప్రయోగశాలలు 'పోలీ సోమనోగ్రఫీ' ద్వారా రాత్రంతా తనిఖీ చేస్తాయి. దీని వలన నిద్ర సంబంధిత ఇబ్బందులు, నిద్రలో వేర్వేరు చరణాలలో శ్వాసకుగల సంబంధం, గుండె కొట్టుకోవడం, రక్త ప్రవాహంలోని అసహజత్వం మొదలైనవి గుర్తించబడతాయి. దీని ఆధారంపై రోగికి తగిన చికిత్స చేయడానికి వీలౌతుంది. కొత్త పరిశోధనల ప్రకారం 'స్పెక్ట్రోస్కోపీ' ద్వారా మెదడులోని భాగంలోని సూక్ష్మగుణ దోషాలనైనా విశ్లేషించి నిద్ర సమస్యను పరిష్కరించవచ్చు. భారతదేశంలో కూడ నిద్రను పరిశోధించే ఇట్టి ప్రయోగశాలలు స్థాపించబడ్డాయి.

నిద్ర రాకపోవడమనే గడబిడ వలన మొత్తం జీవన క్రమం అస్తవ్యస్తమౌతుంది. కుటుంబ బాధ్యతల్లో దైనిక ఉద్యోగ కార్యక్షేత్రాలలో పెరుగుతున్న ఒత్తిళ్ళ ప్రభావం కూడ సామాన్య వ్యక్తి నిద్రపై ప్రభావం చూపుతుంది. కాని నిద్రా సంబంధమైన అధిక రోగాలకు కారణం-వారి జీవన సరళి, వ్యాయామం లేకపోవుట, ఆహార పానీయాలలో చెడు అలవాట్లు, భారీ కాయులవడం, చెడు ప్రభావం లేకుండా స్వాభావిక నిద్రకోసం మందులంటూ ఏవీ లేవు. నిద్ర లేమి కారణాలను పరిష్కరించకుండా, నిద్ర మాత్రల ద్వారా, దానిని పరిష్కరించడం అసంభవమని వైద్యుల భావన.

నిద్రా పరిశోధకులైన వైద్యుల ప్రకారం, వ్యక్తి నిద్ర పోవాలనుకునేటప్పుడే పరుపుపైకి వెళితే సహజ నిద్ర వస్తుంది. నిద్రకుపక్రమించే ముందే అన్ని ఆలోచనలను, ఒత్తిడులను విడిచి పెట్టాలి. నిద్రకు కనీసం రెండు గంటల ముందే భోజనం చేయాలి. నిద్రపోయే గది పరిశుభ్రం గాను శాంతంగా ఉండడం కూడ తప్పనిసరి. తూర్పు వైపు తల పెట్టుకొని నిద్రిస్తే సుఖమైన, శాంతి దాయకమైన నిద్ర వస్తుంది. ఈ విషయం విభిన్న వైజ్ఞానిక పరిశోధనల ద్వారా నిర్ధారించబడింది. నిద్రలేమినుండి రక్షణ పొందాలంటే నియమిత దినచర్యను పాటించడం అవసరం.

సూర్యోదయానికి ముందే లేవడం, సరైన వ్యాయామం చేయడం, ఒత్తిడి పూర్వక వాతావరణానికి దూరంగా ఉండడం, నిద్రకు సహకరిస్తాయి.

ఆయుర్వేదంలో నిద్రను 'భూతధాత్రీ' అన్నారు. భూతమంటే ప్రాణి, ధాత్రి అంటే పోషించేది. ఏ విధంగా తల్లి పిల్లల పాలన – పోషణ చేస్తుందో, అదే రీతిలో నిద్ర కూడ శరీరాన్ని పోషిస్తుంది. చింత, ఉద్వేగాలను పారద్రోలి, నిశ్చలమైన మనోభావాలతో నిద్రకుపక్రమిస్తే, నిశ్చయంగా మనకు నిద్రవలన లభించే లాభాలు, వరాల నుండి దూరంగా ఉండవలసిన అవసరముండదు.

*అనువాదం : బాసంగి శ్రీరాములు*

*(అఖండజ్యోతి – ఏప్రియల్ 2000)*

**ధనంతో పూజాద్రవ్యాలు కొనవచ్చు, కానీ శ్రద్ధను కొనలేము.**

ధారావాహిక: హనుమత్ కథామృతం-20

# స్ఫూర్తిదాయకమైన సూర్యకిరణాలు - హనుమాన్

సూర్యదేవుని సాన్నిధ్యంలో హనుమాన్ తనకే తెలియని స్థితిలో తపించిపోతున్నాడు. ఆతని మనస్సు సూర్యునిలో లీనమైపోతూ ఉంది. "ఓం ఘృణిః సూర్యాయనమః" మంత్రస్వరాలు 'వైఖరీ, మధ్యమా, పశ్యంతీ, పరా క్షేత్రాలలో ఒకే విధంగా ధ్వనిస్తూ ఉన్నాయి. ఆ ధ్వనులను అనుసరించి సూర్యదేవుని, ప్రచండ శక్తి హనుమాన్ యొక్క అంతశ్చేతనలో కలిసిపోతూ ఉంది. ఒకానొక ఘటనను విచిత్రంగా జరిగిపోతున్నట్లు భావన కలుగుతోంది. ఆ ఘటన ఎప్పుడో, ఎక్కడో చూచినట్లుగా అనిపిస్తోంది. సదాశివుడు రెండు రూపాల్లో దర్శనం ఇస్తూ ఉన్నాడు. 1) మహారుద్రుని రూపం 2) హనుమాన్ రూపం. ఆ సమయాన గతంలో భగీరథుడు బ్రహ్మనుగూర్చి తపస్సు చేయడం, బ్రహ్మదేవుడు శివుని గూర్చి తపస్సు చేయుమని చెప్పడం, సదా శివుడు గంగానదిని తన జటాజూటంలోనికి ఆహ్వానించడం, తరువాత ఆ ప్రవాహాన్ని భూమిపైకి విడవడం మొదలైన వన్నీ గుర్తుకు వస్తున్నాయి.

హనుమాన్ మనస్సులో మెదిలిన గంగాధరుడు ఇప్పుడు బాలహనుమాన్ రూపును ధరించినట్లూ, సూర్యదేవుని ప్రచండ శక్తినంతా ఆ బాలరూపంలోనికి నింపుతున్నట్లూ భావన కలుగుతోంది. ఒకనాడు మన్మథుని దహించివేసిన పరమశివుడు ఈనాడు ఈ హనుమాన్ అవతారంలో మన్మథ రూపు దాల్చినట్లుగా అనిపించసాగింది. సూర్యదేవుని స్వర్ణకాంతులతో బాలహనుమాన్ మెరిసి పోతున్నాడు.

సూర్యదేవుని మంత్రసాధన వల్ల పుట్టిన శక్తినంతా పరమ శివుడు తన జటాజూటంలో కాకుండా, సకల నాడులలోను నింపుకుంటున్నాడు. జపించబడుతూన్న ఈ సూర్యమంత్ర స్వరాలు లయ బద్ధంగా వ్యాపిస్తూ సూక్ష్మం నుండి అతి సూక్ష్మంలోనికి మారిపోతున్నాయి. హనుమాన్ అస్తిత్వంలో విద్యుత్కణాల కదలిక పెరిగిపోతూ ఉంది. క్రమంగా అవతరిస్తూ ఉన్న సూర్యశక్తి నాడులలో ఉన్న మలినాన్ని దూరంచేస్తూ ఉంది. బాల హనుమానుని సమస్త నాడీ మండలం సూర్యుని యొక్క పవిత్ర కాంతి వల్ల స్వచ్ఛమై, పవిత్రతను పొందింది, దానితో పాటే మానసిక స్థితి కూడ మార్పు చెందుతూ ఉంది. ఈ స్థితిలోనే అతడు యోగంలోని నూతన రహస్యాన్ని కనుగొన్నాడు. హృదయ క్షేత్రంలోని కొన్ని రహస్యనాడులు నేరుగా సూర్యమండలంతో సంబంధంపెట్టుకొని ఉన్నట్లుగా అనుభవం అయింది. సాధారణ సమయాల్లో వీటి ద్వారాలు మూయబడి ఉంటాయి. యోగ సాధన, సూర్యసాధనా సమయాల్లో ఈ నాడుల ద్వారాలు తెరువబడుతాయి. ఆ మార్గంగుండా సూర్యలోకానికి సూక్ష్మమార్గం మెరిసి పోతూ కనిపిస్తుంది.

ఈ సూక్ష్మమార్గం నుండి ప్రవేశించడానికి ముందుగానే హనుమాన్ యొక్క కామశక్తి ప్రాణశక్తిగా రూపాంతరం చెందుతుంది. అందువల్ల సూర్యమంత్ర స్వరాల ప్రభావం వల్ల హనుమాన్ బాలబ్రహ్మ చారిగా ప్రసిద్ధి చెందాడు. క్రమంగా రేతస్సు ఓజస్సుగాను, ఓజస్సు తేజస్సుగాను, తేజస్సు వర్చస్సుగాను పరివర్తన చెందుతున్నాయి. సూర్యచేతన యొక్క అణువు నుండి పరమాణువు వరకు, దేహము నుండి ప్రాణమువరకు, మరియు మనస్సునందలి అణు – పరమాణువులను శుద్ధిచేసి పరివర్తన చెందించడం జరుగుతోంది. పనిలో మార్పురావడం వల్ల నిద్రాహారాలలో కూడ మార్పు జరుగుతోంది. నిద్ర యోగనిద్రగా మారిపోయింది. ఆకలి అనేది అసలే లేకుండా పోయింది. హనుమాన్ యొక్క స్థితిని తల్లి గమనిస్తూనే ఉంది. తన కుమారుడు ఏదో ప్రత్యేక సాధనలో నిమగ్నుడయ్యాడని అర్థం చేసుకున్నది.

కాని ఆ సాధన ఏమిటి? అన్న ప్రశ్న ఆమెను వేధిస్తోంది. ఒక రోజు ప్రాతఃకాలంలో హనుమాన్ మంత్రసాధనలో మునిగిఉన్నాడు. హనుమాన్‌కు తల్లి, తండ్రి, గురువు అన్నీ అంజనాదేవే. తల్లి దగ్గర ఏ విషయాన్నీ దాచేవాడుకాదు. ఇప్పుడు నిమగ్నమై ఉన్న మౌనసూర్యసాధనలో కూడ తల్లి బోధ ఉండనే ఉంది. ఒకనాడు ఏదో సందర్భంలో "నాయనా! సాధనా విధానంలోనూ దానివల్ల కలిగే ఫలితాల విషయంలోనూ మౌనంగా

**భగవంతుని పొందడానికి శ్రద్ధ కావాలి.**

ఉండాలి. అన్నింటినీ బహిరంగ పరచవద్దు". అని చెప్పింది. "అలా దాచడం ఎందుకు?" అని అప్పుడే తల్లిని ప్రశ్నించాడు కూడ. "కుమారా! సామాన్యులు సాధన చేయలేరు. వారి వద్ద సాధన గురించి ప్రస్తావిస్తే సాధకుని మహాత్మునిగా భావించి, విశేషంగా గౌరవిస్తారు. ఆ సన్మానాలతో సాధకుని హృదయంలో అహంకారం ఉదయిస్తుంది. క్రమంగా వృద్ధి చెందిన అహంకార వృక్షం గొడ్డళ్ళకు కూడ ఎదురు తిరుగుతుంది. క్రమంగా సాధనా మార్గంలో అనేకమైన అదృశ్య ఆటంకాలు నిలబడతాయి. ఫలితంగా సాధకుడు పతనమైపోతాడు" అని వివరించింది.

తల్లి చేసిన ఈ బోధ వల్ల హనుమాన్ మౌనంగా సాధన చేస్తున్నాడు. ఎవ్వరికీ కాదు కదా! తల్లికి కూడ చెప్పలేదు. ఒకరోజు తల్లి అడగనే అడిగింది. సూర్యమంత్రసాధన గురించి చెప్పక తప్పలేదు. తన సాధనలో రాత్రికి, పగలుకు తేడా తెలియడం లేదనీ, అవిరామంగా కొనసాగుతోందనీ, తనలో విచిత్రమైన ఒక ప్రత్యేక శక్తి ప్రవహిస్తోందనీ చెప్పాడు. అంతేకాక "ఇప్పుడు నాకు నిద్రరావడం లేదు. మనస్సు ఎప్పుడూ విశ్రాంతిగా ఉంటోంది. అలసట అనేదేలేదు. ఏదో నూతన చైతన్యం స్ఫూర్తిని కలిగిస్తోంది. కోపం రావాల్సిన సమయంలో కూడ ప్రసన్నంగానే ఉంటున్నాను. మనస్సు ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటోంది. సందేహాలు కలగాల్సిన సమయంలో జ్ఞానబోధ జరుగుతోంది. ఇదంతా ఏదో వింతగా జరుగుతోంది" అని విన్నవించుకున్నాడు.

కుమారుని ఆధ్యాత్మిక అనుభవాలు వింటున్న కొద్దీ అంజనాదేవి మనస్సు పులకించిపోతోంది. పుత్రోదయం కొరకు తాను చేసిన తపస్సు సార్థకం అయిందని పొంగిపోయింది. తన కుమారుడు సన్మార్గం వైపు పయనిస్తున్నాడనీ, ఎప్పటికీ అదే విధంగా పయనించాలనీ కోరుకున్నది. సాధనామార్గానికి హద్దులు లేవు. సాధకుని జీవితంలో విశ్రాంతి అనేది ఉండకూడదు. ఎప్పటికీ అదే మార్గంలో నడుస్తూ ఉండాలి. నడుస్తూ ఉండాలి, నడుస్తూనే ఉండాలి. అని కోరుకుంటూ అంజనాదేవి కొడుకు ముఖాన్ని పరిశీలనగా చూచింది.

హనుమాన్ ముఖమండలం వింత తేజస్సుతో మెరిసి పోతోంది. ఆతని నేత్రాలలో నూతన కాంతులు ప్రవహిస్తూ ఉన్నాయి. శరీరం మీది రోమాలు సూర్యకాంతిలో బంగారు తీగల్లా ధగధగలాడుతున్నాయి. కుమారుని శరీరంలో వస్తున్న మార్పులను అంజనాదేవి కన్నార్పకుండా చూస్తోంది. ఆమె నరనరాల్లో మమకారం పొంగి పొర్లుకొచ్చింది. ఒక్కసారిగా కుమారుని దగ్గరకు తీసుకుని నుదుటిపై ముద్దుపెట్టింది హనుమాన్ కూడ తల్లి ప్రేమలో కరిగిపోయాడు. ఆతనికి మాటలు కరువయ్యాయి. రెండు చేతులతో తల్లిని చుట్టివేసి, భావోద్వేగంలో తన్ను తాను మరచిపోయాడు. అంతటి తన్మయత్వంలోనూ తల్లి పలికిన పలుకులు అస్పష్టంగా వినిపించాయి. "కుమారా! నీవు నీ సాధనా మార్గంలో దూరంగా సాగిపో దూరంగా సాగిపో. దూరంగా సాగిపో."

*అఖండజ్యోతి – ఫిబ్రవరి, 2009*

## శ్రీ గాయత్రీ శతకం

16. *మననమొనరింప పదిమార్లు మంత్రఝరిని*
*ఆలకించిన ఆ తల్లి ఆక్షణంబె*
*బాధలన్నిటిన్ శీఘ్రమె పారగొట్టు*
*విశ్వ జనయిత్రి గాయత్రివేదమాత*

**భావం:** వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. నీకు ఏదైనా బాధకలిగినప్పుడు పదిసార్లు గాయత్రీ మంత్రాన్ని మననం చేస్తే తల్లి వెంటనే నీ బాధను అంతటినీ పోగొడుతుంది.

17. *మహిత మంత్రమునొకవేయిమార్లు నీవు*
*పఠన మొనరింప మనసార భక్తిమీర*
*వత్సరములోని పాపమున్ పరిహరించు*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

**భావం:** వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. మహాశక్తిగల గాయత్రీ మంత్రాన్ని మనసార భక్తితో వెయ్యిమార్లు స్మరిస్తే ఒక సంవత్సరంలో చేసిన పాపాన్నంతా తొలగించి, సద్బుద్ధి ప్రసాదిస్తుంది.

రచన
సహజ కవి, సాహిత్య రత్న,
శతక చతురానన, పద్య కవితాసుధానిధి
శ్రీ అయినాల మల్లేశ్వర రావు

**భగవంతుని చేరడానికి సేవచేయాలి.**

కుటుంబ నిర్మాణం

# బాల్యాన్ని రక్షించాలి

జీవితంలో ఎంతో అందమైన వయస్సు బాల్యం. ఈ బాల్యావస్థలో మాత్రమే చీకు చింత లేకుండా కాలాన్ని గడపగలం. ఆట పాటలతో గడిపే ఈ వయస్సు అందరికీ ఆకర్షణ కేంద్రంగా ఉంటుంది. ఏదైనా పొందాలనుకుంటే మారాంచేయటం, లభించకపోతే ఏడవడం ఈ వయస్సు ముఖ్య విశేషం చిన్నతనంలోని ఈ మొండి తనం రాజుల మొండితనంకంటే తక్కువైనది కాదు. పిల్లల కిలకిలారావాలతో కుప్పిగంతులతో పరిసరాలంతా ప్రతిధ్వనిస్తుంటాయి. ఇవన్నీ అందంగా అనిపిస్తాయి. కానీ అకాలంలోనే బాల్యాన్ని మ్రింగివేయాలని కోరుకుంటున్నారు. చిన్నతనం ఎందుకుతగ్గిపోతోంది? బాల్యంలోనే అసంగతమైన వికారాలు ప్రవాహంలాగా ఎందుకు ముంచెత్తుతున్నాయి? బాల్యావస్థలోనే వచ్చిపడే ఈ సంకటాలు మానవులను, సమాజాన్ని కూడా ప్రభావితం చేయగల్గుతాయి.

చిన్న వయసు చుట్టు ప్రక్కల పరిస్థితులతో వికసించి, పండి, పరిపక్వమౌతుంది. ఈ వయసు మెత్తని మట్టితో సమానమైనది. దీనిపై ఏ వస్తువు ముద్ర ఐనా తేలికగా పడుతుంది. అందువలన ఈ వయసును ఆ పరిస్థితులనుండి రక్షించక పోయినట్లయితే చెడు అలవాట్ల వలన, ప్రభావాల వలన ముందు ముందు సమస్యలు ఎదురవుతాయి. ఈ సమస్యలు ఎదురవకుండా ఉండాలంటే కుటుంబ ప్రభావం, కుటుంబ సభ్యుల వ్యవహారశైలి, వర్తమాన కాలంలోని శిక్షణా పద్ధతి మొదలైనవి ముఖ్యపాత్రను వహిస్తాయి. ఈ విషయాలన్నీ విధేయాత్మకమైనవి, ప్రేరణను కల్గించేవిగా ఉన్నట్లయితే పిల్లలు మంచి సంస్కారాన్ని పొందగల్గుతారు.

కుటుంబ వాతావరణం పిల్లలు పెరగటంలో ముఖ్యపాత్ర వహిస్తుంది. ఇక్కడే వారి బాల్యావస్థ, యవ్వనావస్థ కూడా గడుస్తాయి. ఇక్కడే పిల్లలు పెద్దవారౌతారు. మంచి – చెడు తెలుసుకోగల్గుతారు. కుటుంబవాతావరణం అనుకూలంగా ఉన్నట్లయితే పెరిగే వయస్సులో శారీరిక, మానసిక వికాసం సరియైన పద్ధతిలో జరుగుతుంది. కానీ వర్తమాన జీవనశైలిలో కుటుంబసామరస్యం కొరవడుతుంది. తల్లిదండ్రుల ఉద్యోగ వ్యాపారాల వలన పిల్లలకు వారికి మధ్య దూరం పెరుగుతోంది. ఈ ఎడబాటును తగ్గించే ప్రయత్నాలు ఏవీ జరగటంలేదు. దీని ఫలితంగా పిల్లలకు కావలసిన స్నేహంతో కూడిన ఆత్మీయ వాతావరణం కలగానే మిగిలిపోతోంది. ఈ దూరాన్ని నివారించేందుకై తాత–అమ్మమ్మ, నాన్నమ్మలు చెప్పే కథలు జీవితానికి కావలసిన శిక్షణ కూడా ఒంటరి కాపురాల వలన లభించడం లేదు. ఈ ప్రభావం పిల్లలపై బాగా పడుతోంది.

పిల్లల కోమలదేహం కోమలమైన మానసికస్థితికి ప్రేమ, ఆత్మీయతతో కూడిన వాతావరణం సంజీవని లాగా పనిచేస్తుంది. ప్రేమ నిండిన వాతావరణంలో పిల్లల వికాసం జరుగుతుంది. **అప్పుడే జన్మించిన పిల్లలకు పాలు ఎంత అవసరమో ఎదిగే పిల్లలకు కూడా ప్రేమతో కూడిన వాతావరణం అంతే అవసరం.** రాహిత్యం వలన పిల్లలు మానసికంగా క్షీణించి ఎందుకూ పనికిరానివారౌతారు. ఈ ప్రేమ దొరకకపోవడం వల్లనే ఈ కాలంలో చిన్న చిన్న పిల్లలలో ఒంటరితనం ఎక్కువై హింస, దొంగతనాలు మొదలైన చెడు అలవాట్లు కల్గుతున్నాయి.

సూర్యుని వెలుగు లేకపోవటం వలన వృక్షాలు, లతలు వడలిపోయి వెలుగును పొందే ప్రయత్నం చేస్తాయి. అదే విధంగా పిల్లలు కూడా ప్రేమను పొందేందుకు అనేక విధాలుగా ప్రయత్నం చేస్తారు. ఇందువల్లనే వారు అలుగుతారు. గొడవచేస్తారు. అయినప్పటికీ వారు కోరిన ప్రేమ లభించక పోయినట్లయితే, వారి బాల్యం చెడు దిశలోకి వెళ్తుంది. మన వైజ్ఞానికులు పరిశోధించి ప్రస్తుతకాలంలోని విప్లవకారుల చరిత్ర వెనుక ఘోరమైన ప్రేమ రాహిత్యం ఉందని చెప్తున్నారు. ప్రేమలేని హృదయం పాషాణంతో సమానమైనది. అటువంటి వారికి కట్టెలను కొట్టడానికి, మానవులను చంపడానికి తేడా ఉండదు. చిన్నతనంలో ప్రేమరాహిత్యం వారిని ఇటువంటి ఆత్మ ద్రోహకరమైన దిశవైపు నడుపుతుంది.

తీవ్రమైన మానసిక, శారీరిక మార్పులుచోటుచేసుకునే స్థితి కల్గిఉంటుంది బాల్యావస్థ. ఈ మార్పు జరిగే సమయంలో వారు కోరుకునే సున్నితమైన రక్షణను, ఆత్మీయతను ప్రస్తుత సమాజం, కుటుంబం వారికి ఇవ్వలేకపోతోంది. లేతవయస్సులో మంచి

**భగవంతుని ఆరాధించడానికి సంయమం కావాలి.**

భావాలు కల్గిన వారి స్నేహం, సహకారం వారికి కావాలి. పిల్లల మానసిక ప్రవృత్తిని తెలుసుకోలేకపోవటం వల్ల వారి మనో వికాసానికి కావలసిన ఆధారం లభించటంలేదు. ఆధునిక శిక్షణా సంస్థలు కూడా వారి మానసిక వికాసానికి కావలసిన ఏర్పాట్లను చేయలేకపోతున్నాయి. చదువు వలన వికాసం కల్గినప్పటికీ, దానికి తగినట్లుగా భావనావృద్ధి కల్గటంలేదు. దీని వలన అనేక సమస్యలు ఎదురౌతాయి.

ప్రస్తుతకాలంలో పిల్లల ముఖ్యసమస్య ఒంటరితనం. ఒంటరితనపుబాధ అమెరికా పిల్లలలో సామాన్య విషయం. అమెరికాలోని పిల్లల్లో మూడు సంవత్సరాల వయస్సులో మొలకెత్తిన హింసా భావనలు వారు పెద్దవారైనాక కూడ వదిలిపెట్టడం లేదు అని ఒక సర్వేలో తెలిసింది. విశ్లేషకులు ఇది 80% ఉందని భావిస్తున్నారు. అంటే కేవలం 20% మాత్రమే ఈ వినాశకరమైన ప్రవృత్తి నుండి రక్షింపబడుతున్నారు. మిగిలిన 80% హింసా ప్రవృత్తితో గడిపివేస్తున్నారు.

మనదేశంలోని చాలామంది పిల్లలలో ఒంటరితనం ఎక్కువైపోతోంది ఇక్కడి పిల్లలు మానసిక ఒత్తిడితో జీవిస్తున్నారు. ఈ ఒత్తిడికిలోనైన పిల్లల లక్షణాలు వేరుగా కనపడతాయి. ఈ పిల్లలలో తరచుగా తలనొప్పి, కోపం, పొగరుబోతుతనం, స్వభావంలో విపరీతమైన మార్పులు, చదువులో ఏకాగ్రత లేకపోవటం వంటి లక్షణాలు కనపడతాయి. ఇదే విధమైన లక్షణాలు ఎక్కువకాలం కొనసాగితే పరిస్థితి ప్రమాదకరం కావచ్చు.

పిల్లలు ఈ విధమైన సమస్యలనుండి బయటపడి మంచి వికాసం పొందాలంటే ముఖ్యంగా కావలసినది కుటుంబంలో, శిక్షణా సంస్థలలో సముచిత పద్ధతిలో మంచి ఆలోచనలతోపాటు, సాహసాన్ని, ధైర్యాన్ని నేర్పించాలి. వారుచేసిన తప్పులను గురించి నిందించకుండా వారే వారి తప్పులను, లోపాలను గుర్తించేలా చేయాలి. ముఖ్యంగా గుర్తుంచుకోవలసినదేమంటే వారిని ఎప్పుడూ ఒంటరితనం బాధించకుండా చేయాలి. పెద్దవారే ఒంటరితనంతో బాధపడ్తుంటే, చిన్నవయసువారిని ఒంటరితనం ప్రభావితం చేయకుండా ఉంటుందా? చదువులో మంచి రాంకును సాధించాలని ఏ విధంగా ప్రోత్సాహం ఇస్తున్నారో, అదే విధంగా జీవన విలువలను గురించి బోధించటానికి కూడా ప్రయత్నం చేయాలి. వారి మానసిక స్థితిని అనుసరించి వారితో వ్యవహరించాలి. దీనికొరకై వారి సంరక్షకులు, శిక్షకులు కూడా శిక్షణ పొందాలి. దీని వలన వారు పిల్లల సున్నిత భావాలను అర్థంచేసుకుని వారి మనో వికాసానికి సహాయపడాలి. ఈ విధమైన పరిస్థితుల ద్వారా మాత్రమే వారి భవిష్యత్తును సుందరంగా తీర్చిదిద్దడం సాధ్యపడుతుంది.

అనువాదం - ఎ.ఆర్. నిర్మల

## కదిలించే కళ్లు

15.సీ॥ జరిగిపోయిన మూడు జన్మలకథలన్ని
కదలాడుచుండగా కనుల ఎదుట
భావ ఉద్వేగమో! ఆవేశమో! యంచు,
భూత పిశాచాల చేతలనుచు
సందోహరూపాన సందేహవలయాలు
తిరుగాడుచుండెను తీరుగాను
ఊయల వోలెను ఊగేటి మనమును

తే॥ ఆగబట్టిన గురుదేవు ఆదరింపు
తెలిపినట్టిదివ్యాత్మల తీరులన్ని
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

16.సీ॥ "నీజన్మ వరుసలన్ నీ కిప్డు చూపించి
నీ బాధ్యతన్ దెల్పి నేర్పుకొరకు
నేను కోరిన వ్యక్తి నేర్పునుపరికించి
దివ్యాత్మగా తీర్చిదిద్దుకొరకు
గురుశిష్యబంధంబు గూఢంబుగాదెల్పి
నవ్యమౌ మార్గాన నడుపుకొరకు
దివ్యాత్మగా నేను దిగివచ్చినాడను
పట్టున్న వ్యక్తితో జట్టుకొరకు"

తే॥ పైన పలికిన పలుకుల పసనుదెలిసి
గురువునీడలో నడచిన గురుతులన్ని
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

రచన-మధుర కవయిత్రి
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**భగవంతుని తెలుసుకోవడానికి స్వాధ్యాయం కావాలి.**

ధారావాహిక : భక్తిగాథ-25

# సమస్త కోరికలు నశింపచేసేదే భక్తి

ఆపస్తంభ ఋషి ఆలోచనలలోనూ, దేవర్షి భావనలలోను నిమగ్నులయ్యారు. హిమాలయము తన ప్రాంగణంలోని ఋషులను, మునులను, సిద్ధులను తదేకంగా చూస్తున్నది. తన అంతరంగం కూడ భక్తి సరోవరంలో తడిసిపోయింది. మంచి భావనలను కలిగించుకోవడం, పరిష్కరించుకోవడం, ఊర్ధ్వముఖం చేసి భగవంతుని చేతనలో లీనమవడమే భక్తునికి కావలసినది, దేవర్షి నారదుల వారు చెప్పిన వ్రజభూమి కథ విన్న ఆపస్తంభ ఋషి సందేహాలన్నీ తీరిపోయాయి. అతని అంతఃకరణ భక్తి భావంతో పులకించి పోయింది. మిగిలిన ఋషులంతా కూడ వ్రజభూమిని స్మరిస్తూ భక్తి విహ్వలులయ్యారు.

గాయత్రీ మహామంత్రం యొక్క శక్తి ప్రవాహాన్ని ధరాతలం మీదకు అవతరింపచేసిన విశ్వామిత్రుల వారు కూడ సమాధి స్థితిలో ఉన్నారు. వసిష్ఠ మహర్షి విశ్వామిత్రులతో "బ్రహ్మర్షీ! మీరు ఏ జ్ఞాపకాలలో లీనమయ్యారు, మేమంతా వినదగిన వారమైతే మా అందరికీ మీ అనుభవాలను గురించి తెలిపి అమృతపానం చేయించండి అని అడిగారు. ప్రాతఃకాలంలో ఉదయిస్తున్న సూర్యునికి విశ్వామిత్రుల వారు ఉన్మీలిత నేత్రాలతో ప్రణామం చేశాడు. హిమాలయ శ్వేత శిఖరాలు బాల భాస్కరుని స్వర్ణిమ కిరణాల వల్ల బంగారు రంగుతో మెరిసి పోతున్నాయి. సవితా దేవత యొక్క కాంతిపుంజాన్ని సదా హృదయంలో నిలుపుకున్న విశ్వామిత్రుల వారు చెప్పడం ప్రారంభించారు–" బ్రహ్మర్షీ! ఇంతకు పూర్వం త్రేతాయుగంలో పరాత్పర బ్రహ్మ శ్రీరామునిగా అవతరించినపుడు నేను రామలక్ష్మణులతో కలసి మిథిలా నగరమెళ్ళాను."

"అచ్చట నేను విదేహ కన్య సీతను చూచాను. సుకుమారంగా ముకుళితమైన మొగ్గలాగ సంకోచంతో సిగ్గుపడుతున్న ఆమె రూపం బాహ్య అవతరణం, ఆమె లోపల సహస్రకోటి బ్రహ్మాండాలను సృజించి, పాలించి, లయింపచేసే మహాశక్తి యొక్క విరాట్ అనంత చైతన్యసాగరం తరంగితమౌతున్నది. ఆమెను చూడగానే ఈమె వేదమాత గాయత్రి సీత రూపంలో జనకుని ఇంట తిరుగుతున్నదని తెలుసుకున్నాను. ఆ మహామాయకు భావయుక్తమైన మనస్సుతో నమస్కరిస్తూ ఇలా ప్రార్థించాను–

"సృష్టి, స్థితి సంహారకారివైన జనన్మాతా ! ఈ బాలునిపై దయచూపుము"

యుగాలు మారాయి. వాటితోపాటు దృశ్యాలు కూడ మారాయి. ద్వాపర యుగం వచ్చింది. నేను హిమాలయ పర్వతగుహలో తపమాచరిస్తూ ఉండేవాడిని, కానీ నా అంతః కరణలో మాత్రం గాయత్రీ మాత ఎప్పుడు, ఎక్కడ, ఏ రూపంలో ఉన్నప్పటికీ నేనామెను దర్శించుకొని ఆశీర్వాదం పొందుతాను అన్న భావన ఎప్పుడూ ఉండేది. ద్వాపరయుగంలో మహామాయ అనేక రూపాలలో వ్యక్త మయిందని నాకు అనుభవమయింది. రుక్మిణీ రూపంలోనూ, రాధ రూపంలో కూడ ఆమె వ్రజభూమికి వచ్చింది. ఆ మహామాయే భగవతీ పూర్ణమాసీ రూపంలో వ్రజభూమిని రక్షించే భారాన్ని స్వీకరించింది. ఆ జగదంబే గోపికలు, గోప బాలికల రూపంలో సంచరిస్తూ ఉంది."

నేను ధన్యుడనయ్యాను, కృతార్థుడనయ్యాను. వేదమాతను ఇన్ని రూపాలలో దర్శించుకున్న నా నుండి స్తోత్ర మహామంత్రం ఉచ్చరింపబడింది.

*విద్యాః సమస్తా స్తవదేవి భేదాః*
*స్త్రియః సమస్తాః సకలా జగత్సు !*
*త్వయైకయా పూరితమంబ యైతత్*
*కాతే స్తుతిః స్తవ్యపరా పరోక్తిః !!*

ఓ దేవి ! సంపూర్ణమైన విద్యలు నీ యొక్క భిన్న భిన్న స్వరూపాలే. జగత్తులోని స్త్రీలందరూ నీ రూపాలే. జగదంబా! నీవు ఒక్కదానివే సమస్త విశ్వాన్ని వ్యాపించియున్నావు. నిన్ను ఎలా స్తుతించాలి. స్తవనము చేయగల పదార్థాలన్నింటికీ ఉన్నతమైన పరావాణివి."

నా స్తోత్రము చేత జగన్మాత ప్రసన్నురాలై వృషభాను ముద్దులరాధలో అన్నీ లీనమై ఉన్నాయని నాకు దర్శింప చేసింది. నా కప్పుడు తెలిసింది రాధయే జగన్మాత యొక్క ప్రధాన లీలా స్వరూపమని, జగన్మాత యొక్క ఇతర స్వరూపాలన్నీ ఆమెలోనే

**భగవంతుని తెలుసుకోవడానికి విశ్వాసం కావాలి.**

ఉద్భవించి ఆమెలోనే లయమవుతాయనీ, శ్రీరాధను దర్శించుకోవాలనీ నేను వ్రజ భూమి కెళ్ళాను. అచ్చట నేను ప్రేమ యొక్క సాకార మూర్తిని చూచాను. పరమాత్మ యొక్క పవిత్ర ప్రేమకు సాకారమామె. ఆమె బాహ్యంగా సాధారణ స్త్రీ వలె అగుపించినప్పటికీ నా మీద అపూర్వమైన దయతో నాకు తన యథార్థ దర్శన భాగ్యాన్ని కలుగ చేసింది. ఆమె నాకు ఇంకొక విషయాన్ని కూడ తెలియచేసింది – ఈ వ్రజ భూమిలో గోపబాలురూ, గోపికలూ పశు పక్ష్యాదులూ, అడవులూ, వృక్షాలూ, పర్వతాలూ, నదులూ భూమి యొక్క ధూళికణాలూ అన్నీ కూడ శ్రీకృష్ణునికి అర్పింపబడినవే.

"వ్రజభూమిలో ఏ చైతన్యమైతే ఉన్నదో అది ప్రేమ చైతన్యం. జడరూపంలో ఉన్న భూమి, పర్వతరాజు గోవర్ధనం, యమునా నదీ ఇవన్నీ కూడ ఆ పరాత్పరుని ప్రేమకు సాకార స్వరూపాలు. వ్రజ భూమిలో ఎవరూ కూడ తమకోసం ఏమీ కోరరు. వారికి శక్తిగానీ, సిద్ధిగానీ, స్వర్గంకానీ, మోక్షం కానీ ఏవీ అవసరం లేదు. వారందరూ తమ సర్వస్వము శ్రీకృష్ణునికి అర్పణ చేసి ప్రసన్నంగా ఉంటారు. వారి సమర్పణ భావం ఎంత ప్రగాఢమైందంటే కృష్ణుని కొరకు కృష్ణవియోగాన్ని కూడ సహిస్తారు.

బ్రహ్మర్షి విశ్వామిత్రుల వారి ధారాప్రవాహవాణి అందర్నీ సమ్మోహితులను చేసింది. అందరూ నిశ్శబ్దంగా వింటూ ఉన్నారు. దేవర్షి భావ సమాధిలో నిమగ్నమై తన క్రొత్త భక్తి సూత్రాన్ని ఉచ్చరించడం మరచి పోయారు. బ్రహ్మర్షి విశ్వామిత్రుల వారు దేవర్షితో "మా అనుభూతులు అంత ప్రగాఢమైనవి కావు. దేవర్షి భక్తి భావ మర్మజ్ఞులు. వారికి వ్రజభూమి యొక్క అనుభవం ఎక్కువ. ఇప్పుడు వారే ఏమైనా చెప్పాలి." అన్నారు. బ్రహ్మర్షి వచనాలతో రోమాంచితుడైన దేవర్షి

" వ్రజభూమి అంటే వ్రజభూమే. అందువల్లనే శ్రీకృష్ణుడు తన స్నేహితుడైన ఉద్ధవునితో చెప్పాడు. ఉద్ధవ్ మోహా వ్రజ బిసరత్ నాహీ !" (ఉద్ధవ్ ! వ్రజ భూమి నన్నెప్పటికీ మరువదు.) అచ్చటి గాలిలో కూడ భక్తి కలసి ఉంది. అచటివారు తమ కోసం ఏమీ కోరరు."

నేను చెప్పబోయే భక్తిసూత్రం కూడ ఇదే చెప్తుంది –

నా స్త్యేవ తస్మిన్ స్తత్సుఖ సుఖిత్వమ్ (24)

"వ్యభిచారి యొక్క ప్రేమలో ప్రియుని ప్రేమలో ఉన్న సుఖం కలుగదు."

ఈ సూత్రంలోని సత్యాన్ని ఉచ్చరిస్తూ దేవర్షి ఆపస్తంభ ఋషిని చూచారు. ఆపస్తంభ ఋషికి తను మొదట మాట్లాడిన మాటలకు సంకోచం కలిగింది. సంకోచంతో ఆయన తలవంచుకున్నారు. దేవర్షి ఇది గమనించలేదు, చెప్పుకుపోతున్నారు–" ఈ సూత్రంలోని సత్యాన్ని విశ్వామిత్ర ఋషి స్పష్టం చేశారు. వాస్తవం ఏమిటంటే భక్తిలో, ప్రేమలో, ప్రేమగల భక్తుడు తన కొరకు ఏమీ వాంఛించడు. అతని ఏకైక కోరిక, చింతన, అభిలాష అన్నీ కూడ తను ఏమి చేస్తే తన ఆరాధ్యదైవం తన ఎడల ప్రసన్నంగా ఉంటాడనేదే. వ్రజభూమిలోని గోప కన్యకలందరూ దీనికి సాకార స్వరూపాలు. వారి సర్వస్వం కృష్ణుని కొరకే. గోపికలే ఏమిటి, గొల్లపిల్లలు, నందుడు, యశోద, పర్వతరాజు గోవర్ధనగిరి, భగవతీకాళింది, కదంబ మొదలైన వృక్షాలు అన్నీ కూడ కేవలం కృష్ణప్రేమ కొరకే. భక్తి యొక్క సత్యం వ్రజ భూమి యొక్క ధూళి కణాల్లోనే ఉంది."

ఇలా చెప్పి దేవర్షి మరల భావమగ్నుడయ్యాడు. మిగిలిన వారు కూడ భక్తిసంతలో పునీతులౌతున్నారు.

*అనువాదం – కె. అరవిందమ్మ*
*(అఖండజ్యోతి – ఫిబ్రవరి 2008)*

## స్వాభిమాని బాలగంగాధర తిలక్

*తిలక్ చదివే కాలేజీలో అందరు విద్యార్థులూ ఫ్యాషన్‌కు అలవాటు పడ్డారు. సూటు, బూటు వేసుకుని తెల్లదొరల్లాగా హుందాగా తిరిగేవారు. ఒక్క తిలక్ మాత్రమే పైజామా, లాల్చీ ధరించేవాడు. తలపాగా ధరించేవాడు. అందరూ తలపై టోపీ పెట్టుకుని తిలక్‌ని వెక్కిరించేవారు. కానీ తిలక్ ఆవేశపడేవాడు కాదు. వారి చేష్టలను, మాటలను ఓర్పుతో సహించేవాడు. నేర్పుగా స్వదేశీ దుస్తులగురించీ, స్వాభిమానం గురించీ వివరించేవాడు. వారిలో పరివర్తన తీసుకురావడానికి అనేక విధాలుగా ప్రయత్నించాడు. క్రమంగా తిలక్‌ను హేళన చేసినవారంతా స్వదేశీ దుస్తులనే ధరించడం మొదలుపెట్టారు. తిలక్‌తోపాటు యోగాభ్యాసానికి అలవాటు పడ్డారు. తమ తమ అలమార్లలో ఉన్న మందులను తీసి బయట పారవేశారు. యోగాభ్యాసంతో ఆరోగ్యవంతులయ్యారు. తిలక్‌ను అనుసరిస్తూ స్వరాజ్య సమరంలో పాల్గొన్నారు. స్వాభిమానంలో తిలక్‌ను మించిపోతూ ముందుకు సాగారు.*

**భగవంతునిలో లీనంకావడానికి సమర్పణ కావాలి.**



ప్రత్యేక వ్యాసం - (దత్తాత్రేయ జయంతి సందర్భంగా)

# దత్తాత్రేయుడు - 24 మంది గురువులు

జగద్గురువు శ్రీ కృష్ణుడు అర్జునుని కర్మబంధాలనుండి విడిపించాడు. బ్రహ్మర్షి అయిన వశిష్ఠుని శరణువేడిన తరువాతనే విశ్వామిత్రునికి బ్రహ్మజ్ఞానం లభించింది. విశ్వమంతా వ్యాపించిఉన్న సద్గురుతత్వాన్ని ఎలా గుర్తించాలో సిద్ధుడు నామధారకుడికి అవధూతోపాఖ్యానంతో వివరించాడు. శ్రీ శిరిడీ సాయిబాబా వంటి సద్గురువు ఈ నాటికే తన భక్తులకు అనేక అనుభవాలు ప్రసాదిస్తున్నారు. ఈ ఉపాఖ్యానంలో అవధూత అయిన దత్తాత్రేయుడు 24 మంది గురువుల నుండి జ్ఞానాన్ని సంపాదించిన వివరాలు పొందుపరచబడ్డాయి. ముముక్షువులు అయిన వారు ప్రతి ఒక్కరు చదివితీరవలసిన అంశాలు ఇందులో ఉన్నాయి.

అది నిర్జనారణ్యం. ఒకానొక సర్వసంగపరిత్యాగి కటికనేలపై నిర్వికారంగా పడుకొని ఉన్నాడు. పురుషార్థాలలో ముఖ్యమైన ధర్మ, అర్థ, కామములు ఏవీ ఆ సన్యాసిని సమీపించడంలేదు. కానీ యయాతి పుత్రుడు యదుమహారాజు అదే అరణ్యానికి వేటకు వచ్చాడు. స్వామిని సమీపించాడు. వినమ్రంగా నమస్కరించాడు. "స్వామీ! సకలమూ తెలిసిన సర్వసమర్థులు మీరు. మానవ మాత్రులు లేని ఈ అరణ్యంలో ఇంత ఆనందంగా ఎలా గడపగలుగుతున్నారు? మానవ సహజమైన ఎలాంటి కోర్కెలూ మిమ్ములను చుట్టుముట్టడం లేదా? మీ ఆనందం వెనుకదాగి ఉన్న రహస్యం ఏమిటి? నాసాహసాన్ని మన్నించి తగిన సమాధానం చెప్పగలరా?" అని ప్రశ్నించాడు.

అప్పుడా అవధూత – "నాయనా! నీ వినయవిధేయతలు నా మనస్సును ఆకట్టుకున్నాయి. లోకశ్రేయస్సుకై నీ సందేహాన్ని తప్పక తీరుస్తారు. శ్రద్ధగా ఆలకించు" అంటూ తన యొక్క జ్ఞానరహస్యాన్ని క్రింది విధంగా విప్పి చెప్పారు.

## ప్రకృతి నేర్పిన పాఠాలు

"నాయనా! నేను ఈ ప్రకృతిలో 24 మంది గురువుల వద్ద పాఠాలు నేర్చుకున్నాను.

**నా మొట్టమొదటి గురువు భూమి:–** ఈశ్వరుని ఆజ్ఞానుసారం ఈ చరా చర ప్రకృతిలో కోట్లకుమించిన సంఖ్యలో ప్రాణులు–అప్రాణులు ఈ భూమిమీద జీవిస్తున్నాయి. మానవులు తమ తమ జీవిక కోసం భూమిని దున్నుతారు. చెరువులు, బావులు త్రవ్వుతారు. జీవులన్నీ ఆమె మీద మలమూత్రాలు విసర్జిస్తాయి. అయినా భూమి ఏ మాత్రం సహనాన్ని కోల్పోదు. తనను బాధించిన వారికి, మైలపరచినవారికి అందరికీ సమానంగా పాడిపంటలను సమకూరుస్తూ ఉంది. జీవనాధారమైన చల్లని నీటిని ప్రసాదిస్తోంది. ఎవరిమీద పగతీర్చుకునే ప్రయత్నం చేయడంలేదు. వర్షాలకు ఆధారమైన అరణ్యాలు, కొండలు, సముద్రాలు మొదలైనవన్నీ భూమిని ఆశ్రయించుకునే మనగలుగుతున్నాయి. పంటలకు ఆధారమైన నదీనదాలు భూమిపైననే చరిస్తున్నాయి. అదే విధంగా యోగి కూడా ఎన్ని బాధలు ఎదురైనా ఓరిమితో తన ధర్మాన్ని తాను నిర్వర్తించాలని నేర్చుకున్నాను.

**నా రెండవ గురువు వాయువు:–** వాయువు అతి శీతలమైన వాటిని, అతి ఉష్ణమైన వాటిని స్పృశిస్తూ సంచరిస్తాడు. శుచిని–అశుచిని ఏలాంటి భేదభావం లేకుండా తాకుతూ పయనిస్తాడు. సుగంధాన్ని దుర్గంధాన్ని సమానదృష్టితో మోసుకవస్తాడు. సందర్భాన్ని బట్టి ప్రభావితుడై తాత్కాలికంగా మైలపడినా, తక్షణమే నిర్మలుడైపోతాడు. అదే విధంగా యోగి కూడా సుఖం–దుఃఖం అనే ద్వందాలతో చిక్కుపడకూడదని నేర్చుకున్నాను.

**నా మూడవ గురువు ఆకాశం:–** అప్పుడప్పుడు మేఘాలు ధూళి, సంధ్యారాగాల చేత ఆకాశం ప్రభావితం అయినట్లు కనిపిస్తూ ఉంటుంది. కాని సహజంగా ఆకాశం దేనికీ అంటనిది, లొంగనిది. అంతేకాక ఆకాశం ఆత్మవలె సర్వవ్యాపి. దానియందు కనిపించే వివిధరూపాల చేత వేరు చేయలేనిది. ఎలాంటిమలినములు అంటకుండా పరిశుద్ధమైనది అని అర్థం అయింది. యోగి కూడా అదేవిధంగా సత్వరజస్తమో గుణాల వల్ల కలిగే వికారాలకు దూరంగా ఉండాలని నేర్చుకున్నాను.

**నా నాల్గవ గురువు అగ్ని:–** అగ్ని దేవుడు ఒకప్పుడు విశేషాగ్నిగా, ఒకప్పుడు మందాగ్నిగా వెలుగుతూ, మరొకప్పుడు నివురుగప్పుకుని సమయం కోసం వేచి చూస్తూఉంటాడు. యజ్ఞం చేసేవారి పూర్వపాపాలను హరించడం కోసం ఎవరినుండైనా సరే హవిస్సును గ్రహిస్తాడు. వారి వారి పాపాలను దహిస్తాడుకాని, తాను మాత్రం అపవిత్రుడు కాదు. అదేవిధంగా యోగికూడా

సుఖశాంతులు కావాలంటే యజ్ఞం చేయాలి.

తన తపశ్శక్తిని గుప్తంగా ఉంచుకుంటూ, ప్రజలను పవిత్రం చేయడానికై అందరినుండీ భిక్షను గ్రహిస్తాడు. అగ్నికి సహజంగా రూపం లేదు. కాని కట్టెను చేరినప్పుడు మాత్రమే మంట, బొగ్గు, మసి రూపాలలో కనిపిస్తుంది. అదేవిధంగా జీవాత్మకు కూడా రూపం లేదని అయినా రకరకాల దేహాలలో ప్రవేశించి ఆయారూపాలుగా కనిపిస్తూ ఉంటుందనీ, అలాగే యోగి అగ్ని తత్వం ద్వారా ఆత్మతత్వాన్ని పొందాలనీ నేర్చుకున్నాను.

**నా అయిదవ గురువు సూర్యుడు:–** సూర్యుడు ఒక్కడే అయినా ఒక్కొక్క జీవికి ఒక్కొక్క ఘటంలోని నీటిలో ఒక్కొక్క ప్రతిబింబంగా కనిపిస్తాడు. అదే విధంగా ఆత్మకూడ ఒక్కటే. శరీరాల భేదం చేత వేరు వేరుగా అనిపిస్తుంది. అంతేకాదు సూర్యుడు గ్రీష్మఋతువులో తన కిరణాల ద్వారా నీటిని స్వీకరిస్తాడు. వర్షఋతువులో విసర్జిస్తాడు. తన కిరణాల కాంతి వల్ల అందరికీ వెలుగునూ, వేడినీ అందిస్తాడు. ఒకే సూర్యుని వలన కమలాలు వికసిస్తాయి. కలువలు ముడుచుకుంటాయి. అదే విధంగా యోగి కూడా తన జ్ఞానాన్ని ఎవరు గ్రహించినా ఎవరు గ్రహించకపోయినా అందరికీ సమానంగా పంచాలని నేర్చుకున్నాను.

**నా ఆరవ గురువు పావురం :–** పరిశీలించాలే గానీ పశుపక్ష్యాదుల్లో కూడ పాఠాలు దొరుకుతాయి. అందమయిన, అనురాగ భరితమైన పావురాల కుటుంబం. బోయవాడు పన్నిన వలలో పిల్లలు చిక్కుకున్నాయి. పిల్లలకోసం తల్లిపావురం, భార్యకోసం తండ్రి పావురం రెండూ వెళ్ళి వలలో దూకాయి. యోగి కూడా మమకార వ్యామోహాలతో వినాశనం కొని తెచ్చుకోకూడదని పావురాల జంటను చూచి నేర్చుకున్నాను.

**నా ఏడవ గురువు కొండ చిలువ :–** కొండచిలువ కదలక మెదలక పడి ఉంటుంది. తనంత తానుగా నోటివద్దకు వచ్చిన ఆహారాన్ని గుటుక్కున మింగి ఊరుకుంటుంది. అది రుచిగా ఉన్నా, లేకపోయినా, చాలినా–చాలకపోయినా దానితోనే సరిపెట్టు కుంటుంది. తృప్తిగా కన్నులు మూసుకుని పడుకుంటుంది. ఏదీ దొరకక పోయినా దైవంపై భారం వేసి నిశ్చింతగా ఉండిపోతుంది. అదేవిధంగా యోగి కూడ శారీరిక వ్యాపారాలన్నింటికి దూరంగా ఉండాలని నేర్చుకున్నాను.

**నా ఎనిమిదవ గురువు సముద్రం :–** వర్ష ఋతువులో నదులన్నీ పొంగివచ్చి సముద్రంలో చేరిపోతాయి. వేసవిలో నదులు ఎండిపోతాయి. సంపద పెరిగినప్పుడు పొంగిపోవడం, తరిగినప్పుడు కృంగిపోవడం సముద్రుడు చెయ్యడు. అన్ని వేళలా పరిపూర్ణుడై సుఖ దుఃఖాలకు లొంగక చెలియలి కట్టను దాటక గంభీరంగా ఉంటాడు. తనలోని ముత్యాలను బయటకు రానీయడు. బయట ఉన్న చెత్త చెదారాన్ని తనలోనికి చేరనివ్వడు. అదే విధంగా యోగి కూడ తన యోగరహస్యాన్ని బయట పెట్టకుండా గంభీరంగా జీవించాలని నేర్చుకున్నాను.

**నా తొమ్మిదవ గురువు మిడత :–** మిడత అగ్ని చేత ఆకర్షింపబడి, దానిలోకిదూకి ప్రాణాలు కోల్పోతుంది. అదే విధంగా యోగి కూడ సుఖసౌఖ్యాలకు, రూపలావణ్యాలకు ఆకర్షింపబడి నశించ కూడదనీ జ్ఞానమనే అగ్నిలో తన అజ్ఞానాన్ని ఆహుతి చేసుకోవాలనీ నేర్చుకున్నాను.

**నా పదవ గురువు ఏనుగు :–** వేటగాండ్రు అడవిలో ఆడ ఏనుగు బొమ్మను నిలబెడతారు. దానిని చూచి మగ ఏనుగు భ్రమించి, స్పర్శ సుఖం కోసం దాని దగ్గరకు వెళ్ళుతుంది. వేటగాండ్రచేత బంధింపబడుతుంది. ఆడ ఏనుగుతో విహరిస్తున్న మగ ఏనుగును మరొక మగ ఏనుగు పోరాడి చంపుతుంది. అదే విధంగా యోగి కూడా స్పర్శ సుఖంకోసం సంసార బంధంలో చిక్కుకో కూడదని నేర్చుకున్నాను.

**నా 11వ గురువు చీమ :–** చీమ ఎన్ని అవాంతరాలు వచ్చినా నిరాశపడక పట్టుదలతో ఆహారాన్ని కూడబెట్టుకుంటుంది. దాన ధర్మాలు చేయకుండా కూడ బెట్టిన ఆ ఆహారాన్ని అప్పుడప్పుడు ఇతర ప్రాణులు తినివేస్తూ ఉంటాయి. యోగి కూడా కూడ బెట్టడం కోసం ధనార్జన చేయరాదనీ, జ్ఞానార్జనలో ఎన్ని అవాంతరాలు వచ్చినా నిరంతర కృషితో సాధించాలనీ నేర్చుకున్నాను.

**నా 12వ గురువు చేప :–** చేప జిహ్వా చాపల్యం చేత ఎరకాశించి గాలానికి గుచ్చుకుని మరణిస్తుంది. యోగి కూడా "జితం సర్వం జితే రసే" అన్న ధర్మ సూక్ష్మాన్ని తెలుసుకుని, రుచుల పట్ల అనాసక్తుడై, ప్రాణాలను నిలుపుకోవడానికి మాత్రమే ఆహారం సేవించాలని నేర్చుకున్నాను.

**నా 13వ గురువు 'పింగళ' అనే వేశ్య :–** ఒకనాటి రాత్రి పింగళ ధనాశతో విటుని కోసం ఎదురుచూచి చూచి విసిగి పోయింది. ఆ విసుగులో ఆమెకు హఠాత్తుగా ఆత్మజ్ఞానం కలిగింది. ఆనాటినుండి ధన సంపాదన కోసం చేసున్న తుచ్ఛమైన వృత్తిని మానివేసింది. శరీరాన్నీ, జీవాత్మనూ పరమేశ్వరునకే అంకితం చేసింది. అదే విధంగా యోగి కూడ ధనం కోసం, కీర్తికోసం సిద్ధులను ఆశించకుండా ఆత్మానందాన్ని సాధించాలని నేర్చుకున్నాను.

**పాపవిముక్తి కావాలంటే యజ్ఞం చేయాలి.**

**నా 14వ గురువు శరకారుడు :–** బాణాలను తయారుచేస్తున్న వ్యక్తి తనపనిలో పూర్తిగా నిమగ్నుడై ఉన్నాడు. ప్రక్కనుండి పోతున్న పెద్ద ఊరేగింపును కూడా గమనించలేదు. అదే విధంగా యోగి కూడా తన సాధనలో ఆత్మ నిష్ఠుడు కావాలని నేర్చుకున్నాను.

**నా 15వ గురువు చిన్నారి బాలుడు :–** ఆ బాలుడు శరీరం మీద ఏలాటి వస్త్రాలు లేకున్నా నిశ్చింతగా ఆడుకుంటూ ఆనందిస్తున్నాడు. అదే విధంగా యోగి కూడా మానావమానాలను లెక్క చేయకుండా ఆత్మనిష్ఠలో నిమగ్నుడై ఉండాలని నేర్చుకున్నాను.

**నా 16వ గురువు చంద్రుడు :–** కాల ప్రభావం చేత చంద్రుని కళలు వృద్ధి క్షయాలు పొందినట్లు కనిపిస్తూ ఉంటాయి. కాని నిజానికి చంద్రగోళంలో ఎలాంటి మార్పులురావు. అదే విధంగా యోగి కూడ మార్పులన్నీ శరీరానికే అనీ, ఆత్మకు కాదనీ, చంద్రుడు ప్రతి ఫలాపేక్ష లేకుండా చల్లదనాన్ని పంచినట్లు తన జ్ఞానాన్ని ప్రజలకు పంచాలనీ నేర్చుకున్నాను.

**నా 17వ గురువు తేనెటీగ :–** రాత్రంతా ముడుచుకున్న కమలంలో బంధింపబడుతుంది. పూవులు నలగకుండా తేనెను మాత్రమే గ్రహిస్తుంది. గ్రహించిన తేనెను కూడబెడుతుంది. చివరకాతేనె పరుల పాలవుతుంది. అదే విధంగా యోగి కూడ ఆకర్షణలకు లోనై గృహ బంధాలలో చిక్కుకోరాదనీ, సకల శాస్త్రాలలోని సారంమాత్రమే గ్రహించాలనీ, కూడ బెట్టడం అనేది పనికి రాదనీ, చేతులే భిక్షా పాత్రగా – కడుపే కంచంగా జీవించాలనీ నేర్చుకున్నాను.

**నా 18వ గురువు లేడి :–** వేటగాడి సంగీతానికి పరవశించి లేడి ప్రాణాలను పోగొట్టుకుంటుంది. అందువల్ల యోగి లౌకిక విషయాలకు దూరంగా జీవించాలని నేర్చుకున్నాను.

**నా 19వ గురువు గ్రద్ద :–** ఒక గ్రద్ద చచ్చిపోయిన ఎలుకను తీసుకుని పోతూఉంది. ఆ ఎలుక కోసం కొన్ని కాకులు, గ్రద్దలు గ్రద్దపై దాడి చేశాయి. పాపం ఆ గ్రద్ద వాటితో గెలవలేకపోయింది. ఎలుకను జారవిడిచి తన దారిన తాను పోయింది. అందువల్ల యోగి కూడా లౌకిక సుఖాలకోసం ప్రాకులాడి దుఃఖాన్ని కొని తెచ్చుకోకూడదని నేర్చుకున్నాను.

**నా 20వ గురువు కన్య :–** ఒక కన్యను చూచుకోవడానికి మగ పెండ్లివారు వచ్చారు. ఆ సమయంలో తల్లి ఇంట్లోలేదు . వారికి భోజనం పెట్టడానికి ఆ కన్య ధాన్యందంచుతోంది. చేతి గాజులు శబ్దం చేస్తే వారు వింటారని కన్య ఒక్కొక్క గాజు ఉంచుకుని మిగతావి తీసి దంచింది. అదే విధంగా యోగి కూడ ఏకాంతంగా సాధన చేయాలని నేర్చుకున్నాను.

**నా 21వ గురువు సర్పం :–** పాము స్వయంగా పుట్టను పెట్టుకోదు. చెదలు శ్రమపడి నిర్మించుకున్న పుట్టను విడిచిపెట్టి వెళ్ళిపోతాయి. చెదలు ఖాళీ చేసిన పుట్టలో పాము నివాసం ఏర్పరచుకుంటుంది. పాము తన జీవకృత్యాలను ఇతర జీవులకు తెలియనివ్వదు. అదే విధంగా యోగి కూడ వ్యర్థంగా పడి ఉన్న శిథిలమైన ఆలయాలలోనూ, ఇతరులు నిర్మించిన మఠాలలోనూ, చెట్లనీడలలోనూ నివసించాలనీ, తన అభ్యాస రహస్యాలను గుప్తంగా ఉంచాలనీ పాము కుబుసాన్ని విడిచినట్లు శరీరాన్ని స్వచ్ఛంగా వదిలివేయాలనీ నేర్చుకున్నాను.

**నా 22వ గురువు సాలెపురుగు :–** సాలె పురుగు తాను వెడల గ్రక్కిన పదార్థంతో గూడు అల్లుతుంది. కొంతకాలానికి దానిని మ్రింగివేస్తుంది. అదే విధంగా యోగి కూడ తన హృదయంలోని సంస్కారాలతో ఉపాధిని పెంచుకుని మరలా అవసానదశలో తిరిగి దానిని అంతర్గతం చేసుకోవాలని నేర్చుకున్నాను.

**నా 23వ గురువు భ్రమర కీటము:–** తుమ్మెద కీటకాన్ని తెచ్చి గూటిలో పెడుతుంది. ఝుంకారం చేస్తూ దాని చుట్టూ తిరుగుతుంది. ఆ ధ్వనిని విని విని కీటకం తానే తుమ్మెదగా మారిపోతుంది. ఝుంకారం చేస్తూ ఎగిరిపోతుంది. అదే విధంగా యోగి కూడా తన గురువుని గురించి ధ్యానించి ధ్యానించి గురువుగా మారిపోవాలని నేర్చుకున్నాను.

**నా 24వ గురువు నీరు :–** నీరు సకల ప్రాణులకూ దాహం తీరుస్తుంది. చల్లదనాన్ని ప్రసాదిస్తుంది. జడ చేతనాలన్నింటికీ నూతన జీవం పోస్తుంది అయినా వినమ్రంగా పల్లంవైపే ప్రవహిస్తుంది. అదే విధంగా యోగికూడా తనను ఆశ్రయించిన వారిని రక్షిస్తూ వినయంగా ఒదిగి ఉండాలని నేర్చుకున్నాను.

అందువల్లనే నేను నిర్జనారణ్యంలో ఉంటూకూడ అజేయమైన ఆనందాన్ని అనుభవించగలుగుతున్నాను. ఎలాంటి కోరికలు, ఆకర్షణలు నన్ను దరిచేరవు. దాని ఫలితంగానే ఈ నిర్వికార, నిరామయ ఆనందాన్ని పొందగలుగుచున్నాను. ఆయనే దత్త ప్రభువు.

*(శ్రీ ఎక్కిరాల భరద్వాజ రచించిన*

*శ్రీ గురుచరిత్ర ఆధారంగా)*

★★★

**యజ్ఞం వల్ల పుత్రార్థికి పుత్రుడు కలుగుతాడు.**

చతుర్ముఖీ సాధన : గురుదేవుల అమృతవాణి-1

# నిస్వార్థంగా దేవునికి సహకరిద్దాం

మిత్రులారా! మనం భగవంతుని మీద ఆశలుపెట్టుకున్నట్లే, భగవంతుడు మన మీద ఆశలు పెట్టుకున్నాడు. కన్న బిడ్డలపై ఆశలుపెంచుకున్న తల్లిదండ్రులు అవి నెరవేరకపోతే నిరాశకు లోనవుతారు. అదే విధంగా మనలను ఇంత వారినిగా చేసిన భగవంతుడు మనవలన ఏలాంటి ప్రయోజనం లభించకపోతే అమితంగా బాధపడతాడు.

ప్రపంచాన్ని అందంగా తీర్చిదిద్దడానికి మన సహకారం కోరుకుంటాడు. అది అందకపోతే అందలేదని బాధపడతాడు. అన్ని ప్రాణులకన్నా మానవులకే ఎక్కువగా సౌకర్యాలు కల్పించాడు. గాడిదకు పెద్ద కడుపు, కడుపులో ఆకలీ ఇచ్చాడు. కాని తీసుకు తినడానికి చేతులు ఇవ్వలేదు. అందువల్ల గడ్డిని కొరికి తింటుంది. మానవునికి ఆరంగుళాల పొట్ట, బారెడేసి చేతులు ఇచ్చాడు. కాళ్ళు, చేతులూ చక్కగా మడవగలడు. ఆ పని ఏ జంతువుకూ సాధ్యం కాదు. అంతే కాదు. మానవుడికి చేతులతో పాటు తెలివితేటలూ ఇచ్చాడు. జ్ఞానం ఇచ్చాడు. ఒక్క గంటపని చేస్తే కడుపు నిండుతుంది. మిగిలిన సమయమంతా భగవంతునికి సహకరించవచ్చు.

ఉదా:- ఒక రాజు, ఇద్దరు తోటమాలులు కథ

మిత్రులారా ! మీరు భగవంతునికి చేయూతనిస్తే ఆయన తృప్తి పడతాడు. ఈ సందర్భంగా నాకు ఒక కథ గుర్తుకు వస్తోంది. శ్రద్ధగా వినండి. ఒక రాజు ఇద్దరు తోటమాలులను ఉద్యోగంలోనికి తీసుకున్నాడు. చెరొక్క తోట ఇచ్చాడు. జాగ్రత్తగా చూచుకోమన్నాడు. ఇద్దరికీ మంచి జీతం ఏర్పాటు చేశాడు. ఒక తోటమాలి తన తోటను అందంగా తీర్చిదిద్దాడు. రెండవ తోటమాలి తోటమధ్య రాజు గారి పటం పెట్టాడు. రోజూ దాని ముందర నిలబడి రాజుగారిని కీర్తించడం, భజన చేయడం మొదలు పెట్టాడు. తనకు ఉద్యోగం ఇచ్చినందుకు భక్తిగా ప్రతిరోజూ కృతజ్ఞతలు తెలియచేసేవాడు. అంతేగాని తోటను గురించి పట్టించుకోలేదు. తోట ఎండిపోయింది. రాజుగారు తోటమాలులను పిలిపించాడు. తోటలు చూద్దాం పదమన్నాడు. మొదటితోట చాలా అందంగా తయారైంది. మాలిని మెచ్చుకుని బహుమానం ఇచ్చాడు. ఉద్యోగం జాగ్రత్తగా చేసుకోమన్నాడు.

అందరు కలసి రెండవ తోటకు వెళ్ళారు. తోటంతా సర్వనాశనం అయింది. ఏనాడూ కాసిని నీరుపోసిన వారులేక నిలువునా ఎండి పోయింది. తోట మధ్యలో రాజుగారి పటం, పూజా సామాగ్రి కనిపించాయి. ఏమిటి ఇదంతా? అని గద్దించాడు. మాలి గజగజ వణుకుతూ ప్రభూ ! నేను మీకు పరమభక్తుడిని. ఏ ఉద్యోగం లేకుండా గాలికి తిరుగుతున్న నన్ను పిలిచి ఉద్యోగం ఇచ్చారు. మీ పుణ్యమా అని అందరం కడుపునిండా అన్నం తింటున్నాం. అందుకని కృతజ్ఞతగా రోజూ మీ పటానికి పూజలు చేస్తున్నాను. ఈ పూజల పనిలో పడి తోటను పెంచడంలో అశ్రద్ధ చేశాను. క్షమించండి" అని కాళ్ళ మీద పడ్డాడు. రాజుగారు క్షమించలేకపోయారు. వెంటనే ఆతనిని ఉద్యోగంలో నుండి తీసి వేశారు. తోటను నాశనం చేసినందుకు తిట్టిపోశారు. నాకు కనిపించకుండా దూరంగా వెళ్లి పొమ్మని పంపించివేశారు. నాయనలారా ! మీరు చేస్తున్న పని రెండవ మాలి చేస్తున్నట్లుగానే ఉంది. పీఠం పైన బొమ్మల్ని పెట్టడం, వాటికి పూజ చేయడం, గంటకొట్టడం, హారతులు ఇవ్వడం, హరహరమహాదేవ - ఓం చాముండాయై నమః' అంటూ రకరకాలుగా అరవడం చేస్తున్నారు. దానితో బాధ్యత తీరిపోయిందని తృప్తి పడుతున్నారు. మహా భక్తులం అనుకుని గర్వపడుతున్నారు. కొందరు మాలలు తిప్పుతున్నారు. కొందరు హారతులు ఇస్తున్నారు. కాని భగవంతుడు మనల్ని కోరుకున్నది ఈ భజనలుకాదు. ఈ పూజలుకాదు. కేవలం భజనలు చేస్తూ కూర్చుంటే కర్తవ్యం, బాధ్యత దెబ్బతింటాయి. రాజు గారి లాగానే భగవంతుడు కూడ మిమ్మల్ని తన లెక్కలో నుండి తీసివేస్తాడు. చివరకు ఏదిక్కూ లేనివారు అయిపోతారు. **సమాజాన్ని, దేశాన్ని ప్రపంచాన్ని కాపాడే పనులు చేయండి. సమాజంలో మీ బాధ్యతను నిర్వహించండి. తోటివారికి సహకరించండి. అప్పుడే భగవంతుడు మీపై పెట్టుకున్న ఆశలు తీరుతాయి. అప్పుడే గవంతునికి ప్రేమ పాత్రులు అవుతారు.**

**యజ్ఞం వల్ల ధనార్థికి ధనం లభిస్తుంది.**

## భజనలోని మర్మాన్ని తెలుసుకుందాం

మిత్రులారా ! మీ కిప్పుడు భజన అంటే ఏమిటో తెలిసింది అనుకుంటా. భగవంతుడు ఎప్పుడూ తన నామ జపం కోసం, నైవేద్యాలకోసం ఎదురు చూడడు. అలా ఎదురుచూస్తే అది భగవంతునికీ, భక్తునికీ ఇద్దరికీ అవమానమే. కనుక జాగ్రత్తగా వినండి. మీరు చేయాల్సిన పనులు రెండున్నాయి. 1) 84 లక్షల జీవరాసులలో పుడుతూ, గిడుతూ ఇప్పటికి గొప్ప వరంగా మానవ జన్మ ఎత్తారు. సంతోషంగా మీ సంస్కారాలను ప్రక్షాళనచేసుకోండి. మీ ఆలోచనలను సంస్కరించుకోండి. ఉన్నత మార్గం వైపు నడవండి. మీ ఆత్మను దేవాత్మగా చేసుకోండి. దేవాత్మనుండి పరమాత్మగా ఎదగండి. ఋషులుగా మారండి. చరిత్ర పురుషులుగా తయారవండి. **భగవంతుని లక్ష్యం, మీ లక్ష్యం రెండూ ఒక్కటే అవ్వాలి.**

భగవంతునికి మీరు చేయవలసిన రెండవ పనికూడా వినండి. ఆయన అందమైన తోట వేశాడు. సర్వశక్తులూ వినియోగించి ఈ తోటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాడు. దీన్ని ఇంకా ఇంకా సుందరంగా, అందరికీ ఉపయోగకరంగా మార్చాలి. అనుకుంటున్నాడు. ఆపనిలో ఆయనకు సహాయకులు కావాలి. మన నుండి సహాయాన్ని కోరుకుంటున్నాడు. మీరంతా సహాయకులుకండి. మీకు ఆయన సహాయం చేస్తాడు.

మిత్రులారా! 13 సంవత్సరాల వయస్సు నుండి మా గురుదేవులు నాకు సహాయం చేస్తున్నారని మీకందరికీ తెలుసు. అన్ని విషయాలలో నాకు అండగా ఉన్నారు. గుడ్డివాడు, కుంటివాడు పరస్పరం సహాయం చేసుకున్నట్లు మనందరం పరస్పరం సహాయం చేసుకుందాం. అందరం అన్ని పనులు చేయలేం. ఎవరి చేతనైనవి వారు చేస్తూ పోతే అన్ని పనులు నెరవేరుతాయి. కానీ ఏ పని చేసినా స్వార్థ భావన రాకూడదు. అది వచ్చిందీ అంటే అన్ని పనులు సర్వనాశనం అవుతాయి. అందువల్ల ఏ పని చేసినా పరస్పర సహకారం అన్న ఎగ్రిమెంట్ ఉండాలి.

## భగవంతునికీ, భక్తునికీ మధ్య ఒక ఎగ్రిమెంట్ ఉంటుంది.

మిత్రులారా ! భగవంతునికీ, భక్తునికీ మధ్య ఒక ఎగ్రిమెంట్ ఉంటుంది. ముందు మనం దానిని తెలుసుకోవాలి. భగవంతుడు మన సహాయం కోరుతాడు. కాని మనం తప్పనిసరిగా ఒక షరతుపెడతాం. షరతు లేకుండా మనం ఏ పనీ చేయం. భగవంతునికి సహాయం చెయ్యడం అంటే మామూలు విషయం కాదు. ఆయన ఒక వ్యక్తి కాదు. మనం పెట్టిన నైవేద్యాలు తినడు, మనం పోసిన పానకం త్రాగడు. మనం ఇచ్చిన బట్టలు కట్టుకోడు. ప్రత్యేకంగా ఒక చోట ఉండడు. అంతటా వ్యాపించి ఉంటాడు. గంధం, అక్షింతలు, పూలు ఎక్కడని విసురుతాం? భగవంతుడు ఒక మనిషి కాడు. ఆ విషయం మనం ఎప్పటికీ గుర్తుంచుకోవాలి

భగవంతుడు వ్యక్తికాడు. ఒక శక్తి. ఆ శక్తిని వ్యక్తి రూపంలో మన అవసరాల కోసం మనమే కల్పించుకున్నాం. ఒక కప్ప భగవంతుని తయారు చేసుకోవాలనుకుంటే ఒక కప్ప బొమ్మనే చేసుకుని ఆరాధిస్తుంది. అదే విధంగా ఎవరైనా సరే తమ రూపంలోనే భగవంతుణ్ణి తయారు చేసుకుంటారు. దోమల దేవుడు దోమలాగానే ఉంటాడు. చీమల దేవుడు చీమలాగానే ఉంటాడు. ఎందువల్ల ? ఇది కల్పించుకున్న రూపం కనుక. రూపం లేని దేవునికి పూజలు చేయడం కష్టం. కాని మన పనులు నెరవేరాలంటే మనం స్తోత్రం చేయక తప్పదు. స్తోత్రం చెయ్యాలన్నా ఒక రూపంకావాలి.

ఒంటె, గాడిద స్నేహితులు. ఒంటె పెళ్ళికి గాడిద వెళ్ళింది. ఒంటె అందాన్ని వర్ణిస్తూ గాడిద పాటలు పాడింది. ఒంటె కూడ గాడిద పెళ్ళికి వెళ్ళింది. గాడిద కంఠ స్వరాన్ని పొగడుతూ ఒంటె కవిత్వం చెప్పింది. దీని భావం ఏమిటి? పరస్పరం స్తోత్రం చేసుకోకపోతే రెండింటి మధ్య స్నేహం నిలవదు. కలిసి ఉన్నన్నాళ్ళు ఆనందంగా గడపలేరు.

భక్తి అనేది ఎప్పుడు పూజ వరకు, స్తోత్రం వరకు పరిమితం కాదు. తనను సంస్కరించుకోవడమే భక్తికి పరాకాష్ఠ. మనలోని కల్మషాలను ముందుగా తొలగించుకోవాలి. మన అంతరాత్మ పరిశుభ్రంగా ఉంటేనే పరమాత్మ ఆశయాలను తీర్చగలుగుతాం. కల్పించుకున్న రూపానికే భక్తితో సేవలు చేద్దాం. ఆయన ఆశయాలను అనుకరిద్దాం. నిస్వార్థంగా దేవునికి సహకరిద్దాం. అందరికీ ఆనందాన్ని అందిద్దాం.

*(27-9-1979 న శాంతికుంజ్‌లో ఇచ్చిన ప్రవచనంలో కొంత భాగం)*

**యజ్ఞం వల్ల విద్యార్థికి విద్య లభిస్తుంది.**

మహిళా జాగరణ

# మాతృ సత్తాత్మక సమాజం తిరిగిరావచ్చు

మాతృత్వం అనేది సృష్టి యొక్క ఆర్ద్రత గురించి తెలుపుతుంది. అందులో కేవలం కోమలత్వం మాత్రమే కాదు. బలిదానం ఇవ్వగలిగే దృఢత్వం కూడా ఉంది. భారతీయ దేవసంస్కృతిలో మాత సదా పూజనీయురాలు, వందనీయురాలు. సమాజంలో ఆమె ప్రతిష్ఠాత్మకమైన, గౌరవనీయమైన దృష్టితోనే చూడబడుతుంది. సంతానోత్పత్తి అనేది ఆమెకున్న గొప్ప విశేషత. ప్రకృతిలో ఆమె అన్నింటికంటే విలక్షణమైన, అద్భుతమైన కృతి, వేదవ్యాసులవారు మహాభారతంలోని శాంతిపర్వంలో తల్లి యొక్క గొప్పతనాన్ని ఇలా వర్ణించారు.

నాస్తి మాతృసమా ఛాయా, నాస్తి మాతృసమా గతిః ।
నాస్తి మాతృసమం త్రాణం, నాస్తి మాతృ సమా ప్రియా ॥

అనగా 'అమ్మతో సమానమైన నీడ లేదు. అమ్మకు మించిన తోడు లేదు. అమ్మవంటి రక్షకురాలు లేదు. అమ్మకంటే ప్రియమైనదేదీ లేదు'.

స్వామి వివేకానంద యొక్క అత్యంత ప్రియశిష్యురాలు సోదరి నివేదిత అక్టోబర్ 22, 1900 సంవత్సరంలో లండన్‌లో ఇచ్చిన ఉపన్యాసంలో తల్లిని గురించి చెప్తూ 'తల్లి అనే శబ్దం అపారమైన నదివంటిది. ఆ తీరంలో ఎన్నో ఆత్మలకు ఆశ్రయం లభిస్తుంది' అని అన్నది.

భారతస్వతంత్ర సంగ్రామ విప్లవంలో పాల్గొన్న సుభాష్ చంద్రబోస్ ఇలా చెప్పారు - 'మనిషి తన జీవితంలో తర్కం, విచారం, వివేచన లేకుండా కేవలం శ్రద్ధమాత్రమే ఉండే స్థానాన్ని కోరుకుంటాడు. బహుశా అందుకే తల్లి సృష్టించబడింది'. స్వామి రామతీర్థ తల్లి శ్రేష్ఠతను అంగీకరిస్తూ "ఆమెయే ప్రపంచాన్ని ఉద్ధరించగలదు." అని అన్నారు. తల్లులే దేశాన్ని ఉద్ధరించగలరు, క్రిందపడవేయగలరు. ప్రకృతి అనే పొలంలో హెచ్చుతగ్గులను తల్లియే సమతలం చేయగలదు. మహామానవులందరూ శ్రేష్ఠులైన తల్లుల సంతానమే. మేక్సిమ్‌గోర్కోను అనుసరించి భవిష్యత్తును గురించి తల్లియే సరిగా ఆలోచించగలదు. తల్లి సంతానం యొక్క భవిష్యత్తుకు కూడా జన్మనిస్తుంది.

తల్లి అనే శబ్దంలోనే అమృతత్వం కనిపిస్తుంది. యశ్వంత్‌దినకర్ ఫెడర్‌కర్ తల్లిని స్తుతిస్తూ ఇలా వర్ణించారు. 'తల్లీ ! నీలో కామధేనువు వంటి సామర్థ్యముంది. నీవు మంగళకారిణివి. తపస్వులకు అద్వైతానికి. నీలో సాగరమంత గాంభీర్యముంది. పృథ్వి అంత సహనం ఉంది. నీ కన్నులలో పున్నమినాటి చంద్రుని తేజస్సు ఉంది. హృదయంలో మేఘమాలికలంత వాత్సల్యముంది. తల్లీ ! నీలోనే ఈ సమస్త గుణాలన్నీ ఉన్నాయి'. గొప్ప నవలా రచయిత ప్రేమ్‌చంద్ 'గోదానం' అనే తన నవలలో తల్లిని గురించి తన అభిప్రాయం వ్యక్తపరిచారు. 'స్త్రీ కేవలం తల్లియే. మిగిలినవన్నీ ఆ మాతృత్వపు అనుకరణలే' మాతృత్వం ప్రపంచంలో అన్నింటికంటే పెద్ద సాధన. అన్నింటికంటే పెద్ద తపస్సు, పెద్ద త్యాగం, అన్నింటికంటే గొప్ప విజయం'. ప్రేమ్‌చంద్ ఇంకా చెప్తూ " ఒక్క మాటలో చెప్పాలంటే మూర్తీభవించిన వ్యక్తిత్వం స్త్రీ అని అన్నారు. రామ్‌కుమార్‌వర్మ ప్రకారం తల్లి హృదయాన్ని మించిన శాస్త్రం ఏదీ లేదు. జనని యొక్క శక్తి ప్రపంచంలో అన్నింటికంటే గొప్పది. డా॥ లక్ష్మీ నారాయణ మిశ్రా తల్లి శబ్దంలో నిహితమైన భావాన్ని ఇలా వర్ణించారు. స్త్రీ శక్తితోనే పురుషునికి విజయం ప్రాప్తిస్తుంది. ఎక్కడ తల్లి ప్రేరణ లభిస్తుందో అక్కడ అసాధ్యం, అసంభవం అనేవే ఉండవు.

తల్లికున్న ఇన్ని విభూతులు, విశేషతల కారణంగానే మానవసమాజం తల్లి ఒడినుండే ప్రారంభమై, వృద్ధిచెందినాయి. యుగాలు గడిచిన తరువాత మధ్యలో కృషియుగం ప్రారంభమైంది. ఈ యుగంలో పని విభజన జరిగింది. వ్యవసాయం కారణంగా ఆమెకు ధాన్యం కొట్టు, దాని రక్షణ, పశుపోషణ వంటి బాధ్యతలు అప్పగించబడ్డాయి. ఇంటి బయట వ్యవసాయానికి సంబంధించిన పనులన్నీ పురుషులే సమర్థించుకున్నారు. కాలం యొక్క ఘాత-ప్రతిఘాతాలకు మధ్య సభ్యత యొక్క ఉత్థాన-పతనాలు, వ్యవసాయం ఆరంభంఅయ్యాయి. సభ్యతలపరివర్తన అనే తీరం చేరింది. దీనితోపాటే సమాజంలో పురుషుల ఆధిపత్యం పెరిగి మాతృసత్తా నెమ్మదిగా బలహీనపడింది. పరిణామంగా సమాజం పితృస్వామ్య సమాజంగా మారింది.

**యజ్ఞం వల్ల దుఃఖార్తునకు ఆనందం లభిస్తుంది.**

వర్తమాన సమాజంలో పురుషునికి అనంతమైన అధికారాలున్నాయి. అయినప్పటికీ ఈ పృథ్వీమీద మాతృభూమి వంటి ప్రముఖ శబ్దాల స్వరాలు నొక్కి వేయబడలేదు. భారతభూమిలో మాతృసత్తాత్మక సమాజం యొక్క ఉనికి ఇంకా జీవించేఉంది. ఈ విశ్వంలో ఇంకా పలు దేశాలలోకూడా దీని తాలుకు ఆధారాలు కనిపిస్తూనే ఉన్నాయి ఇవి ముఖ్యంగా సభ్యత గల కుటుంబాలలో, మేఘాలయాకు చెందిన ఖాసీ, గారో జనజాతులలో మరియు మంగుళూరుకు చెందిన ఆదివాసులలో కనపడుతుంది.

మాతృసత్తాత్మక కుటుంబానికి సర్వోత్తమమైన ఉదాహరణ – ఖాసీ జనజాతి. వీరిని పరిచయం చెయ్యాలంటే ఉన్న మూలతత్త్వం ఒక్కటే. అది స్త్రీ సన్మానం మరియు స్త్రీకి ప్రత్యేక స్థానం. ఇక్కడ ఒక కుటుంబం అంటే తల్లి యొక్క ఆడ సంతానమే ఆ కుటుంబసభ్యులుగా చెప్పబడతారు. సంపదమీద మహిళలకే ఏకాధికారం. ఆస్తిమీద నియంత్రణ, నిలబెట్టుట, పంపకాలు అన్నీ మహిళలే చేస్తారు. వీరి సంప్రదాయం ప్రకారం ఆడపిల్ల ఇష్టపడిన తరువాతే వివాహం జరుగుతుంది. వివాహం తరువాత వధువు వరుని ఇంటికి వెళ్ళదు. వరుడే వధువు ఇంటికి వచ్చి ఉంటాడు. వీరిలోని కొన్ని జాతులలో భర్త ప్రతిదినం పగలు తన ఇంటి పని ముగించుకొని రాత్రికి అత్తగారింట్లో నివసిస్తాడు. చాలా సంవత్సరాలు ఇలా మామూలుగా గడిచిన తరువాత వారు వేరే ఇల్లు ఏర్పాటు చేసుకునేందుకు అధికారం వస్తుంది.

ఈ జాతులలో పురుషులందరూ అల్లుళ్ళుగా ఇంటినుండి విడిపోతారు. కుటుంబంలో అందరికంటే చిన్న కూతురు కుటుంబానికి సంబంధించిన ధార్మిక అనుష్ఠానాలు పూర్తిచేస్తుంది. తల్లి యొక్క అంతిమ సంస్కారం ఆమే చేస్తుంది. పి.ఆర్‌టీ. గర్బన్ ప్రకారం చిన్న కూతురికి ఆస్తిలోని పెద్దభాగం, వారసత్వ నగలు సంక్రమిస్తాయి. ఆమే సంపూర్ణసంపదను రక్షిస్తుంది. అయినప్పటికీ ఆమె వాటిని తన అక్కల అనుమతి లేకుండా అమ్మలేదు. ఆ తరువాత అది ఆమె చిన్న కూతురుకి లభిస్తుంది. చిన్నచెల్లెలు చనిపోతే ఆ సంపద రెండవ చిన్న చెల్లెలుకు సంక్రమిస్తుంది. ఆమెకు ఆడపిల్లలు లేకపోతే అప్పుడు పెద్దమ్మాయికి అధికారం సంక్రమిస్తుంది. ఇలాంటి విపరీత పరిస్థితులలోనే మొత్తం భాగం పెద్దక్కకు చెందుతుంది.

పెద్ద కూతురుకి ఎందుకు ఆస్తి అప్పగించరంటే ఆమె వివాహం త్వరగా అవుతుంది. దానితో మాతృసత్తాత్మక వ్యవస్థలో క్రమంగా క్షీణత వస్తుంది. అక్కడ సంపద పంచబడదు, ఎవరికీ ఏకాధికారమూ ఉండదు. మహిళలే దీనిని నిర్వహిస్తారు. ఈ జాతి మహిళలలో మంచి వ్యవస్థీకృతబుద్ధి ఉంటుంది. వీరు పురుషులను గౌరవిస్తారు. సమాజం మరియు కుటుంబాలలో మహిళలు అధికారం కలిగిఉన్నప్పటికీ పురుషులకు కూడా వారికి తగిన బాధ్యతలు అప్పగించబడతాయి. ఈ మహిళలకు భర్త సహకారం పూర్తిగా ఉంటుంది.

గారో జనజాతులలో కూడా మాతృత్వం ఆధారంగానే వంశపరంపర నడుస్తుంది. వీరిలో సంపదపైన మహిళలు పూర్తి వారసత్వం కలిగిఉంటారు. మహిళలకే సంపదను అప్పగించడం జరుగుతుంది. పురుషులు కేవలం సంరక్షకులే. మహిళలే తమ పిల్లల్లో ఒక కూతురిని వారసురాలిగా ఎంచుకుంటారు. సామాన్యంగా పెద్ద కూతురికి తప్ప మిగిలినవారికే ఈ బాధ్యత ఇవ్వబడుతుంది. ఆడపిల్లలు లేకపోతే వేరొక చెల్లెలిని లేదా చెల్లెలు బంధువుల కూతురిని దత్తత తీసుకుంటారు. మగపిల్లలను దత్తత తీసుకునే ఆచారం లేదు. భర్త మర్యాదల ననుసరించి తన భార్య సంపదను ఉపయోగిస్తాడు. భర్తకు భార్య విషయంలో చాలా పరిమితమైన అధికారాలుంటాయి. అదే భార్యకు – భర్త విషయంలో అపరిమితమైన అధికారాలుంటాయి. ఇటువంటి పరిస్థితులలో కూడా అక్కడి కుటుంబవ్యవస్థ దృఢంగానే ఉంది. ఇంకా సామాజిక సౌహార్ద్రత అనే భావన కూడా ఎక్కువగానే కనిపిస్తుంది.

మంగుళూరుకు చెందిన మాతృసత్తాత్మక సమాజం ఇప్పటికీ సుఖంగా, సమృద్ధంగా చెప్పబడుతోంది. వీరి ప్రాచీన కథల ననుసరించి అనాల్‌పాండే అనే రాజుకి సోదరీమణుల వల్ల అంతులేని సహకారం లభించింది. అందుచేత రాజు సమాజాన్ని, పరివారంలోని సదస్యులందరి బాధ్యతను తన అక్కచెల్లెంద్రకే అప్పగించాడు. వీరికి వివాహం అయిన తరువాత భర్త అత్తగారింట్లో నివసిస్తాడు. సమాజంలో పిల్లలను వారి తల్లుల ననుసరించే గుర్తిస్తారు. అంతేకాక వంశపరంపర తల్లి పేరుమీదే నడుస్తుంది.

కేరళకు చెందిన నాయర్ల కుటుంబంలో కూడా దాదాపు ఇటువంటి పద్ధతే ఉంది. నాయర్ల కుటుంబం 'తార్‌పాడ్' అనే పేరుతో పిలువబడుతుంది. వీరిలో కూతురి కొడుకు – కూతురే

**యజ్ఞం వల్ల ఆరోగ్యం లభిస్తుంది.**

ఉంటారు. కొడుకుల సంతానం వీరితో కలవరు. సంపద విభజింపబడదు. వీరిలో స్త్రీ-పురుషులకు సమాన అధికారాలుంటాయి. సంపదను స్త్రీ యొక్క సోదరుడు రక్షిస్తాడు. వీరిని కార్యవంతులు అంటారు. 'తార్‌పాడ్'ని చిన్న కుటుంబాలుగా విభజిస్తే ఆ కుంటుంబాన్ని 'తఖాజీ' అని పిలుస్తారు. ఇందులో కేవలం మహిళల వంశస్థులే ఉంటారు.

కె.ఎమ్. కపాడియాను అనుసరించి కేరళలోని చాలా ప్రాంతాలలో మహిళలే అగ్రగాములుగా ఉన్నారు. మలబార్‌లోని గ్రామీణప్రాంతాలలో భర్త భార్యఇంటికి వెళ్ళి నివసిస్తాడు. మాతృప్రధాన సమాజంలో పిల్లలు తమ తల్లి ఇంటిపేరుతోనే పిలువబడతారు.

విదేశాలలో కూడా చాలా ప్రదేశాలలో మాతృసత్తాత్మక సమాజం ప్రచారంలో ఉంది. దక్షిణ కేరళలో మరియు మేరీలాండ్‌లో మహిళలకు విశేషమైన అధికారాలున్నాయి. అక్కడ దాదాపు మహిళలందరూ అన్ని రంగాలలో ముందున్నారు. ఈ ప్రాంతాలలో విడాకులు నిషిద్ధం. జార్జ్ ఎ.బర్టన్ తన 'ఏ స్కెచ్ ఆఫ్ సెమేటిక్ అరింజన్స్, సోషియల్ ఎండ్ రెలీజెన్స్' అనే పుస్తకంలో మాతృసత్తాత్మక సమాజం యొక్క విశేషరూపాలను గురించి వర్ణించారు. సెమెటిక్ జాతులలో ఒకే భార్య అనే సంప్రదాయం ఉంది. వీరి సమాజంలో స్త్రీకి చాలా గౌరవప్రదమైన స్థానముంది. చరిత్ర ప్రసిద్ధి కెక్కిన రాణీ వరమాజలుగాండా రాజుకు ఒకే పత్ని. అందుచేత ఇక్కడ సమాజం మొత్తం స్త్రీ చుట్టూనే తిరుగుతుంది. మహత్వపూర్ణమైన నిర్ణయాలు తీసుకోవడంలో సమర్థవంతంగానూ మరియు అధికారికంగానూ ఉంటారు. హిబ్రూజాతి మహిళలకు విస్తృతమైన అధికారాలున్నాయి. జె.సీ. హటన్ 'అబీసీనియా ఎండ్ ఇట్స్ పీపుల్ అనే పుస్తకంలో నారీ ప్రధాన సమాజం గురించి వివరణ ఇవ్వబడింది. సమాజంలోని అన్ని ధార్మిక, సామాజిక ఇతర కార్యాలలో వీరిది మహత్వపూర్ణమైన పాత్ర.

పురుషప్రధాన సమాజం చాలా కఠోరంగా ఉంటుంది. అందువల్లనే సమాజంలో తగాదాలు తయారయ్యాయి. మాతృసత్తాత్మక సమాజం భావప్రధానంగా ఉంటుంది. ఆ సమాజం సాఫీగా సాగిపోతుంది. ఇందులో పరాక్రమంతో పాటు సేవ అనే కోమలత్వం కూడా ఉంటుంది. తల్లి ప్రభావం వల్ల సామాజిక ఆధారం దృఢంగానూ, భావపూర్ణంగానూ ఉంటుంది. రాబోయే 21వ శతాబ్దంలో స్త్రీకి ఇటువంటి గౌరవం అధికారం తిరిగి ప్రాప్తిస్తే ఎవరూ ఆశ్చర్యపోనవసరం లేదు.

*అనువాదం : శ్రీమతి లక్ష్మీ రాజగోపాల్*

*(అఖండజ్యోతి 1999 ఏప్రియల్)*

## దీన జన రక్షకులు విలియమ్‌బూథ్ - ఎవేపియరె.

*లోకంలో చాలమంది మనుష్యులు తమతోటివారు, బంధువులు కష్టాల్లో చిక్కుకుని బాధపడుతున్నా పట్టించుకోరు. సహాయంచేయటానికి ముందుకు రారు. కాని దీనుల కష్టాలను తమ కష్టాలుగా భావించి రాత్రింబవళ్ళు సహకరించేవారూ లేకపోలేదు.*

*ఒకానొకప్పుడు ఇంగ్లండు, ఫ్రాన్సు దేశాలలోని లండను, పారిస్ నగరాలలో కూడ గల్లీగల్లీలో, ఫుట్‌పాతులమీద అనాధలు వేల సంఖ్యలో పడి ఉండేవారు. వారి దుర్భరస్థితి వర్ణనాతీతం. వాళ్ళను చూచి జాలిపడి చిన్న రొట్టెముక్కగాని, రెండు గుక్కల మంచినీరుకాని ఇచ్చేనాధులే ఉండేవారు కారు. అసలు వారిని మనుష్యులుగానే భావించే వారుకాదు.*

*రోగులు మరణించేవారు. పిల్లలు రౌడీలుగా మారేవారు. స్త్రీలు వ్యభిచారం చేసేవారు. పురుషులు దొంగతనం చేసేవారు. ఐనా వారికి జానెడు పొట్ట నింపుకోవడం కష్టమయ్యేది. వీరివల్ల నాగరిక సమాజానికి చాల ఇబ్బందులు కలిగేవి. ఐనా వారిని మనుష్యులుగా తయారు చేయుటం తమ బాధ్యతగా ఎవ్వరూ భావించేవారు కారు.*

*చూచి చూచి ఇంగ్లాండులో "విలియమ్ బూథ్", ఫ్రాన్సులో "ఎవేపియరె" నడుంబిగించారు. దీన జనసేవను స్వీకరించారు. మానవతాదృష్టితో వారిని మానవులుగా తయారుచేయటానికి విశ్వప్రయత్నాలు చేశారు.*

**యజ్ఞం వల్ల దేవతలు తృప్తి చెందుతారు.**

ఆధ్యాత్మిక విజ్ఞానం

# ఆధ్యాత్మిక వైజ్ఞానికత మూల కేంద్రం - హిమాలయాలే

వైజ్ఞానిక ఆధ్యాత్మికత యొక్క జిజ్ఞాస అలెగ్జాండ్రాను రోమాంచితం చేసింది. ఆమె నీలి కన్నులు మెరుస్తున్నాయి. గులాబిరంగు పెదవులు నవ్వుతున్నాయి. కన్నులు మూసుకుని నిద్రలోకి వెళ్ళినట్లు వెళ్ళి తిరిగి లేచి కూర్చున్నది. నెమ్మదిగా ఆ పెద్ద హాలులో పచార్లు చేసి ఒక అల్మారా ముందు ఆగింది. అక్కడ అనేక అల్మారాల నిండా ధర్మ, అధ్యాత్మ, దర్శనములు, విజ్ఞాన పుస్తకములున్నాయి. ఈ పుస్తకముల సంకలనం ఆమె దృష్టి కోణమును, అభిరుచిని ప్రదర్శిస్తున్నాయి. ఆమె ఏదో పుస్తకం తియ్యబోతుండగా తలుపు చప్పుడయింది. ఆమె ఉలిక్కిపడి వెనుకకు చూచింది. అక్కడ ఆమె భర్త ఫిలిప్ నీల్ నుంచుని ఉన్నాడు. ఒకరినొకరు చూచి చిన్నగా నవ్వారు. భార్యాభర్తలకు విభిన్న రుచులున్నా, వేరువేరు దృష్టి కోణములున్నా ఒకరంటె ఒకరికి అత్యంత ప్రేమ. వారిది ప్రగాఢ ఆత్మీయ సంబంధం

ఫిలిప్ ఆమె చేతిలో "హిమాలయాలలోని రహస్యములు" అనే పుస్తకాన్ని చూచి నవ్వి, ఊరికే చదవడమేనా హిమాలయాలకు వెళ్ళేదేమన్నా ఉందా అన్నాడు. అమె కూడా నవ్వి "అలాగే జరిగేటట్టు ఉన్నది" అన్నది ఆమె యొక్క ఇచ్ఛాశక్తిని, ఆధ్యాత్మిక భావాలను, వైజ్ఞానిక అభిరుచిని అతను ప్రశంసిస్తుంటాడు. ఫ్రాన్స్‌లో నివసించే అలెగ్జాండ్రా 18వ సంవత్సరంలోనే ఇంగ్లాండు, స్విట్జర్‌లాండ్, స్పెయిన్ దేశాలను పర్యటించింది. ఆమె 1868 నుంచి 1969 వరకు 101 సంవత్సరములు జీవించింది. శ్రీమతి అలెగ్జాండ్రా దుర్గమ హిమాలయాల యాత్ర చేసిన మొదటి యూరోపియన్ మహిళ. హిమాలయాలంటే ఆమెకు అత్యంత మక్కువ. ఆమె వైదిక సాహిత్యం, బౌద్ధిక సాహిత్యమును పూర్తిగా అధ్యయనం చేసింది. ఆ రోజులలో ఉపనిషద్‌లను అధ్యయనం చేసేది. అప్పుడప్పుడు భర్తతో చర్చించినపుడు ఇలా అనేది "ఆధ్యాత్మికతలో రహస్యాలు లేవు. వీటిలో కూడా వైజ్ఞానిక ప్రయోగములు / పరీక్షలు ఉన్నాయి. ఆధ్యాత్మికత కూడా వైజ్ఞానికమే అనే దానికి ప్రామాణికములు వేదములలో ఉపనిషత్తులలో ఉన్నాయి. బుద్ధ భగవానుడు కూడా విజ్ఞానము యొక్క ఆధారంతోనే తన ఆధ్యాత్మిక సాధనలను చేసేవాడు."

ఒకరోజు అలెగ్జాండ్రా నేను భారతదేశం వెళ్ళాలి. హిమాలయాలు దర్శనం చేసుకోవాలి అన్నది. ఫిలిప్ ఆమెను తదేకంగా చాలాసేపు చూచాడు. అందమైన శరీరంతో పాటు తీవ్రమైన ఆలోచనలు, జిజ్ఞాసతో పాటు సరళస్వభావము. ఇలాంటి యువతి అసలు ఎవరైనా ఉన్నారా అనుకుంటున్నాడు. సరే ! నీవు వెళ్ళేందుకు ఏర్పాట్లు చేస్తాను అని కలకత్తాలో నివసించే తన మిత్రుడు విలియమ్స్‌కు ఒక టెలిగ్రాం పంపించాడు.

విలియమ్ జోన్స్ అభిరుచులు దాదాపు అలెగ్జాండ్రా అభిరుచుల వలె ఉన్నాయి. ఆమె రావటం అతనికి సంతోషదాయకం. కొద్ది రోజుల తరువాత ఆమెను తీసుకుని హిమాలయాలకు పయనమయ్యారు. దారిలో విలియమ్స్ శ్రీమతి అలెగ్జాండ్రాతో ఇలా అన్నాడు.

''జిజ్ఞాసతో పాటు ప్రయోగాలు, వాటి ఫలితాలను ఆకళింపుచేసుకుని విశ్లేషణ చేసే విజ్ఞానం అవసరం అన్నాడు. వైదిక ఋషులందరు ఈ విధముగానే ఆధ్యాత్మిక ప్రయోగాలు నిర్వర్తించేవారు. ఈ పరంపర ఉపనిషత్తులలో కనిపిస్తుంది. వివేకానందునిలో ఇతర పశ్చిమదేశ విద్వాంసులలో, ఆధ్యాత్మిక జిజ్ఞాసలో వైజ్ఞానిక పరిశోధనలు చోటుచేసుకున్నాయి'' అందువల్లనే మనలను హిమాలయాలు ఆకర్షిస్తున్నాయి. అన్నది అలెగ్జాండ్రా.

కొద్ది రోజులలో వారు ఇరువురు హిమాలయాలు చేరారు. కంటిముందు హిమాలయ స్వేత శిఖరములు ఆకాశంలో మెరుస్తున్నాయి. అక్కడక్కడ మంచు కమ్ముకుని ఉన్నది. తేలికపాటి మంచు కురుస్తున్నది. సూర్యరశ్మి అసలు కనిపించటం లేదు. వాతావరణం విచిత్రంగా ఉన్నది. ఏ లక్ష్యం కొరకు ఈ ప్రమాదకరమైన యాత్ర చేపట్టారో, అది పూర్తవుతుందా అనే సందేహంలో పడ్డారు. వాతావరణం ఇంకాస్త వికటించింది.

**యజ్ఞం వల్ల లోక కళ్యాణం జరుగుతుంది.**

తేలికపాటి మంచువర్షం మంచుతుఫానుగా మారింది. ఆ తుఫాన్ దెబ్బకు సొమ్మసిల్లి పడిపోయారు. స్పృహ తప్పింది. స్పృహలోకి వచ్చినపుడు వారు హిమాలయములలోని ఒక అందమైన గుహలో ఉన్నారు. గుహ బయట హిమాలయాల స్వేత శిఖరములు సూర్యకిరణములతో బంగారు రంగుతో మెరుస్తున్నాయి. గుహ బయట ఒక దివ్య దేహధారియైన ఒక మహాపురుషుడు దర్శనమిచ్చాడు.

ఇప్పుడు ''మీరు సురక్షితం'' అంటూ స్వాగతం పలికాడు."మేము ఎక్కడ ఉన్నాము" అలెగ్జాండ్రా వచ్చిరాని హిందీలో అడిగింది. ఆయన నవ్వుతూ ఇంగ్లీషులో జవాబిచ్చాడు. "ఇది హిమాలయములలో ఒక రహస్యప్రదేశం. వైజ్ఞానిక ఆధ్యాత్మికత జన్మస్థలం ఇదే. ఇక్కడే వేదాలు, ఋక్కులు అవతరించాయి. ఇక్కడే ఉపనిషత్తుల యొక్క స్మృతులు వినిపించాయి. భగవంతుడు అందరికన్న పెద్ద వైజ్ఞానికుడు. అతని బోధనలు విజ్ఞాన పరంగానే ఉంటాయి." అలా చెప్తూ వారిని ఒక గుహ ద్వారం దగ్గరకు తీసుకువెళ్ళాడు. ఆ గుహ ద్వారం చాల బరువైన రాతితో మూసివుంది. ఆయన అంతపెద్ద రాతిని ఒక ప్రక్కకు నెట్టాడు. అంత పెద్ద రాతిని అలా అంత తేలికగా పక్కకు నెట్టటం వారికి ఆశ్చర్యకరమయింది. ఆ గుహలో నుంచి వెళ్తే ఒక అందమైన ప్రదేశం వచ్చింది.

అలెగ్జాండ్రా, విలియమ్స్ అక్కడ ఉన్న విభిన్న గుహలలో ఉన్న దీర్ఘకాయులైన మహాపురుషులను సమాధిస్థితిలో ఉండడం చూచారు. నాలుగు ప్రక్కల ఫలపుష్పములతో నిండిన వృక్షములున్నాయి. అక్కడ పారుతున్న సెలయేరులలో అతి స్వచ్ఛమైన జలం ప్రవహిస్తున్నది. చాలాసేపు ఈ అందమంతా పరికించిన తరువాత వారు ఎక్కడ ఉన్నామని ఆ మహాపురుషుడిని అడిగారు. ఆయన ఇలా సమాధానమిచ్చారు. "ఇక్కడ ఆధ్యాత్మికత యొక్క ఉచ్ఛస్తరీయ వైజ్ఞానిక ప్రయోగములు చేయబడుతున్నాయి. ఇక్కడి నుంచి సృష్టి యొక్క వివిధ ఘటనా క్రమములు నియంత్రించబడుతున్నాయి. ఇక్కడి నుండి వెదజల్లబడే జ్ఞాన విజ్ఞాన కిరణాలే తూర్పు పశ్చిమ భూభాగాలలో వివిధ రూపములలో వెలుగులను విరజిమ్ముతున్నాయి." వారిరువురికి కావలసినది లభించింది. దర్శించదలచుకున్న స్థలం దర్శించారు. వైజ్ఞానిక ఆధ్యాత్మికత యొక్క బీజాలను సందర్శించారు. వారు ఆలోచిస్తూ ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నారు.

కళ్ళు తెరచేటప్పటికి వారు లోచన్‌మర్‌లో ఉన్నారు. అక్కడ ఉన్న మహాలామా గోమచేన్ వారినిచూచి నవ్వి ఇలా అన్నాడు "మీరు చూచినది అంతా సత్యమే. ఆధ్యాత్మ విద్య పూర్తిగా వైజ్ఞానికమే. సమయం వచ్చినపుడు హిమాలయ దివ్యక్షేత్రంలోని మహా ఋషులు దీనిని వైజ్ఞానిక ఆధ్యాత్మిక రూపంలో ప్రతిపాదిస్తారు."

*అఖండ జ్యోతి జులై 2009*

## నిరాయుధుడు

*దేశ విభజనతోపాటు మానవ హృదయాలు కూడ విభజింపబడినట్లుగా అనేకానేక మతకల్లోలాలు పేట్రేగినై. ప్రాణాలకు ఏమాత్రం విలువలేకుండా పోయింది. దుండగులకు ఢిల్లీ ప్రధాన కేంద్రమైంది. సందులు – గొందులేకాక ఏ వీధి చూచినా శవాలమయమే. దుకాణాలు లూటీ చేయబడ్డాయి. గృహదహనాలు పెచ్చు పెరిగిపోయినై.*

*ఒక చెప్పులదుకాణంలో కొందరు దుండగులు ప్రవేశించారు. ప్రాణాలమీది తీపితో యజమాని పారిపోయాడు. దుండగుల స్వైర విహారం మొదలైంది. ఎవరిచేతికందినవి వారు తీసికొని పరుగులు తీస్తున్నారు. పొడవైన అంగీ, చుడీదారు పైజామా వేసికొన్న వ్యక్తి యకాయకి దుకాణంలోనికి వచ్చి నిలబడ్డాడు. ఆతని చేతుల్లో ఎలాంటి ఆయుధం లేదు. ఆతనిని చూడగానే ఎక్కడి వాళ్ళక్కడే బొమ్మల్లా నిలబడిపోయారు. చేతుల్లో ఉన్న చెప్పుల జతలు క్రిందకు జారిపోయాయి. ఒక్కడు మాత్రం దుస్సాహసం చేసి కొన్ని చెప్పులు తీసికొని పరుగు లంకించుకున్నాడు. ఆ నిరాయుధుడు ఆ దుష్టుని వెంటపరుగుదీశాడు. చెప్పులక్కడే పడేసి అతడు పారిపోయాడు. ఆయన తన స్వహస్తాలతో చెప్పులను మోసుకొని వచ్చి దుకాణంలో సర్ది పెట్టాడు. అక్కడున్నవారంతా ఎక్కడి సామాను అక్కడ సర్ది వేశారు. ఆ నిరాయుధుడెవరోగారు. పండిత జవహర్‌లాల్ నెహ్రూ.*

**యజ్ఞం వల్ల నిరాశ అంతరిస్తుంది.**

సంస్కృతీమూర్తి - పరమపూజ్య గురు దేవులు

# సౌత్రామణి ప్రయోగం - యుగ పరివర్తన

అఖండ దీప ప్రజ్వలన సమయాన తీసుకోబడిన సంకల్పానికి పూర్ణాహుతి. ఇది విరాట్ మహా పురుషార్థం యొక్క మహా పూర్ణాహుతి. సంవత్సరాలుగా చేస్తున్న సాధనాత్మక పరాక్రమానికి మహాపూర్ణాహుతి.

దీని చతుర్థచరణంలోనికి వచ్చేసరికి సాధన పరిపక్వ స్థితిలో కనిపిస్తోంది. నలువైపులా ఉల్లాసపూరిత వాతావరణం ఆహ్లాదం కలిగిస్తోంది. శాస్త్రోక్తంగా పురుషమేథ మహాయజ్ఞం మరియు సౌత్రామణి ప్రయోగంచేయడం జరిగింది. ఈ విధమైన అభినవ ప్రయోగం గత రెండువేల సంవత్సరాలుగా ఎక్కడా జరగలేదు. కానీ ఈనాడు విశ్వగాయత్రీ పరివార్ ద్వారా విరాట్ పురుషుని మేల్కొల్పడం జరిగింది. యుగపరివర్తనకు ఈ సంకల్పం తీసుకోవడం జరిగింది.

**పురుషమేథం అనగా ఏమిటి?**

యజుర్వేదంలోని 30వ అధ్యాయమే పురుషమేథం. పురుషమేథం, నరమేథం, నృమేథం, మనుష్యయజ్ఞం మొదలైన వాటికి అన్నింటికీ అర్థం భావం ఒక్కటే. కలియుట, స్నేహం, ఐకమత్య స్థాపన, పవిత్రతా సంచారం, సత్వబలం, ఉత్సాహాన్ని పెంచడం అంటూ మేథ శబ్దానికి శాస్త్రకారులు అనేక అర్థాలు చెప్పారు.

నరమేథ, పురుషమేథాలు మానవులలో పరస్పర మైత్రీ భావాలను పెంచి పవిత్రులను చేస్తాయి. వారియందు సత్వ గుణ, బల, ఉత్సాహాలను వృద్ధి చేస్తాయి. మేథ అనే శబ్దానికి హింస అనే అర్థం కానే కాదు. మేథ అంటే మేథా వృద్ధికి పర్యాయపదం. హింస లేనిదాని పేరు అధ్వరం. వైదిక మంత్రాల ఆధ్యాత్మిక అర్థం బ్రాహ్మణ, ఆరణ్యక గ్రంథాలలో లభిస్తుంది. అందుకే యజుర్వేదంతో పాటు శతపథ బ్రాహ్మణాన్ని అధ్యయనం చేస్తే సరి అయిన అర్థం తెలుస్తుంది. సత్కర్మలు చేయడానికి అందరినీ ప్రేరేపించడం, అందరినీ జ్ఞానంతో శుద్ధి చేయడం సామూహికంగా ఒకే ఈశ్వరుని ఉపాసించడం, దుష్ట భావాలను దూరంగా తరిమివేయడం మొదలైనవి పురషమేథానికి వాస్తవిక లక్ష్యాలు. నరమేథాన్ని గురించిన వైదిక ఆశయం అత్యంత సుందరమైంది. దానిని మధ్యకాలీన కర్మకాండలు రూపుమార్చేశాయి.

యజుర్వేదంలోని 31వ అధ్యాయంలో ఈ పురుష శబ్దం వస్తుంది. పురుషుడనగా పరమేశ్వరుడు, పరమాత్మ, పరబ్రహ్మ, ఒకే ఈశ్వరుని ఉపాసించడమే పురుషమేథం. అందరికీ ఉజ్జ్వల భవిష్యత్తు కోసం, సద్‌జ్ఞాన విస్తరణ కోసం ఈ యజ్ఞంలో ప్రార్థించడం జరుగుతుంది. దీనిలో సవితా దేవతను ప్రార్థిస్తారు. దీనికి సంబంధించిన విషయం అంతా పురుషమేథంలోని మొదటి మంత్రంలో ఉంటుంది. 2వ మంత్రంలో పరమేశ్వరుని పాప నాశకుడుగా ధ్యానిస్తారు. గాయత్రీ మంత్రం యొక్క అర్థం కూడా అదే. 3వ మంత్రంలో చెడును తొలగించి, మంచిని ప్రసాదించుమని ప్రార్థిస్తారు. 4వ మంత్రంలో దేశంలోని విషమ పరిస్థితులను తొలగించి, మానవునికి ఉజ్జ్వల భవిష్యత్తును కోరడం జరుగుతుంది.

పండిత శ్రీపాద దామోదర సాత్వలేకర్ దీన్ని వ్యాఖ్యానిస్తూ ఈ మహాయజ్ఞం ఒక పుణ్య ప్రదమైన కర్మ అని చెప్పారు. "నధ్వరః – అధ్వరః అహింసామయం కర్మ " హింసలేని కర్మపేరే అధ్వరము అని భావం.

కాత్యాయన శ్రౌతసూత్రం ఈ విధంగా చెపుతోంది. దేశవర్చస్సును పెంచడానికి ప్రతిభావంతుల ద్వారా పురుషమేథం చేయించాలి. పురుషమేథంలో పాల్గొన్న తర్వాత అరణ్యాలలో తపస్సు చేయడానికి వెళ్ళాలి. అంటే వేదసన్యాసం స్వీకరించడం అన్నమాట. ఇది ఒక విధంగా వానప్రస్థ సంస్కారమే. పురుషమేథమహాయజ్ఞం శాంతికుంజ్ ద్వారా జరిపించాలన్న సంకల్పం తీసుకున్నారు. శ్రేష్ఠకార్యాన్ని చేయడానికి సంకల్పించిన వారికి సామూహికంగా వాన ప్రస్థదీక్షను ఇవ్వాలి. మొదటి మూడు ఆహుతులను వేయించి వారిని విముక్తులను చేయాలి. ఈ రూపంలో దేశ సేవకు కార్యకర్తలు లభిస్తారు. వ్యక్తిగత స్వార్థాన్ని వదిలిపెట్టి దేశం యొక్క ఉన్నతికి పాటు పడటమే పురుషమేథ యజ్ఞం అని చెప్పవచ్చు.

**యజ్ఞం వల్ల క్షయవ్యాధి నిర్మూలించబడుతుంది.**

**సౌత్రామణి అంటే ఏమిటి?**

సౌత్రామణిని గురించి శుక్లయజుర్వేద సంహితలో వివరించబడింది. దేశాన్ని ఆపదలనుండి రక్షించడమే దీని ప్రధాన లక్ష్యం.

మానవుని హింస, ఋణము, పాపము, అసత్తుల నుండి రక్షించి ముందుకు నడిపించడాన్నే సౌత్రామణి అంటారు. 'సరస్వతి, ఇంద్రుడు, అశ్వినీ కుమారులు' వీరిని లక్ష్యంగా పెట్టుకుని ఆహుతులు ఇవ్వబడతాయి. మానవుని దుఃఖానికి కారణాలు మూడు 1) అజ్ఞానం, 2) అభావం, 3) అశక్తత. అజ్ఞాన నివారణకు సరస్వతీ ఉపాసన ద్వారా ఆహుతులు ఇవ్వాలి. దానివలన జ్ఞానం లభిస్తుంది. ఇంద్రుని ఉపాసన ద్వారా ఆహుతులు ఇవ్వడం వల్ల (అభావం) పేదరికం దూరం అవుతుంది. ఐశ్వర్యం లభిస్తుంది. అశ్వినీ కుమారుల ఉపాసన ద్వారా ఆహుతులు ఇవ్వడం వల్ల (అశక్తత) బలహీనత దూరం అవుతుంది. ఆరోగ్యవంతుడై శక్తిమంతుడు అవుతాడు. "సుత్రాత్" అనగా చెడునుండి రక్షించుకొనుట అని అర్థం. ఈ సౌత్రామణి యజ్ఞం ఆత్మనుపాపం నుండి, మానవుని మృత్యువు నుండి కాపాడుతుంది. ఈ యజ్ఞం వల్ల లోకంలో బ్రాహ్మణత్వం, సంస్కారాలు వృద్ధి చెందుతాయి.

ఈ మహాయజ్ఞాన్ని శుక్లపక్షద్వాదశి నుండి ప్రారంభించి నాలుగు రోజులు చేయడం జరిగింది. కార్తీక శుక్ల ద్వాదశి నుండి పూర్ణిమకు పూర్తి చేశారు. ఈ యాగానికి దక్షిణగా దూడ సహితంగా గోమాతను దానం ఇవ్వాలి. అప్పుడే పూర్తి ఫలితం లభిస్తుంది.

'సముచి' అనే రాక్షసుడు ఇంద్రునిలోని సమస్త శక్తుల్నీ అపహరించాడు. సరస్వతీ మాత, అశ్వినీకుమారులు వాటిని తిరిగి సంపాదించి ఇంద్రునిలో ప్రవేశపెట్టారు. ఈ దేవతలు ఇంద్రుని ఆపద నుండి కాపాడారు. అందువల్ల దీనికి సౌత్రామణి అని పేరు వచ్చింది. ఈ యజ్ఞంలో స్విష్టకృతానికి ముందు యజమానికి అభిషేకం చేస్తారు. దానివల్ల ఆతడు పాపవిముక్తుడై ఇంద్రునివలె ధనవంతుడు అయినట్లుగా భావిస్తారు. ఈ యజ్ఞం అత్యంత విశిష్టమైంది. యజ్ఞ కర్త తన అహంకారాన్ని ఆహుతిగా సమర్పిస్తాడు. జీవాత్మను పశువుగా భావించి సమర్పించడం జరుగుతుంది. ఈ సమర్పణ ద్వారా దేవతలు సంతృప్తి చెందుతారు. ఈ యజ్ఞం ద్వారా దేశం సమర్థవంతం అవుతుంది. అశ్వినీ కుమారులు ద్వారా జీవన సంపద అయిన ఆరోగ్యం వృద్ధి చెందుతుంది. సరస్వతీ మాత ద్వారా మేధా సంపత్తి పెరుగుతుంది. అందువల్ల దేశంలో ప్రతిభావంతుల, ధనవంతుల, బలవంతుల సంఖ్య పెరిగిపోతుంది.

ఈ యుగ సంధి సమయాన నవయుగ నిర్మాణం చాలా అవసరం. అందువల్ల ఈ యుగ పరివర్తనా ప్రక్రియకు సంబంధించిన యజ్ఞం నవంబరు 7 నుండి 11 వరకు జరపడం జరిగింది.

(సంపూర్ణం)

## నేనైతే గాంధీగారి నౌకరును.

*బీహారు రాష్ట్రంలో చంపారన్ జిల్లాలో మహాత్మాగాంధీ గారి శిబిరం నడుస్తోంది. ప్రభుత్వం రైతులను బాధిస్తున్న తీరుతెన్నులపై చర్చ జరుగుతోంది. వేల సంఖ్యలో రైతులు తమ గోడును గాంధీ గారికి విన్న వించుకుంటున్నారు. ఆ ప్రధాన పాత్రధారి ఆచార్య కృపలానీగారు. ఆయన గాంధీగారికి శిబిర కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. జిల్లా అధికార్ల దృష్టంతా ఆయన మీదే.*

*ఈ వ్యవహారంలో గాంధీజీ రోజుకు అనేక లేఖలు కలక్టరుగారి దగ్గరకు పంపేవారు. మోసుకుపోయే పని కృపలానీది. రోజూ తన వద్దకు వస్తున్న కృపలానీతో కలెక్టరు "సార్! మీరు పెద్ద ప్రొఫెసర్. ఈ ఉద్యమం నడపడానికి కూడ ముఖ్య సూత్ర ధారులు. కానీ ఈ లేఖలు మోస్తూ పోష్టుమాన్ పని చేస్తున్నారే! మీకేమీ అవమానంగాలేదా?" అని అడిగాడు.*

*సమాధానంగా కృపలానీ "నేనైతే సాధారణ కార్యకర్తను. ఇంకా చెప్పాలంటే గాంధీగారి నౌకరును." అన్నాడు.*

*సమాధానం విన్న కలక్టరు గాంధీగారి ఉన్నత తత్వాన్ని గ్రహించాడు. అంతేకాక ఉద్యమ స్వభావాన్ని కూడ అంచనా వేయగలిగాడు.*

**యజ్ఞం వల్ల కాలుష్యం నివారించబడుతుంది.**

జీవించేకళ

# కళలకు శిఖరాగ్రం జీవించేకళ

"జీవితం కళలన్నింటిలో గొప్పది. సక్రమంగా జీవించగలిగిన వ్యక్తి నిజమైన కళాకారుడు" – అని మహాత్మాగాంధీ హితవు చెప్పారు.

## సాధనాలు : శరీరం, మనస్సు, బుద్ధి

జీవించడం కూడ ఒక కళ. కళలన్నీ కనపడని సౌందర్యాన్ని కనిపింపజేస్తాయి. జీవితం కూడ సత్యం ,శివం, సుందరంలలో దాగి ఉన్న రహస్యాలను అనుభూతి పొంది ప్రకటించే కళ. చిత్రకారునికి సాధనాలు రంగులు, కుంచె. శిల్పికి సాధనాలు రాయి, ఉలి. సంగీత నిపుణునికి సాధనాలు శబ్దం, స్వరం, తాళం, లయ. అలాగే, జీవించేకళకు సాధనాలు శరీరం, మనస్సు, బుద్ధి.

జీవించేకళ తెలియకపోతే మన విద్య, మనజ్ఞానం, మన ధనం, అన్నీ నిరర్థకాలు అవుతాయి. పుట్టడం, బ్రతకడానికి పొట్టనింపుకోవడం, ఏదో ఒకనాడు చావడం, ఇదేనా జీవితమంటే. వేలాది సంవత్సరాల సంస్కృతీ సభ్యతల యాత్రలో మనిషి నేర్చుకున్నది ఇంతేనా?

మరి – సక్రమంగా, నిండుగా జీవించడమంటే ఏమిటి? శరీరం ద్వారా, మనస్సు ద్వారా, బుద్ధి ద్వారా ఆత్మ శక్తులను అనుభూతి పొందడం; వాటిని తన జాతి కోసం, విశ్వ కళ్యాణం కోసం సద్వినియోగపరడం.

మొదట శరీరాన్ని తీసుకుందాం. శరీరం చివరివరకు శక్తి సామర్థ్యాలు కలిగి ఉండాలి. అది శ్రేష్ఠ కార్యాలకు ఉపయోగపడాలి. దానికి అలసట, సోమరితనం ఉండకూడదు. అది ఆరోగ్యంగా ఉండాలి. దానికి రోగనిరోధక శక్తి ఉండాలి. మెదడు పదునుగా ఉండాలి. కళ్ళు వెలుగుతో నిండి ఉండాలి. ముఖం తేజస్సుతో ప్రకాశించాలి. పళ్ళు దృఢంగా, స్వచ్ఛంగా ఉండాలి. నాలుక కోమలంగా, తియ్యగా పలకాలి. ఛాతీ విశాలంగా ఉండాలి. చేతులు బలంగా ఉండాలి. కడుపు అన్నింటినీ జీర్ణించుకునేలా ఉండాలి. సుదీర్ఘమైన జీవన యాత్రకు కాళ్ళు బలిష్టంగా ఉండాలి.

ఆ తర్వాత మనస్సు. మనస్సులో మంచి ఆలోచనలు రావాలి. ఉన్నత ఆదర్శాలు నిలవాలి. మనస్సుకు సన్మార్గంలో నడిచే బలం ఉండాలి. స్వార్థం ఇతరులకు హాని కలిగించేటంత బలీయంగా ఉండకూడదు. శరీరంలో ఉత్సాహ తరంగాలను ప్రవహింపజేయాలి. అసూయ, ద్వేషం, లోభం, అన్యాయాలతో కలుషితం కాకూడదు.

మూడవది బుద్ధి. అది ఆలోచనలను లక్ష్యంవైపు నడిపించాలి. మంచి చెడులను విచక్షణ చేయాలి. మనస్సును శ్రేయో మార్గం వైపు మళ్ళించాలి. సమస్యల మూలాలలోకి వెళ్ళే విజ్ఞత కలిగి ఉండాలి. మన హితాన్నీ, ఇతరుల హితాన్నీ సమన్వయ పరచగలగాలి. వ్యక్తి, సమాజాల పరస్పర సంబంధాలను తగు విధంగా వికసింపజేయాలి.

## పశుత్వం పెరగడానికి కారణం

ఆరోగ్యకరమైన శరీరం, స్వచ్ఛమైన మనస్సు, తీక్షణమైన బుద్ధి – ఈ మూడూ పరస్పరం సహకరిస్తే, జీవించే కళ వెలికి వస్తుంది. అంద వికారమైన వస్తువులకు అందం వస్తుంది. స్వార్థం స్థానంలో త్యాగం వచ్చి నిలుస్తుంది. ఉదారత పెల్లుబుకుతుంది. మనం ఇతరుల పట్ల మరింత సహనంతో, మరింత ఉదారంగా, మరింత సానుభూతితో, మరియు ఆత్మీయంగా ప్రవర్తిస్తాము. కాని అలా జరగడం లేదు.

ఈ నేపథ్యంలో ప్రపంచాన్ని చూచినప్పుడు మనకు ఆశ్చర్యం, దుఃఖం కలుగుతాయి. సుఖ సాధనాలు ఎన్నో రెట్లు పెరిగాయి. కొత్త కొత్త సాధనాలు వస్తున్నాయి. అయినా, మనిషిలో అశాంతి వ్యాపించి ఉంది. అతడి దృక్పథం మారలేదు. జీవితం మారిపోయింది. ప్రపంచం మారిపోయింది. అయినా, జీవితం పట్ల, ప్రపంచంపట్ల మనిషి దృష్టికోణం మారలేదు. బలవంతుడు బలహీనుణ్ణి మ్రింగివేస్తున్నాడు. ధనికుడు పేదవాణ్ణి అణచివేస్తున్నాడు. బలీయమైన దేశాలు బలహీన దేశాలను దోచుకుంటున్నాయి. మానవ సంస్కృతి తన లోపల దాగి ఉన్న

**యజ్ఞం వల్ల వర్షాలు కురుస్తాయి.**

దైవత్వాన్ని బయటికి వ్యక్తం చేయడానికి వేల సంవత్సరాలుగా ప్రయత్నిస్తోంది. పశుత్వం అణచబడిన మేరకు సభ్యత వికసిస్తూ వచ్చింది. కానీ, గొప్ప అవకాశాలు వచ్చినపుడల్లా గీటురాయిమీద గీసిచూచినప్పుడల్లా లోపల అణచబడ్డ పశుత్వం వెలికి వస్తోంది. మానవత్వపు కృషి అంతా మట్టిపాలు అవుతోంది ఎందువల్ల?

మనిషి మారలేదు కనుక. అతడు ప్రేమకు బదులు బల ప్రయోగం పట్ల మరింత విశ్వాసం ఉంచుతున్నాడు. హార్ధికతకు బదులు అధికారం రాజ్యమేలుతోంది. అందువల్ల సాదాసీదాగా కనిపించే మనిషి ఆపద సమయంలో స్థిమితం కోల్పోతున్నాడు, పిచ్చివాడు అయిపోతున్నాడు. మనిషి మరో మనిషి గొంతును నులిమి వేస్తున్నాడు. యుద్ధం పేరిట సామూహిక హత్యలు జరుగుతున్నాయి. దేశాలమధ్య శత్రుత్వం దేశభక్తిగా చెలామణీ అవుతోంది. స్వార్థం, స్పర్థ, బలప్రయోగాల ముందు సదాచరణ, ప్రేమ, అభ్యున్నతి నిలువలేకపోతున్నాయి.

## నైతికతను మించిన భౌతికత

ఆధునిక జీవితంలో సమతూకం దెబ్బ తిన్నది. నైతికత కన్న భౌతికత మరింతగా వికసించడం ఇందుకు కారణం. భౌతిక రంగంలో ఆశ్చర్యకరమైన ప్రగతి జరిగింది. విప్లవాత్మక పరివర్తన జరిగింది. నైతిక రంగంలో అంతటి ప్రగతి, మార్పు జరగలేదు. రెండింటి మధ్యా ఒక అంతరం, ఒక అగాధం, ఏర్పడింది. గత వంద సంవత్సరాలలో ఈ అగాధం మరింత వేగంగా పెరుగుతూ వచ్చింది.

అలాగే – బుద్ధిబలం శరవేగంతో పెరిగింది. ఆధ్యాత్మిక వికాసం బాగా వెనుకబడిపోయింది. ఫలితంగా మనిషిలో ఒక తీవ్ర నిరాశాభావం, ఒక నిస్సహాయతా భావం, ఒక విఫలతా భావం తిష్ఠ వేసుకున్నాయి.

భౌతిక సుఖ సౌకర్యాలు అపరిమితంగా పెరగడంతో– మనిషిలో వాసనల, భోగ విలాసాల ప్రలోభం మితిమీరిపోయింది. కనుకనే డబ్బు కూడబెట్టాలన్న వాంఛ మనిషిని ఆక్రమించింది. మనిషిలో సంయమన శక్తి క్షీణించింది. శారీరక భోగ విలాసాలపై, స్వార్థ భావనలపై అంకుశాన్ని ప్రయోగించడం, లోక కళ్యాణం కోసం త్యాగం చేయాలనే భావనను, ఆత్మోన్నతి పొందాలనే భావనను వికసింపజేయడం నేటి అవసరం.

కొత్త జగత్తుకు కొత్త మనిషి అవసరం. జీవించే కళలో నిపుణుడైన మనిషి అవసరం. నవయుగ నిర్మాణానికై, నూతన జీవన దృక్పథాన్ని అలవరచుకోవాలి. ఆత్మ సంస్కరణకూ, ఆత్మోన్నతికీ దృఢ సంకల్పం, సంస్కారం మనిషిలో ఉదయించాలి, వికసించాలి, నవయుగ అవతరణ, స్వర్ణయుగ అవతరణ అపుడే సాధ్యపడుతుంది.

మనిషి జీవితపు లోతులలో అపరిమితమైన శక్తులు దాగి ఉన్నాయి. మన శరీరం, మనస్సు, బుద్ధి అనారోగ్యంతో బాధపడుతున్నాయి. కనుకనే, జీవించేకళ మనకు అలవడటం లేదు. పాత జీవన దృక్పథపు బంధనాలను మనం త్రెంచుకోగలగాలి. నవయుగ నిర్మాణానికి పునాదిగా అభినవ జీవన దృక్పథాన్ని స్వీకరించాలి. అది జరిగిన రోజున మనం ఒక నూతన విజయాన్ని, ఒక అభినవ సాహసాన్ని, ఒక నవ్య స్ఫూర్తిని ఒక కొత్త శక్తిని ఒక నవీన ఆనందానుభూతిని పొందుతాము. ఆ అనుభూతి అపురూపంగా, అనిర్వచనీయంగా ఉంటుంది.

★★★

## మనస్సును బాధించిన వాడే శత్రువు.

*ఒకసారి శేఖసాదీ దగ్గరకు ఒక మిత్రుడు వచ్చాడు. "నాకు తెలిసిన మీ ఒకానొక శత్రువు మిమ్ముల్ని గురించి అనరాని మాటలు అంటున్నాడు. నానోటితో నేను చెప్పలేను." అంటూనే ఆ నోటితోనే వినరాని మాటలు వినిపించాడు.*

*వినివిని శేఖసాదీ అన్నాడు. అవును ఆతని సంగతి నాకు తెలుసు. కాని అతడు నా ఎదురుగా ఎప్పుడూ ఒక్కమాట కూడ అనలేదు. మీరుమాత్రం నా ముందరే ఆతడన్నాడంటూ నిందా వాక్యాలు పలికారు. అవి విన్న దగ్గర్నుంచీ నా మనస్సు బాధ పడింది. మీ యిద్దరిలో నా శత్రువు ఎవరు? మీరే చెప్పండి.*

*స్నేహితుడు సిగ్గుతో తలవంచుకున్నాడు.*

*ఇతరుల మనస్సు బాధ కల్గించినవాడే శత్రువు.*

**యజ్ఞం వల్ల పరోపకారం, దానం వంటి సద్గుణాలు అలవడుతాయి.**

# ఇతరుల దోషాలను చూడకండి

"ఇతరుల దోషాలను చూచేముందు, ఎవరైనా చెడ్డవాడని చెప్పేముందు నీలో ఏదైనా చెడు ఉందేమోచూడు. ముందుదానిని తొలగించుకో ఇతరులను నిందించడానికి బదులు ఆసమయాన్ని నీ ఉద్ధరణకు వినియోగించు. పరనిందను త్యజించి, పరమానంద ప్రాప్తివైపు పురోగమిస్తున్నానని నీవే అంగీకరిస్తావు.

ప్రపంచాన్ని జయించాలనే కోరిక గలిగిన మానవులరా! మొదట మిమ్మల్ని మీరు జయించుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడే విశ్వవిజేతలం కావాలన్న మీ స్వప్నం ఏదో ఒక రోజు ఫలిస్తుంది. ప్రపంచంలోని ప్రాణులన్నింటినీ మీ జితేంద్రియత్వం ద్వారా, మీ సైగతో నడిపించగలుగుతారు. ప్రపంచంలోని ఏజీవీ మీకు విరోధిగా ఉండజాలదు." అని పరమపూజ్య గురుదేవులు "ధైర్యం విడవకండి" అనే పుస్తకంలో మొట్టమొదటి పేజీలో వ్రాశారు. పైగా దానిని ప్రతివ్యక్తి, ప్రతి రోజూ చదవాలి అన్నారు. దానిని బట్టి ఈ శీర్షికను చక్కగా అర్థం చేసుకోవచ్చు.

ఇతరుల దోషాలను ఎంచటం చాలా చెడ్డ అలవాటు. భార్యలో దోషాలు చూస్తున్నంత కాలం గృహస్థ జీవనం శాంతమయంగా, సుఖంగా ఉండదు. ఇతరులను తప్పు పట్టే వాళ్ళకి ఎదుట ఉన్న వ్యక్తిలో తప్పులే కనిపిస్తాయి. వారిలో ఉన్న మంచి గుణాలు కనిపించవు. ఇతరుల దోషాలను చూడటం ఒక మానసిక రోగం. దీనిని వదిలించుకోవాలి.

పార్వతీ దేవికి ఇద్దరు పుత్రులున్నారు. ఒకరికి ఆరు ముఖములు 12 చేతులు, ఇంకొకరికి ఏనుగు తొండం లాంటి ముక్కు, పెద్దవాడు చిన్నవాడి ముక్కును తడుముతుంటే, చిన్నవాడు పెద్దవాడి కన్నులను లెక్కబెడుతున్నాడు. 1,2,3,4,5,6,7,8,9, 10,11,12. అంతే పోట్లాట మొదలయింది. పార్వతిదేవి పిల్లలు పోట్లాడుకోవటంతో బాధపడుతుంది. ఒక రోజు తండ్రి అయిన పరమేశ్వరుని దగ్గరకు తీసుకువెళ్ళింది. "వీరిద్దరు రోజంతా కొట్టుకుంటూనే ఉంటున్నారు. వీరిద్దకీ అర్థం అయ్యేటట్లు చెప్పండి" అని అన్నది. జ్ఞానవంతుడైన ఆయన వీరు పోట్లాడుకునే కారణం తెలుసుకుని వారిరువురిని ప్రేమతో ఒడిలో కూర్చోబెట్టుకున్నాడు. ఇతరుల లోపాలు చూడడం తప్పని అర్థం అయ్యేటట్లు వివరించాడు. అప్పటినుండి వారు ఇద్దరు కొట్టుకోవడం ఆపేశారు.

కష్టాలలో ఉన్నప్పుడు భగవంతుడా! నా అపరాధాలను క్షమించు. నా తప్పులను చూడకు. అని ప్రార్థిస్తుంటారు. ఇలాంటి కోరికలు కోరేవారు ముందుగా ఇతరుల తప్పులు క్షమించవలసి ఉంటుంది. అప్పుడే మన తప్పులు క్షమింపబడటానికి ఆస్కారముంటుంది. బైబిల్ లో ఇలా ఉన్నది "ఇతరులు నీ తప్పులు పట్టకూడదనుకుంటే నీవు ఇతరుల తప్పులు పట్టకు"

మనం అనేక మంది మీద, వీడు ఇలా ఉన్నాడని, వాడు అలా ఉన్నాడని కంప్లేంట్ చేస్తుంటాము. కాని మనం రెండో ప్రక్క చూడం. అతని వల్ల కష్టాలు వచ్చాయని నిందిస్తాం. చేసిన మేలు గుర్తుండదు. పొగడటం అసలే ఉండదు. కృతజ్ఞత కనిపించదు.

మనం ముందుగా ఇతరుల దోషాలను పట్టడం అనే దోషం నుంచి ముక్తి పొందాలి. మంచి గుణాల గురించి ఆలోచించాలి. పెంపొందించుకోవాలి. సద్బుద్ధిని ఇవ్వాలని భగవంతుని ప్రార్థించాలి.

*అఖండ జ్యోతి ఫిబ్రవరి 1955*

*"తప్పులెన్ను వారు తండోప తండంబు*
*లుర్విజనుల కెల్లనుండు తప్పు*
*తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరు*
*విశ్వదాభిరామ వినురవేమ!"*

అని వేమన యోగి ఏనాడో చెప్పాడు.

పై వ్యాసం చదివి క్రింది ప్రశ్నలకు జవాబులను తయారుచేసుకోండి.

1. **ఇతరులను తప్పులు పట్టటం వల్ల ఎలాంటి ఫలితం వస్తుంది?**
2. **ఇతరులు మన తప్పులు పట్టకూడదనుకుంటే మనం ఏమి చేయాలి?**
3. **ఇతరుల తప్పులు పట్టటం ఒక మానసిక రోగం అంటారు. ఇది నిజమేనా?**

మంచి పనులకు శరీరాన్ని తపింప చేయడమే తపస్సు.

ధారావాహిక: దివ్యజీవన దర్శనం-68

# కొత్త సాధకుల కోసం పిలుపు

పత్రిక కార్యాలయానికి వచ్చే ఉత్తరాల కవర్లను శ్రీరామ్ స్వయంగా చింపేవారు. ఆ ఉత్తరాలలోని విషయాలను నిశితంగా పరిశీలించేవారు. అఖండజ్యోతి పాఠకుల ఆకాంక్షలను అవగాహనచేసుకుంటూ ఆయన ఒక రోజున భూదేవ్ శర్మను ఇలా అడిగారు "పండిట్‌జీ ! మనం ఇంకా ఏవేవి ఇవ్వాలని పాఠకులు కోరుతున్నారు?"

భూదేవ్ శర్మ ఇలా జవాబిచ్చారు "ఉత్తరాలవల్ల స్పష్టంగా ఏదీ తెలియడం లేదండి. అయితే రెండు సంవత్సరాలలో పాఠకుల సంఖ్య అయిదు రెట్లు పెరిగింది. అఖండ జ్యోతి పాత సంచికలు కావాలని చాలా మంది అడుగుతున్నారు. వాటినికూడా చదవాలని వారు వాంఛిస్తున్నారు.

"పాత సంచికలు మన వద్ద లేవు" అని శ్రీరామ్ అన్నారు. ఆయన కొద్దిసేపు ఆలోచించి ఇలా అన్నారు. "ఆ పాఠకుల కోరికను తీర్చడానికి ఒకే ఒక మార్గం ఉంది. ఆ పాత సంచికలలోని ఉపయుక్తమైన వ్యాసాలను పుస్తకాల రూపంలో ప్రచురించడమే".

అఖండ జ్యోతికి సంబంధించిన ఏ నిర్ణయమయినా మాతాజీని సంప్రదించిన తర్వాత జరుగుతుంది. ఆమెగారి అభిప్రాయం శ్రీరామ్ అభిప్రాయానికి భిన్నంగా లేదు. కనుక గ్రంథాల ప్రచురణకు పథకం రూపొందింది. అఖండ జ్యోతిలో ప్రచురితమైన వ్యాసాలు, సంకలనాలు ఆరణాల గ్రంథమాలగా ముద్రితం అయినాయి. ఆ గ్రంథమాలలో క్రొత్తగా వ్రాయబడిన పుస్తకాలను కూడ చేర్చారు. పుస్తకాల ధరను నిర్ణయించడానికి చర్చజరిగింది. ఆ సందర్భంగా మాతాజీ ఇలా అన్నారు. "ఆరణాలు ఖర్చుచేయడానికి ఇబ్బందిపడేవారు కొందరు ఉండవచ్చు. వారిని గురించి కూడా ఆలోచించాలి."

"అందుకు ఏమి చేయాలి? పుస్తకాలను ఉచితంగా పంచిపెట్టేందుకు అవసరమయ్యే సాధన సంపత్తి మనవద్ద లేదు" అని శ్రీరామ్ అన్నారు. భూదేవ్‌శర్మ డబ్బు ఖర్చుచేయలేని వాళ్ళు పుస్తకాలు చదవకూడదు. తమ తిండి, బట్టలు సంగతీ, బ్రతుకు తెరువు సంగతీ వారు మొదట చూచుకోవాలి" అని తన అభిప్రాయం తెలిపారు.

"తిండిలేని వారి విషయం సమాజం ఆలోచించాలి. అన్న సత్రాలు, ధర్మశాలల వంటివి చూచుకోవాలి" అని మాతాజీ అన్నారు. పుస్తకాల కోసం గ్రంథాలయాలూ, పఠనాలయాలు ఉన్నాయి. పుస్తకాలను కొని చదవలేనివారు ఆ సంస్థనుండి వాటిని పొందాలి."

"అయితే గ్రంథాలయాలకు మన పుస్తకాలు అందేందుకై ఎలాంటి ఏర్పాట్లు జరగాలి?" – అని మాతాజీ ప్రశ్నించారు.

శ్రీరామ్ ఈ సంభాషణను వింటున్నారు. ఆయన మౌనంగా కూర్చుని ఆలోచిస్తున్నారు. సంభాషణ వల్ల ఏ నిర్ణయమూ జరగకపోవడం చూచి ఆయన ఇలా సూచించారు. చదివే వ్యక్తులు పుస్తకాలు కొనలేకపోతే, పుస్తకాలు వారికి అందే ఏర్పాట్లు జరగాలని మాతాజీ కోరుతున్నారు. అందుకు మధ్యేమార్గం ఉంది. పుస్తకాలను కొందరికి తక్కువ ధరకు ఇవ్వాలి."

ఎవరికి తక్కువ ధరకు ఇవ్వాలి? పుస్తకాలు తక్కువ ధరకు కావాలని కోరేవారికి ఆరణాల పుస్తకాలను అణాకానీకి (ఇప్పటి ఎనిమిది పైసలకు) ఇవ్వాలి. కోరేవారు విద్యార్థులయితే – ఆ పుస్తకాలను ప్రధానోపాధ్యాయులు ధృవపరచాలి. ఈ రాయితీ దుర్వినియోగం కాకుండా ఉండడానికి అలాంటి పుస్తకాలమీద విద్యార్థి సంపుటం అని ముద్రవేయాలి.

అఖండజ్యోతి పత్రికలో ఈ పుస్తకాల పథకాన్ని ప్రచురించారు. పుస్తకాలు కావాలని ఎందరెందరో పాఠకులు ఉత్తరాలు వ్రాశారు. శ్రీరామ్ అలాంటి విద్యార్థులకు స్వయంగా జవాబులు వ్రాశారు. ఇతర విద్యార్థుల చేతకూడ ఈ పుస్తకాలను చదివించాలని ఆ లేఖలలో ఆయన సూచించారు. 1949 అక్టోబరు నాటికి 500లకు పైగా పాఠకులు ఈ గ్రంథమాలలోని పుస్తకాలను చదివారు. మథుర వచ్చి కొద్ది సమయం శ్రీరామ్‌తో పాటు గడపాలనే కోరికను పలువురు తమ ఉత్తరాలలో వ్యక్తం చేశారు. కొందరు యువకులు శ్రీరామ్ 'గురుదేవులు' అని సంబోధించారు. మథుర

**తపస్సు వ్యక్తి యొక్క పాపములను దహించి వేస్తుంది.**

రావాలనే కోరికను వ్యక్తపరచిన విద్యార్థులకు 'సరే' అనాలనిపిస్తోంది. 'రావద్దు' అన్న మాటే రాకూడదు. రావద్దంటే వారి భావాలు దెబ్బతింటాయి. అయితే అలా వచ్చేవారికి వసతులు లేవు.

పది పన్నెండుమంది సాధకులకు తమ ఇంటిలోనే బస ఏర్పాటు చేయవచ్చని మాతాజీ అన్నారు. అయితే అది శాశ్వత పరిష్కారం కాదు. ముందుముందు సాధకుల సంఖ్య తప్పకుండా పెరుగుతుంది. ప్రత్యేక వ్యవస్థకు తగు సాధన సంపత్తి లేదు. ఈ విషయమై తర్జన భర్జన జరుగుతోంది. రకరకాల ప్రత్యామ్నాయాలు సూచించబడుతున్నాయి. విద్యార్థులకూ సాధకులకూ ఇంటిలోనే బస ఏర్పాటు చేయాలనే మాతాజీ తాత్కాలిక పరిష్కారం ఆమోదం పొందింది. వారికి లేఖలు వ్రాసే విషయాన్ని కూడ భూదేవ శర్మ ప్రస్తావించారు.

అయితే శాశ్వత పరిష్కారం మాత్రం దొరకలేదు. శ్రీరామ్ తన మెదడునుండి ఈ సమస్యను తొలగించారు. పూజా గృహంలో వెలుగుతున్న దీపంవైపు చూడసాగారు. మనస్సులోపలి పొరలలో స్తబ్దమైన నిశ్శబ్దం ఆవరించినట్లు శ్రీరామ్‌కు అనుభవమయింది. చల్లగాలులు వీస్తున్నాయి. హిమాలయ దృశ్యం మనస్సులో మెదిలింది. గత హిమాలయయాత్ర స్మృతులు మనోపథంలో తారాడాయి. ఒకొక్కటిగా ఆ దృశ్యాలు వచ్చిపోసాగాయి. ఆ నీరవ వాతావరణంలో తమ గురుదేవుల వాణి వినిపించసాగింది.

"ఆశ్రమాన్ని నిర్మించు, ఆశ్రమాన్ని నిర్మించు,
ఆశ్రమాన్ని నిర్మించు"

(సమాప్తం)

## వరద తాకిడికి రహదారు(ణా)లు

### వంతెనలు కొట్టుకుపోయాయ్. పల్లెదారి బాగుపడేదెన్నడు?

ఇదేం వరద బాబోయ్? పెద్ద పెద్ద వంతెనలే కొట్టుకుపోయాయ్! రహదారులు కోతలకు గురయ్యాయి. వంకలపై కల్వర్టులు కుంగిపోయాయ్. మా ఊళ్ళు బాగుపడే దెట్లా? రహదారులపై ప్రయాణించేదెలా? వరద తాకిడికి దెబ్బతిన్న తీర గ్రామాల బెంగ ఇది. అసలే అంతంత మాత్రం ఉన్న ఈ రహదారులు వరద తాకిడికి దారుణంగా తయారయ్యాయి. మళ్లీ పూర్వపు స్థితి రావాలంటే ఎన్నేళ్ళు పడుతుందో... అంత వరకు ఈ గోతుల మధ్య ప్రయాణించక తప్పదు మరి. అక్టోబరు రెండో తేదీ జిల్లాలో రహదారుల పాలిట నల్లదినం. ఎందుకంటే నల్లగా నిగనిగలాడుతూ ఉండే తారురోడ్లు ఎక్కడికక్కడ ముక్కలు చెక్కలయ్యాయి. జాతీయ రహదారి నుంచి కర్నూలు నగరానికి మునగాలపాడు మీదుగా వెళ్లటానికి వేసిన తారు రోడ్డు ఛిద్రమయ్యింది. తుంగభద్ర తీరాన్ని తాకుతూ కర్నూలు నుంచి నాగులదిన్నె మీదుగా మంత్రాలయం వరకు ఉన్న రహదారి అక్కడక్కడ అతుకులు ఉన్నా 15 గ్రామాలకు రవాణా సదుపాయం కల్పించేది. అలాంటి ఈ రహదారి ఇప్పుడు ముక్కలు ముక్కలైంది. నందవరం మండలం నాగులదిన్నెను మహబూబ్‌నగర్ జిల్లాతో కలిపే అతిపెద్ద వంతెన ఉగ్ర తుంగభద్ర ధాటికి కొట్టుకుపోయింది. 850 మీటర్లున్న ఈ వంతెన నిర్మించేదెప్పుడు? మళ్లీ ఈ గ్రామాలు కలుసుకునేదెన్నడు? ఎన్నో ఏండ్ల తర్వాత వంతెన కల ఫలించగా ఇప్పుడు మొండిగోడల్లా పిల్లర్లు మిత్రమే మిగిలాయి. కర్నూలును కన్నడనాడుతో కలిపే మాధవరం వంతెనదీ ఇదే దుస్థితి. వీటిని మళ్లీ నిర్మించాలంటే వందల కోట్లు అవసరం. ఆర్అండ్‌బి రహదారులు 1344 కిలోమీటర్ల మేర, పంచాయితీ రాజ్ రోడ్లు 520 కిలోమీటర్లు దెబ్బతినడంతో ఈ రెండు శాఖలకు రూ.667 కోట్లు నష్టం వాటిల్లింది. కర్నూలు నగరంలోనూ ఎమ్మిగనూరు,ఆదోని పట్టణాల్లోనూ సాధారణ రహదారుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయింది. వీటికి తత్కాలిక మరమ్మతులు తప్ప శాశ్వత బాగోగులు కన్పించడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఈ రహదారులను యథాస్థితికి తీసుకురావాలంటే రూ.వేయి కోట్లు అవసరం. వరదతో గాయమైన ఈ రహదారులు బాగుపడేదెన్నడు? పల్లెల జీవనయానం సాగేదెన్నడు? వరద గాయాన్ని మాన్పాల్సిన బాధ్యత సర్కారుదే అని చేతులు దులుపుకుంటే సరిపోదు. మనం కూడా మనవంతు కృషి చేయాల్సిఉంటుంది. (7-11-09 ఈనాడు ఆధారంగా)

**అంతఃకరణను సంస్కరించుకోవడమే తపస్సు.**

నా వారితో నా మాట : 2011 -2012 (శతాబ్ది సంవత్సరం)

# శతజయంతి ఉత్సవాల రూపురేఖలు-11

## యువతకు మార్గదర్శనం ఎలా చేయాలి ?

### యువశక్తి జాగరణ - ఉద్యమ స్వరూపం - రణనీతి

34 నెలలు నుండి పాఠకులకు గుర్తు చేస్తూనే ఉన్నాం. మహోన్నతమైన పరివర్తన రాబోతోంది. పరమ పూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది మన ముందున్నది. 21వ శతాబ్దిలో మానవుని భవిత నిర్ధారించబడుతుంది. నక్సలిజం, అరాచకత్వం, అవినీతి, ఉగ్రవాదం అన్నింటికీ ఏకైక సమాధానం ఆలోచనల్లో మార్పు మాత్రమే. (విచారక్రాంతి) గత 20 సంవత్సరాల నుండి ఈ మార్పు క్రమపద్ధతిలో వస్తూనే ఉంది. ఇప్పుడు మనం రాబోయే కార్యక్రమాలపై దృష్టిని పెట్టాలి. అన్నింటి కన్నా ముఖ్యమైనది యువశక్తి జాగరణ. గత రెండు మాసాల నుండి పక్షపత్రిక "ప్రజ్ఞా అభియాన్" లో "యుగ పరివర్తనలో యువత పాత్ర" అనే అంశంపై ప్రచురించడం జరిగింది. యువత ఏ యే పనులు ఏయే విధంగా నిర్వహించాలి? ఏ విధంగా సంగఠిత పరచాలి? మొదలైన అంశాలపై మార్గదర్శనం చేయడం జరిగింది.

### యువత అంటే ఎవరు?

అన్నింటికన్నా ముందు మనం యువత అంటే ఎవరు? అన్న విషయాన్ని నిర్ధారించుకోవాలి. వయస్సును బట్టి ఆలోచిస్తే 12 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల వరకు అని చెప్పవచ్చు. ఈనాటి లెక్కల ప్రకారం ఆ వయస్సువారు 55 కోట్ల మంది ఉన్నారు. రాబోయే 6 సంవత్సరాలలో 70 కోట్లవరకు రావచ్చు. భారతదేశ జనాభాలో సగభాగం యువతదే. వయస్సును బట్టికాక దేనిని బట్టి యువతను లెక్కించాలి? అన్న ప్రశ్న ఎదురౌతోంది. నిరుద్యోగంతో, మాదకద్రవ్యాల మత్తులో గూండాయిజంతో హద్దులు తప్పి ప్రవర్తిస్తూ ఉన్న వారు యువతగా లెక్కించడానికి అర్హులుకారు. మరి ఏవిధంగా లెక్కించాలి? ఒక్కసారి పెద్దల వాక్కులను గుర్తుకు తెచ్చుకుందాం.

**గురుదేవుల మాట ప్రకారం :**

గురుదేవులు చైతన్యవంతులైన కార్యకర్తల గురించి తెలుపుతూ హనుమంతుని ఆదర్శంగా తీసుకున్నారు. "హనుమంతుడు నిత్య యువకుడు. శ్రీరామ కార్యాన్ని విరామం లేకుండా నిర్వహించిన సాధకుడు. వాయువేగంతో చురుకుగా పనిచేసేవారు. పనిలో నిమగ్నత చూపేవారు, వ్యాయామం ద్వారా ఎప్పుడూ ఆరోగ్యంగా జీవించేవారు, స్వావలంబులు, స్వాధ్యాయశీలురు, కళలలో నైపుణ్యం కలవారు, నిర్మాణాత్మకమైన పనులకు సహకరించేవారు మాత్రమే నిజమైన యువత". అని తన 80 ఏండ్ల వయస్సులో "యువా సంసద్" గురించి వ్రాస్తూ తెలియచేశారు. యువతను గుర్తించడానికి ఇదే సరిఅయిన గీటురాయి అని చెప్పవచ్చు.

**ఉపనిషత్తుల ప్రకారం :**

తైత్తరీయోపనిషత్తులో ఒక సూత్రం ఉంది. "యువాస్యాత్ । సాధుయువా, అధ్యాయకః । ఆశిష్ఠో, బలిష్ఠః" (వల్లీ 2 అనువాదం అష్టమశ్లోకం 2) "యువకుడవు కావాలి అనుకుంటే సాధుస్వభావం కావాలి. అధ్యయన శీలుడవుకావాలి. ఆశావాదివి కావాలి. దృఢ నిశ్చయం కావాలి. బలిష్ఠుడవు కావాలి". అని అర్థం. 'సాధు' శబ్దం యొక్క అర్థం సజ్జనశీలత, శాలీనత. "యువాబనే సజ్జన శాలీన్, దే సమాజకో దిశానవీన్" అనేది మన ఉద్యమానికి ఒక నినాదం. "శాలీనత" అంటే వినయం. వినయవిధేయతలతో దేనినైనా సాధించుకోవచ్చు. అటువంటి వారే యువత అనిపించుకుంటారు. శ్రేష్ఠులైన, చరిత్ర గలిగిన యువతనే ఋషులు కోరుకుంటారు. ఈనాటి యువతలో వినయం లోపిస్తుంది. అందువల్లనే మూర్ఖులుగా, గూండాలుగా, అవి నీతిపరులుగా తయారవుతున్నారు. "అధ్యాయక్" అనగా అధ్యయనం చేసేవారు. ప్రతిరోజూ స్వాధ్యాయం చేయడం వల్ల మనస్సు వికసిస్తుంది. స్వాధ్యాయ శీలురైన యువతనే ఋషులు కోరుకుంటారు. ఈనాటి భారతీయ యువత విజ్ఞానాన్ని సంపాదిస్తోంది. కాని విజ్ఞానంతో పాటు జ్ఞానాన్ని కూడ సంపాదించాలి. అప్పుడే అందరికీ ఆదర్శంగా జీవించ గలుగుతుంది. యువత ఆశావాదిగా ఉండాలి. పనిచేయడంలో నేర్పరిగాను, మార్గదర్శనంలో సమర్ధవంతంగాను ఉండాలి. ఆశావాది అయిన యువత ఏలాంటి ఒత్తిడులకు లొంగిపోదు. తన కార్యక్రమాన్ని స్వయంగా రచించుకోగలుగుతుంది. అలాంటివారు తమలోని వ్యతిరేక భావాలను తొలగించుకొని అందరితో కలసి మెలసి పని చేయగలుగుతారు. అలాంటి యువతనే ఋషులు కోరుకుంటారు. "ధృఢిష్ఠ్" అంటే దృఢ నిశ్చయంగలవారు. దృఢం అంటే మానసిక నిగ్రహం. ఇంద్రియ

**తపము ప్రశాంతతకు మొదటి మెట్టు.**

నిగ్రహం కలవారు ఆరోగ్యవంతులుగా ఉంటారు. ఈనాటి యువత యోగాను వదిలి కుప్పిగంతులు వేస్తోంది. సంతులిత ఆహారం తీసుకుంటూ నియమిత యోగాభ్యాసం చెయ్యాలి. అన్ని విధాలా సంయమాన్ని పాటించాలి. మనస్సును దృఢ పరచుకోవాలి.

స్వామీ వివేకానంద కఠోపనిషద్‌లోని సూత్రాన్ని తెలియచేశాడు. "ఉత్తిష్ఠత జాగృత ప్రాప్య వరాన్ని బోధిత" "సోమరి తనాన్ని వదిలి, ఏలాంటి భ్రమలలో పడకుండా, ఆగకుండా పని చేసుకుంటూ పోయేవారే సరి అయిన యువత" అలాంటి వారు చేపవలె సమస్యల లోనుండి ఈదుకుంటూ పోతారు. మానసికంగానే కాక శారీరికంగా కూడ బలవంతులైన యువతకావాలి. అందుకే వివేకానంద ఇనుపకండరాలు, ఉక్కునరాలు కలిగిన యువతను కోరుకున్నాడు. పైన తెలిపినవన్నీ సాధించుకున్న నాడు ప్రపంచాన్నే జయించవచ్చు.

## గురుసత్తా తెలిపిన సూత్రాలు

పరమపూజ్య గురుదేవులు స్వయంగా తాము జీవించిన విధానాన్నే మనకు కూడ సూచించారు.

1) బలవంతమైన యువత–బలవంతమైన దేశం
2) విద్యావంతమైన యువత–ప్రగతిశీల దేశం
3) సంస్కారవంతమైన యువత–శ్రేష్ఠమైన దేశం
4) స్వావలంబి అయిన యువత–సంపన్నమైన దేశం
5) సేవా సక్తమైన యువత–సుఖవంతమైన దేశం
6) సహకార సంపన్నమైన యువత–సమర్థవంతమైన దేశం

## యువత యొక్క బాధ్యత

ఇప్పుడు మనం యుగసంధిలో చిక్కుకుని ఉన్నాం. మహర్షి దయానంద, స్వామి వివేకానంద సరిఅయిన సమయంలో విప్లవ శంఖం ఊదారు. ఝాన్సీ లక్ష్మీబాయి, తాంత్యాతోపే, భగత్‌సింహ్ మొదలమైన విప్లవకారులు పునాదులు వేశారు. ఆ పునాదులుపై విశాల భవనం నిర్మించాల్సి ఉంది. గురుదేవుల అభీష్టం మేరకు యుగనిర్మాణం జరగాలి. యుగ నిర్మాణం జరగాలంటే మొట్టమొదట యువతను సంగఠిత పరచాలి. ఏకైక లక్ష్యంతో పని జరగాలి. నియమిత ఉపాసన ద్వారా క్రమశిక్షణతో ముందుకు సాగాలి. పరమేశ్వరుని ఆదర్శాలను స్వీకరించి, ధర్మాన్ని నడిపించాలి. గురుదేవుల ఆశయం మేరకు యుగ నిర్మాణ కార్యక్రమాలు చేపట్టాలి. స్వాధ్యాయంతో జ్ఞానాన్ని పెంచుకోవాలి. తోటివారిని ప్రోత్సాహపరచి ఉద్యమంలోనికి చేర్చుకోవాలి. దేశంలో పాతుకుపోయిన మాదకద్రవ్యాల వాడకం, దుర్వ్యయం, ఆడంబర వివాహాలు, అశ్లీలత, ఉగ్రవాదం మొదలైన వాటిని తొలగించే ప్రయత్నం చెయ్యాలి. గ్లోబల్ వార్మింగ్, నీటికొరత, ప్రపంచీకరణ వ్యామోహం, నగర జీవితంపై వ్యామోహం, నిరుద్యోగిత, గోవధ వంటి అవాంఛనీయ పరిస్థితులను తొలగించాలి.

## మన యువ సంఘాలు

అఖిల విశ్వ గాయత్రీ పరివార్ యువతను సంగఠితపరచి యువ మండళ్లను తయారుచేసింది. మహానగరాలలో, విదేశాలలో "గాయత్రీ పరివార్ యూత్ గ్రూప్" (జి.పి.వై.జి.) అని పేరు పెట్టింది. సంగఠనకు మూలం యువామండళ్లే. ఇది గ్రామాల నుండి మొదలుకుని పట్టణాల వరకు ప్రాకింది. దేవ సంస్కృతీ విశ్వవిద్యాలయం యువామండళ్లకు స్ఫూర్తి. భారతీయ సంస్కృతీ జ్ఞాన పరీక్షలు ప్రపంచవ్యాప్తంగా నడవడానికి యువతయే మూలాధారం. ఈ యువామండళ్లకే "దియా" అని పేరు. (DIYA) 'దియా' అంటే "డివైన్ ఇండియా యూత్ అసోసియేషన్" (దివ్యభారత నిర్మాణానికి సంకల్పించబడిన సమూహము) ఇది పాఠశాలలలోను, మహా విద్యాలయాలలోను, విశ్వ విద్యాలయాలలోను, కార్పరేట్ సంస్థలలోను, కార్యాలయాలలోను నడుపబడుతోంది. జాతి, సంప్రదాయాలను దాటి ఈ ఉద్యమం దేశమంతటా వ్యాపించిపోయింది. లక్ష్యాన్ని చేరుకోవడానికి ఉద్యమిస్తోంది. సత్ఫలితాలు ఆరంభం అయ్యాయి.

## ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటి?

మనం దీనిని క్రమశిక్షణాయుతంగా నడపాల్సిఉంది. దీని కోసం శాంతికుంజ్ హరిద్వార్‌లోని దేవ సంస్కృతీ విశ్వ విద్యాలయంలో ఒక ప్రత్యేక విభాగం ఏర్పాటు అయింది. సంఘఠన యొక్క రీతి, నీతులను తెలియచేయడానికి 'మార్గ దర్శనం' పేరుతో పుస్తకాలు తయారైనాయి. 'దియా' గురించి కూడ ఒక మార్గదర్శిక తయారవుతోంది. 2010 వసంతపంచమి నాటికి అందరికీ అందించబడుతుంది. జిల్లా సమావేశాల వలె ప్రతిసంవత్సరం విభిన్న ప్రాంతాలలో యువా సమ్మేళనాలు జరుగుతాయి. ఇప్పటికే ఉత్తర ప్రదేశ్, బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలలో నియమిత రూపంలో నడుస్తూఉంది. ఆస్ట్రేలియా, అమెరికా, కెనడా, యు.కె. లలో ప్రాంతీయ–జాతీయ స్థాయిలలో శిబిరాలు నడుస్తూ ఉన్నాయి. జన్మశతాబ్దిని దృష్టిలోపెట్టుకుని యువతను యువతద్వారా కనీసం 1 శాతం సంఖ్యనైనా యుగ నిర్మాణం వైపు త్రిప్పగలగాలి. సంకల్పబలం ఉంటే తప్పక చేయగలుగుతాం.

★★★

**తపము ఆత్మోన్నతికి రెండవ మెట్టు.**

# ఏ పుస్తకంలో ఏముంది?

## భావ సంవేదనల గంగోత్రి

రచన : *పండిత శ్రీరామ శర్మ ఆచార్య*

అనువాదం : *శ్రీ డి.వి.ఆర్. మూర్తి*

ఇది క్రాంతి ధర్మి సాహిత్యంలోని 17వ ఆణిముత్యం. ఈ పుస్తకంలో భావ సంవేదనల విలువ, మహత్వం, ఉపయోగం కళ్ళకు కట్టినట్టు చెప్పే ఎనిమిది కథలున్నాయి.

ఈనాడు విజ్ఞానం ధనానికి బానిస. ధనం దుర్బుద్ధి చేతిలో కీలుబొమ్మ అయింది. తమను తాము జ్ఞానులమని, విద్యాంసులమని, తెలివిగలవారమని, బలవంతులమని చెప్పుకొనేవారు, దుర్బుద్ధికి బానిస అయ్యారు అంటాడు వేదవ్యాసుడు. ఇలాంటి వారి మనస్సులను మార్చే ప్రయత్నాలు వేదవ్యాసుని రచనలలో కనిపిస్తాయి. విశ్వంభర మిశ్రా భావసంవేదనల వల్ల చైతన్య మహాప్రభు ఎలా అయ్యాడో ఒక కథ చెప్తుంది.

మన అవసరాలను ప్రక్కన పెట్టి ఇతరుల అవసరాలను తీర్చే ప్రయత్నం మనలో కరుణ ఉప్పొంగిందనటానికి గుర్తు. హృదయంలో వేదన జనిస్తే భోగలాలస మీద వ్యామోహం పోతుంది. ఆండాల్ ప్రపంచమునే భగవంతుని స్వరూపంగా భావించి, దానిని అందముగా తీర్చిదిద్దటమే భక్తి అంటుంది. భక్తుడనీ చెప్పుకునే వ్యక్తి యొక్క హృదయం ఇతరుల వ్యథకు ద్రవించకపోవడం ఎలా సాధ్యం అంటుంది ఆండాల్.

ఒక అద్భుత సన్నివేశంలో చండ అశోకుడు మహా అశోకుడుగా మారుతాడు. నవ్వేవాణ్ణి ఏడిపించడం, బ్రతికి ఉన్నవాణ్ణి చంపడం, దోపిడి చేయడం వీరత్వంగా భావించిన అశోకుడు ఒక ముసలివాడి వాగ్బాణాలతో మారిపోతాడు. కరుణలోని దివ్యత్వాన్ని, కీర్తికాంక్షలోని మాలిన్యాన్ని తెలుసుకుంటాడు. ఒక శిలా శాసనంలో "అందరి మేలులో నా మేలు ఉందని నేను ఎన్నడు మరువను. జీవన సాఫల్యతకు ఇదే సూత్రం" అన్నాడు అశోకుడు.

జీసస్ "నిర్దయ" అనేది మనలో తీసివేయగలిగితే భగవంతుని ప్రవేశానికి అడ్డుతొలగించినట్లు అవుతుందని అంటాడు. గాంధీగారు, చాలీచాలని చీరను శరీరానికి కప్పుకున్న యువతికి తనకున్న రెండు ధోవతులలో ఒకటి ఇచ్చి మహాత్ముడనిపించుకున్నాడు.

పృథ్విపై స్వర్గావతరణకు దివ్య సంవేదనల మేలుకొలుపు జరగాలి. ఇలాంటి భావసంవేదనల గంగోత్రిని మన మనస్సులలో దింపుకుని పృథ్విని స్వర్గంగా మార్చే ప్రయత్నం చేయుమని ఈ పుస్తకం సందేశమిస్తున్నది.

## మహిళాజాగరణోద్యమం

రచన : *పండిత శ్రీరామ శర్మ ఆచార్య*

అనువాదం : *శ్రీమతి బచ్చు జయలక్ష్మి*

ఈ పుస్తకం క్రాంతిధర్మీ సాహిత్యంలోని 18వ ఆణిముత్యం. పూర్వకాలంలో స్త్రీమూర్తికి అత్యంత గౌరవసత్కారాలు లభించేవి. ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు నివసిస్తారని చెప్పబడింది. పురుషుడితో సమానంగా స్త్రీని గౌరవించేవారు. క్రమ క్రమంగా అనేక కారణాల వల్ల ఆమెకు దక్కవలసిన గౌరవ మర్యాదలుపోయి పురుషుడు అధికుడని స్త్రీ తక్కువ స్థాయికి చెందినదనే భావన ప్రజలలో ప్రబలిపోయింది.

పూర్వకాలంలో స్త్రీలు స్వయంవరంలో భర్తను ఎన్నుకొనేవారు. వివాహ సమయంలో కన్యను దానం ఇవ్వడం మహాభాగ్యంగా భావించేవారు. ఈనాడు కన్యాదానం అంటున్నప్పటికి ఈ "దానం" పుచ్చుకోవటానికి కట్నాలు గుంజుతున్నారు.

ముస్లిం ఆక్రమణ మనదేశం మీద జరిగినపుడు, ఆడపిల్లలను వారినుండి రక్షించుకోవడానికై ఇంట్లోనే ఉంచవలసిన పరిస్థితి వచ్చింది. చదువులు అక్కర్లేదన్నారు. క్షేమంగా ఉంటే చాలనుకున్నారు. చిన్న వయస్సులోనే పెళ్ళిళ్ళు చేసేవారు. క్రమక్రమంగా జరిగిన వందల సంవత్సరాలలో ఆడ పిల్లల వాస్తవ సత్తా మరచి వంట మనిషిగా చాకలిగా, పని మనిషిగా, కామం తీర్చే సాధనంగా ఉపయోగించారు. ఆడవారికి ప్రాతివ్రత్యం తప్పనిసరి. కాని మగవాడికి పత్నీవ్రతం అవసరం లేదు. విధవరాలు అయితే ఎన్నో ఆంక్షలు, కాని భార్యపోతే రెండో వివాహం చేసుకోవచ్చు. ఆడవారిని ఆర్థికంగా అవిటిని చేయటం, అడుగడుగున కనబడుతుంది. ఇలా క్రమక్రమంగా స్త్రీజాతి తమ గొప్పదనాన్ని పోగొట్టుకుంది. స్త్రీజాతి ప్రగతికి అవసరమైన వాతావరణం యొక్క ద్వారాలు మూసుకుపోయాయి. ఈనాడు కొంతమంది స్త్రీలు అక్కడక్కడ పెద్ద పదవులు అలంకరించినా ఆమెకు దక్కవలసిన గౌరవం లభించడం లేదనే చెప్పాలి.

రాబోయే యుగం నారీయుగం ప్రధానం అన్నారు. స్త్రీ జాతికి తిరిగి పూర్వ వైభవం కలిగించే ప్రయత్నాలు అందరూ చేయాలని తద్వారా భూమిపై స్వర్గావతరణకు దోహదం చెయ్యాలని ఈ పుస్తకం సందేశమిస్తున్నది.

**తపము ద్వారా మానవుడు స్వార్థానికి దూరం అవుతాడు.**

## వరద భీభత్సం - గాయత్రీ పరివార్, ఆంధ్రప్రదేశ్ శాఖ

# సహాయకార్యక్రమాలు (ఒక నివేదిక)

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రజలపై ప్రకృతి కన్నెర్ర చేసింది. తుంగభద్రా కృష్ణమ్మలు చేతులు కలిపాయి. విలయతాండవం చేస్తూ ప్రళయాన్ని సృష్టించాయి. శతాబ్దం తర్వాత కనీవినీ ఎరుగని రీతిలో వందలాది గ్రామాలు నీటమునిగాయి. ముఖ్యంగా తుంగభద్రానదికి రెండు వైపులా ఉన్న గ్రామాలు మంత్రాలయంతో సహా అంచనాలకు అందని రీతిలో నీటిపాలయ్యాయి. కర్ణాటకలోని తలమారి తదితర గ్రామాల ప్రజలు కట్టుబట్టలతో మిగిలిపోయారు. అదే విధంగా కర్నూలు పట్టణంలోని 1వ టౌను మాటలకందని విధంగా నష్టపోయింది. చుట్టుప్రక్కల గ్రామాలు సరేసరి. 10 నుండి 15 అడుగుల వరకు నీరు ఇండ్లల్లో నిలిచిపోయింది. పరమాత్ముని కృపవల్ల, తీసుకున్న ముందు జాగ్రత్తల వల్ల ప్రాణ నష్టం జరుగ లేదు. ఆస్తి నష్టం అపారం.

ఈ వార్తలను విన్న వెంటనే డా॥ ప్రణవ్ పాండ్యాజీ, డా॥ గౌరీ శంకరశర్మ, డా॥ బ్రిజ్‌మోహన్‌గౌడ్ గార్లు శాంతికుంజ్ హరిద్వార్ నుండి స్పందించి వెనువెంటనే వరదబాధితులకు తగిన సహాయక చర్యలను చేపట్టవలసినదిగా, శ్రీ అశ్విని సుబ్బారావు గాయత్రీ చేతనాకేంద్రము హైదరాబాద్ వారిని ఫోనుద్వారా కోరడమైనది. హైదరాబాదు గాయత్రీ పరివార్ పరిజనులు 7-10-09 నుండి 22-10-09 వరకు కర్నూలులో సహాయ శిబిరం ప్రారంభించారు. 6-10-09 నాడు హైదరాబాదు చేతనా కేంద్రంలో పరివార్ సభ్యులతో సమావేశం జరిగింది. అభిమానుల ఆదరాభిమానాలతో సుమారు 20 లక్షల రూపాయల సహాయం వాగ్దాన రూపంలో లభించింది.

శాంతికుంజ్ హరిద్వార్ నుండి శ్రీరాకేశ్ జైస్వాల్ (డిసాస్టర్ మేనేజ్ మెంట్ విభాగం) ఉత్తమ్ గైక్వాడ్ (శాంతికుంజ్ ప్రతినిధి) శ్రీవేణుగోపాల రెడ్డి (చేతనాకేంద్ర ప్రతినిధి) తగిన వస్తు సామాగ్రితో 7వ తేదీన కర్నూలుకు చేరుకున్నారు. క్రింది సభ్యులతో జిల్లా సహాయక టీమ్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. 1) శ్రీ వి.వెంకటేశులు (బెంగుళూరు - రాయలసీమ కో ఆర్డినేటర్) 2) శ్రీ గురురాజారావు 3) శ్రీ కె. చంద్రశేఖర్ 4) శ్రీ జి.పి.ఆర్. శశిధర్ 5) శ్రీ ఆర్. శ్రీనివాస్ 6) శ్రీ కె.సుబ్బారాయుడు 7) శ్రీ కె. శ్రీనివాసులు 8) శ్రీ బి.మల్లికార్జున్ 9) శ్రీ కిరణ్ కుమార్ 10) శ్రీ ఎన్.వి.కుమార్

మొట్టమొదట కర్నూలు పట్టణాన్ని కేంద్రంగా చేసుకుని సహాయక బృందం తన కార్యక్రమాలను ప్రారంభించింది. జిల్లా యంత్రాంగ సహాయంతో వరదతాకిడికి బాగా దెబ్బతిన్న లోతట్టు గ్రామాలను గుర్తించడం జరిగింది.

8వ తేదీన మధ్యప్రదేశ్ బేతుల్ పట్టణం నుండి ఇద్దరు డాక్టర్లు మందులతో సహా కర్నూలుకు చేరుకున్నారు. మరునాడు గుజరాత్‌లోని అహమ్మదాబాద్ నగరం నుండి రెండవ వైద్య బృందం మందులతో సహా వచ్చి చేరింది. కర్నూలుజిల్లా మార్కెటింగ్ యార్డ్ చైర్మన్ శ్రీ రామభూపాల రెడ్డి సూచన ప్రకారం 'బాలసాయి ఇంటర్నేషనల్ స్కూల్లో వైద్యశిబిరం ప్రారంభించడం జరిగింది.

తర్వాత ముడుమాల, పలదొడ్డి, గుండ్రేవుల గ్రామాలలో సంచార శిబిరం ద్వారా వైద్య సహాయం అందించడం జరిగింది. ప్రధానంగా జ్వరం, ఒళ్ళునొప్పులు, జలుబు, దగ్గు, విరేచనాలు మొదలైన వాటికి తక్షణ సహాయం అందించారు.

ఒక వైపునుండి వైద్య సహాయం అందుతుంటే, మరోవైపు నుండి తక్షణావసరాలను తీర్చేనిమిత్తం బాగా దెబ్బతిన్న కుటుంబాల వారి జాబితా తయారుచేశారు. వారికి బియ్యం, పప్పు, ఉప్పు, కారం, నూనె, వంటపాత్రలు, పిల్లల ఆహారం, దుప్పట్లు, కట్టుకునేవస్త్రాలు, చాపలు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, సబ్బులు, పళ్ళాలు, గ్లాసులు మొదలైనవన్నీ తక్షణ అవసరాలుగా గుర్తించుట జరిగింది. ముట్టిన వారికే ముట్టకుండా జాగ్రత్తలు తీసుకుని నిజమైన బాధితులకు అందించడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేసిరి.

గాయత్రీ చేతనా కేంద్రం హైదరాబాదు నుండి టార్పాలిన్లు, బిస్కట్లు, ప్లాస్టిక్ బకెట్లు, మగ్గులు, వంటపాత్రలు మొదలైనవాటితో పాటు పైన తెలిపినవన్నీ రెండు లారీలలో వచ్చి చేరాయి. కర్ణాటక

**తపస్వి యొక్క తేజస్సు ప్రపంచమంతటా వ్యాపిస్తుంది.**

పరివార్ నుండి కిరోసిన్ స్టౌలు, కిరోసిన్‌తో పాటు నిత్యావసర వస్తువులు వచ్చిచేరాయి. బెంగుళూరు దియా గ్రూప్ నుండి (యువత) శ్రీ జి.రాజీవ్ నాయకత్వంలో ధన సహాయం అందింది. అట్లే తమిళనాడు గాయత్రీ పరివార్ నుండి (తిరుపూర్) పిల్లలకు, రెడీమెడ్ దుస్తులు, చీరలు, బనియన్లు, లుంగీలు, టీషర్టులు, ధోవతులు మొదలైనవన్నీ రెండు లారీలలో వచ్చి చేరాయి.

పై సామాన్లను అన్నింటినీ ఓపిగ్గా, కిట్లుగా తయారు చేశారు. గుర్తించిన కుంటుంబాల వారికి టోకన్లు ఇచ్చి పద్ధతిగా పంపిణీ చేయడం జరిగింది. అదే విధంగా గుంటూరు జిల్లాలోని నర్సారావుపేటలోని పరిజనులు రెండు బృందాలుగా ఏర్పడి బియ్యం, పప్పు, ఉప్పు మొదలయిన సరుకులు నేర్పుగా, ఓర్పుగా అందించడం జరిగింది.

ఈ కార్యక్రమాలన్నింటిలో దాదాపు 70 మంది పరిజనులు స్వయంగా పాల్గొని త్రికరణ శుద్ధిగా సహాయాన్ని అందించడం జరిగింది. మొత్తం మీద 24 గ్రామాలలో 15,000 మందికి వైద్య సహాయం అందించడం జరిగింది. 5000 మందికి 66.6 లక్షల విలువ గల వస్తు సామాగ్రిని పంచడం జరిగింది. వరదబాధితులకు సహాయం అందించిన పరిజనులు, ఇతర సభ్యులు :

**వైద్య బృందం :**

**మధ్యప్రదేశ్ బెతూల్ నుండి :** డా॥ సి.హెచ్ వర్మ, శ్రీమతి శైలజావర్మ (దంపతులు), రాజేశ్‌సాహు

**గుజరాత్ – అహమ్మదాబాద్ నుండి :–** డా॥బీకూభాయ్, శ్రీ టి.పటేల్, శ్రీ మంగళ్‌భాయ్, శ్రీ ఎమ్‌పటేల్, శ్రీ జీతూలాల్, శ్రీ రమేశ్ ప్రజాపతి.

**కర్ణాటక నుండి :–** శ్రీ బి.సి.త్యాగి, శ్రీ సుగన్ సింగ్, శ్రీ సత్యకామసేన, శ్రీ రోషన్‌జీ, శ్రీ రాజీవ్ నాయకత్వంలో దేవ సంస్కృతీ విశ్వ విద్యాలయ యువ బృందం.

**గాయత్రీ చేతనా కేంద్రం, హైదరాబాదునుండి :–** శ్రీ పూల్‌సింగ్, శ్రీ సంతోష్ ద్వయం, శ్రీ శంకర్.

**తిరుపతి నుండి :–** శ్రీమతి మునిలక్ష్మమ్మ – అన్నపూర్ణ

**తిరుపూర్ నుండి :–** శ్రీ రిషభ్ నారాయసింగ్, శ్రీ హరీష్ వ్యాస్

**చెన్నై నుండి :–** ఇద్దరు కార్యకర్తలు

**ఆదోని నుండి :–** శ్రీ విజయ గోపాల రెడ్డి నాయకత్వంలో శ్రీ పరమేశ్వరప్ప, శ్రీ ఆంజనేయులు, శ్రీ రామాంజనేయులు, శ్రీ అల్లప్ప, శ్రీ విక్రమ్‌కుమార్, శ్రీ నాగరాజు

**కర్నూలు నుండి :–** ప్రొఫెసర్ సత్యన్నారాయణ వర్మగారి నాయకత్వంలో శ్రీమతి హరిప్రియ, శ్రీ శ్రీనివాస్, శ్రీ.సమీర, శ్రీ పవన్‌కుమార్, శ్రీ భార్గవ, శ్రీ సుదర్శన్, శ్రీ రాఘవ, శ్రీ శశికాంత్, శ్రీ హరీష్, శ్రీ ఈశ్వర్, శ్రీ హరనాధపవన్, శ్రీ సాయి, శ్రీ శ్రీధర్, శ్రీ షియాజ్, శ్రీ శరత్, శ్రీ రవితేజ, శ్రీ సందీప్.

**నర్సరావుపేటనుండి :–** శ్రీ హనుమంతరావు, శ్రీ కోటేశ్వర్రావు, శ్రీ బి. శ్రీనివాసరావు, శ్రీ బుచ్చిబాబు, శ్రీ సీతారామాంజనేయులు, శ్రీ వెంకటేశ్వర్లు, శ్రీ అచ్చయ్య

దక్షిణభారత ప్రధాన సంచాలకులైన శ్రీ అశ్వినీ సుబ్బారావు, వారి ధర్మ పత్ని మహేశ్వరిగార్లు స్వయంగా కర్నూలుకు విచ్చేసి వస్తు పంపిణీ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు.

గాయత్రీ పరివార్ – ఆంధ్రప్రదేశ్ శాఖ, శాంతికుంజ్ – హరిద్వార్ వారి ఆశీస్సులతో, గాయత్రీ చేతనా కేంద్రం – హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో, సమాజ సేవలో తన వంతు బాధ్యతను జనరంజకంగా పూర్తి చేసి పలువురి ప్రశంసల నందుకొన్నది.

**సర్వేజనాః సుఖినోభవంతు**


## 2010 వార్షిక క్యాలెండరు

శ్రీ వేదమాత గాయత్రీ ట్రస్టు-చేతనా కేంద్రము, హైదరాబాద్‌వారి పంచాగముతో కూడిన 2010 వార్షిక క్యాలండరు తెలుగులో డిసెంబరు 15, 2009 నాటికి మార్కెట్ లోనికి రానున్నది - దీని వెల రూ. 6/-

6 పేజీల-ఆర్ట్‌పేపరుతో పంచరంగులలో ముద్రింపబడును - (2009 క్యాలండరు మాదిరిగా) ఈ క్యాలండర్లు కావలసినవారు వారి వారి ఆర్డర్లను రూ. 100/-కు తగ్గకుండా, గాయత్రీ చేతనా కేంద్రానికి డబ్బుచెల్లించి కాపీలను రిజర్వు చేసి కొనవలసినదిగా కోరడమైనది.


**శాంతంతో కోపాన్ని, సత్యంతో అసత్యాన్ని జయించవచ్చు.**

వార్తలు

# రాష్ట్రమంతటా జరిగిన వివిధ కార్యక్రమాలు

## తాళ్ళదుమ్మలో

దేవీనవరాత్రుల సందర్భంగా విజయనగరం జిల్లా తాళ్ళదుమ్మ ప్రజ్ఞామండలిలో 9రోజులు ఉత్సవాలు నిర్వహించబడ్డాయి. 9 రోజులూ మూడు పూటలా 25 మంది పరిజనులు ఒక్కొక్కరు పూటకు 10 మాలల చొప్పున గాయత్రీ మహా మంత్రాన్ని జపించడం జరిగింది. 27.09.2009 నాడు సాయంకాలం 4 గంటలకు 50 కలశాలతో దివ్యమైన కలశయాత్ర నిర్వహించబడింది. 28.09.2009 నాడు గాయత్రీ మహాయజ్ఞం నిర్వహింపబడింది. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి జరిగింది. చుట్టు ప్రక్కల గ్రామాల నుండి దాదాపు 100 మంది భక్తులు పాల్గొన్నారు. 9 రోజులలో మొత్తం మీద 70,000 మంత్రజపం జరిగింది.

ఈ కార్యక్రమాన్ని శ్రీ సుదర్శన అగ్నిహోత్రి, శ్రీ సంతోష్ కుమార్ నిర్వహించారు. శ్రీ ఇ.హరినారాయణ, శ్రీ ఎ.పాపారావు, శ్రీ డి.చిన్నంనాయుడు, శ్రీ ఎస్.జగన్నాథం నాయుడు తదితరులు సహకరించారు.

## కవులూరులో

దేవీనవరాత్రుల సందర్భంగా కవులూరు గ్రామంలో 21.09.2009 సాయంత్రం దీపయజ్ఞం, 22.09.2009 ఉదయం పంచకుండీయ దుర్గాగాయత్రీ యజ్ఞం నిర్వహించబడ్డాయి. శ్రీ జి.మణికుమార్ (రేపల్లె), శ్రీ బ్రహ్మారెడ్డి (నంబూరు) వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో 35 మంది భక్తులు పాల్గొన్నారు.

## పోతవరంలో

దేవీనవరాత్రుల సందర్భంగా పోతవరం గ్రామంలోని నాగదుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో 22.09.2009 సాయంత్రం దీపయజ్ఞం, 23.09.2009 సాయంత్రం దీపయజ్ఞం, 23.09.2009 ఉదయం త్రికుండీ గాయత్రీ యజ్ఞం నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి 58మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను శ్రీ జి.మణికుమార్ (రేపల్లె), శ్రీ బ్రహ్మారెడ్డిగార్లు నిర్వహించారు.

## ఒంగోలులో (బాపూజీ గోశాల)

సెప్టెంబర్ 2009 - 16,17,18,19 తేదీలలో బాపూజీ గోశాల-ఒంగోలు నందు 50మంది పరిజనులతోను, అక్టోబర్ 2009 - 15,16,17,19 తేదీలలో బాపూజీ గోశాల - ఒంగోలు నందు అమావాస్య దీపయజ్ఞాలు నిర్వహించబడ్డాయి. ఆయా తేదీలలో 54మంది భక్తులు పాల్గొన్నారు. ఋషివాటిక - ఒంగోలులో 18.10.2009 ఉ॥ గం॥ 8.45 ని॥ల నుండి గం॥ 10.50 ని॥ల వరకు 23మంది పరిజనులతోను; 11.10.2009 ఉ॥ గం॥8.40 ని॥ల నుండి గం॥ 11.05 ని॥ల వరకు 30 మంది పరిజనులతోను; 04.10.2009 ఉ॥ గం॥ 8.30 ని॥ల నుండి 11.00 గం॥ల వరకు 17మంది పరిజనులతోను; 27.09.2009 ఉ॥ 9.00 గం॥ల నుండి గం॥ 11.10 ని॥ల వరకు 16మంది పరిజనులతోనూ; 20.09.2009 ఉ॥ గం॥ 8.50 ని॥ల నుండి గం॥ 11.15 ని॥ల వరకు 29 మంది పరిజనులతోను గాయత్రీ మహాయజ్ఞాలు నిర్వహింపబడ్డాయి. పై కార్యక్రమాలను అన్నింటిని శ్రీ మలసాని వెంకటేశ్వర్లు-శ్రీమతి మలసాని శ్యామలాదేవి నిర్వహించారు.

## గాయత్రీ పరివార్ జ్ఞానరథం ఇల్లెందులో

"ప్రపంచ ప్రమాదాన్ని నిలుపు చేయాలంటే గాయత్రీ మంత్ర జపమే ఏకైక మార్గం" అంటూ ప్రచారం కొనసాగిస్తున్న గాయత్రీ పరివార్ జ్ఞానరథం 05.10.2009 నాడు ఇల్లెందుకు చేరుకుంది. రథం వెంట శాంతికుంజ్-హరిద్వార్ ప్రతినిధి శ్రీ హీర్‌సింగ్ రాజపురోహిత్, రాష్ట్ర కన్వీనర్ శ్రీ వేణుగోపాలరెడ్డి ఉన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ళలో ప్రచారం నిర్వహించారు. పరమ పూజ్య గురుదేవులు పండిత శ్రీ రామశర్మ ఆచార్య రచించిన పుస్తకాలు, సీడీలు విక్రయించడం జరిగింది. చివరకు స్థానిక సరస్వతీ పాఠశాలలో సమావేశం జరిగింది. జిల్లా కో ఆర్డినేటర్ శ్రీ సతీశ్ ఖండేల్ వాల్, పట్టణ కో కన్వీనర్లు శ్రీ ఎస్.వి.పరబ్, శ్రీమతి కృష్ణకుమారి, శ్రీ హెచ్.ఎమ్.కోటగిరి వెంకట నర్సయ్య, శ్రీ భద్రాచలం, శ్రీ పాల్వంచ, శ్రీ కారేపల్లి తదితర పరివార్ కార్యకర్తలు పాల్గొన్నారు. మాజీ రాష్ట్రపతి శ్రీ అబ్దుల్ కలామ్ వ్యక్తిత్వ నిర్మాణానికి సంబంధించిన సందేశాన్ని, విద్యార్థులు సిడి ద్వారా ప్రదర్శించి చూపించారు. దీనితో పాటు గాయత్రీ పరివార్ - యుగ నిర్మాణ ఆశయాలను ప్రదర్శించడానికి అనువుగా రథంలో బుల్లి తెరను ఏర్పాటు చేశారు.

హైదరాబాదు గాయత్రీ చేతనా కేంద్రం నుండి బయలుదేరిన ఈ రథం రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం కొనసాగిస్తుందని పెద్దలు తెలియ చేశారు.

## వరంగల్లులో - ఘనంగా ముగిసిన జిల్లా కార్యకర్తల సమావేశం

04.10.2009 ఆదివారం ఉదయం 10.00 గంటలకు వరంగల్లులో జిల్లా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ

**మంచితో చెడునీ, శౌర్యంతో దుష్టత్వాన్ని జయించవచ్చు.**

సమావేశానికి జిల్లా కన్వీనర్ శ్రీ టి. మల్లికార్జున గుప్త అధ్యక్షత వహించారు. శ్రీ హీర్‌సింగ్ రాజపురోహిత్ జ్యోతి ప్రజ్వలన గావించారు. రాష్ట్ర ఇన్ చార్చి శ్రీ వేణు గోపాలరెడ్డి, తెలంగాణా రీజియన్ ఇన్‌చార్చి శ్రీయుగంధర్ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి 70 మంది కార్యకర్తలు ఉపస్థితులయ్యారు. పూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది ఉత్సవాలకు తమ వంతు కృషి చేస్తామని కార్యకర్తలందరు సంకల్పం తీసుకోవడం జరిగింది.

## మైలారంలో నవకుండీ గాయత్రీ మహాయజ్ఞం

25.10.2009 ఆదివారం ఉదయం వరంగల్ జిల్లా మైలారం గ్రామంలో శ్రీ బొమ్మినేని రంగారెడ్డి - సుజాత దంపతులచే నిర్మించబడిన శ్రీ రామ చంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో నవకుండీయ ''గాయత్రీ మహాయజ్ఞం'' వైభవంగా నిర్వహింపబడింది. శ్రీ టి. మల్లికార్జున గుప్తా గారి పర్యవేక్షణలో శ్రీ విక్రమ్, శ్రీ మాణిక్‌లాల్ యజ్ఞాన్ని నిర్వహించారు. 500మంది పాల్గొన్న ఈ యజ్ఞంలో దేవస్థానం వారు భోజన ప్రసాదం అందించారు. ఎ.ఆర్.కె.మూర్తిగారు 5 గురి ఇండ్లలో యజ్ఞాలు నిర్వహించి, వివిధ సంస్కారాలు జరిపించారు. ''యుగశక్తి గాయత్రి''కి 9 మంది చందాదారులను చేర్పించారు.

## నంబూరులో

1.11.2009 నంబూరులో నాగవరపు అమ్మవారి దేవస్థానంలో 24 కుండముల గాయత్రి మహాయజ్ఞం గాయత్రిశక్తిపీఠం నంబూరు ఆధ్వర్యంలో రమణకుమారి గారు, డా॥ శ్రీరాం, శ్రీ సి.వి.వి రామారావు గారు బ్రహ్మజీవారి పర్యవేక్షణలో నిర్వహించబడింది. 200మంది పరిజనులు పాల్గొన్నారు.

## నెల్లూరులో

2.11.2009 గాయత్రీ చేతనాకేంద్రం నెల్లూరులో పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం నిర్వహించబడింది. తరువాత జిల్లా కన్వీనర్ శ్రీ ఆర్.బి నాయుడు ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో శ్రీమతి యల్. రాజ్యలక్ష్మి రీజినల్ కన్వీనర్ పూజ్యగురుదేవుల జన్మశతాబ్ది సమారోహం గురించి రాష్ట్ర వ్యాప్తంగా చేయవలసిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భములో శ్రీ స్వర్ణ రామచంద్రయ్య బృందం త్రావబండ అగ్రహారం, చిల్లుపాడు, యనమదల, రాజువానిపాలెం, లల్లూరు, తిరుమలపాదు మొదలైన గ్రామములలో నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరణ ఇచ్చారు. నెల్లూరు జిల్లాలో ఈ కార్యక్రమాలు ఇంకా విస్తరిస్తాయని ఆశిద్దాము.

## సామూహిక గాయత్రీ మంత్ర జపము

కలియుగంలో సంఘశక్తియే ప్రముఖమైనది. మానవజాతి సమస్యలు, సామూహిక శక్తి మరియు సంఘబద్ధత ద్వారానే పరిష్కరింపబడతాయి. ఒంటరివారు, అసంఘటిత ప్రజలు బలహీనులుగా, స్వార్థ పరులుగా పరిగణింపబడతారు.

వ్యక్తిగత ఉన్నతి,సామాజిక ప్రగతి అంతా పరస్పర సహకారం, త్యాగం, పరోపకారం మున్నగు ప్రవృత్తుల మీద ఆధారపడి ఉంటుంది. మానవజాతి ప్రగతికి, చిరకాల మనుగడకివియే సోపానములు.

### పూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది సందర్భముగా

పై లక్ష్య సాధనకై యుగ నిర్మాణ యోజనలో భాగముగా విశ్వవ్యాప్తముగా నియమిత వేళలలో నిత్యము గాయత్రీ మంత్రజపము సామూహికముగా నిర్వహించుటకై శాంతికుంజ్, హరిద్వార్ వారు ఈ క్రింది సమయములు నిర్ణయించిరి.

ఉదయం : 6.30 గం॥ నుండి 7.00 గం॥ వరకు

మధ్యాహ్నము : 1.30 గం॥ నుండి 2.00 గం॥ వరకు

రాత్రి : 7.30 గం॥ నుండి 8.00 గం॥ వరకు

పై సమయములలో ఏ ఒక్క సమయమందైనా మనము చేసెడి గాయత్రీ మంత్ర జపముద్వారా మనము విశ్వ గాయత్రీ పరివార్ జపశక్తితో జోడింపబడెదము తద్వారా ఎక్కువ ఫలితములు పొందగలం.

**గమనిక :**

**బ్యాంక్స్ ద్వారా Online Deposit చేసేవారు, Bank Deposit Xerox Copyతో బాటు వారి పేరు, చిరునామా, ఫోను నెంబరు, ఆ డబ్బు దేనికొరకు పంపుచున్నారో (Donation, Subscription for Magazine, Book Sales) గాయత్రీ చేతనా కేంద్రమునకు తెలియజేయ ప్రార్థన.**

**మానవులంతా ఒకే దేవుని సంతానం.**